

స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టండి

టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు 2

'డు నాట్ డిస్టర్బ్' ఆప్షన్‌తో పరిష్కారం!

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 14-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 120 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.24 తదుపరి దశమి; నక్షత్రం: అనూరాధ మ. 12.13 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: సా. 5.58-7.37; దుర్ముహూర్తం: ఉ. 11.54-12.44; అమృతఘడియలు: తె. 3.50-5.29; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇదో అగ్గీ దందా!

అగ్రి భూములమ్మి బాధితుల్ని ఆదుకుంటానన్న జగన్

అదే హామీతో అధికారంలోకి.. కానీ, ఆ భూములపైనే కన్నేసిన నాటి మంత్రి

పక్కాగా కాజేసేందుకు జోగి ఫ్యామిలీ ప్లాన్.. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఆ భూములు

బాబాయ్, కొడుకు ద్వారా 2160 గజాల అగ్రి భూముల కొనుగోలుకు రమేశ్ డ్రామా

'నంబరు పొరపాటు' పేరిట పెద్ద నాటకం.. కొన్నది సర్వే నంబరు 88లోనివి

సర్వే నం. 87కు మార్చాలంటూ సవరణ దరఖాస్తు.. అడ్డగోలుగా రిజిస్ట్రేషన్

పూర్తిగా సహకరించిన సర్వేయర్లు, అధికారులు 11



జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేసి వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న అధికారులు

జోగి గుట్టు రట్టు

అగ్రి దందాలో జోగి తనయుడి అరెస్టు

మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంట ఏసీబీ సోదాలు

ఆ తర్వాత రాజీవ్‌ను అరెస్టు చేస్తున్నట్టు వెల్లడి

సర్వేయర్ రమేశ్ కూడా అరెస్టు..

వైద్యపరీక్షల కోసం రాజీవ్‌ను తెచ్చినప్పుడు

ఆస్పత్రి వద్ద వైసీపీ నేతల హల్‌చల్

పోలీసులపై రెచ్చిపోయిన రఘురాం

రాజీవ్, రమేశ్‌లకు 23 వరకు రిమాండ్

బీసీని కాబట్టే వేధిస్తున్నారు.. అభంశుభం తెలియనివాడిని ఇరికిస్తున్నారు: జోగి

విజయవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ భూముల కబ్జా కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. విజయవాడ రూరల్ మండలం సర్వేయర్ ఎ.రమేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులోని జోగి రమేశ్ ఇంటికి మంగళవారం ఉదయమే ఏసీబీ

మిగతా 11వ పేజీలో...

రమేశ్ పాత్రపై విచారణ చేస్తున్నాం



ఏసీబీ అదనపు ఎస్పీ సౌమ్యలత వెల్లడి

లోపలి పేజీల్లో..

నాడు మిడిసిపడి.. నేడు అడ్డంగా బుక్కయ్యి

నిజమే.. కుమారుడిని నాశనం చేసింది తండ్రే

చేసిందంతా చేసి ఇప్పుడు పెడబొబ్బలు

బూతులతో రెచ్చిపోయిన జోగి స్వరం మారింది

అగ్రి గోల్డ్ భూములతో

దందా!



జోగి దందాను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'!

జూన్ 18 ప్రధాన సంచికలో కథనం

మళ్లీ చంద్రన్న కానుకలు



పేదలకు సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలకు సన్నాహాలు

ప్రభుత్వంపై ఏటా 538 కోట్ల భారం

బియ్యంతోపాటు సబ్సిడీపై పలు సరుకులు

ప్రణాళికలు సిద్ధం చేసిన ప్రభుత్వం

రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్‌కార్డులు

వీటిలో 90 లక్షలకే కేంద్రం గుర్తింపు

ఆహార భద్రత చట్టం రాయితీ వాటికే

58 లక్షల కార్డుల భారం రాష్ట్రంపైనే

గంటల్లో కార్డులిస్తామని జగన్ బీరాలు

కేంద్రం నిర్ణయంతో 6 నెలలకు మార్పు

అదీ సక్రమంగా జరగలేదు

3.36 లక్షల దరఖాస్తులు పెండింగ్

వీటన్నిటిపై విధాన నిర్ణయం అవసరం

కొత్త రేషన్ కార్డుల జారీకి రైట్‌రైట్

పాత కార్డుల స్థానంలో కొత్తవీ పంపిణీ

సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు రేషన్ కార్డుదారులందరికీ మళ్లీ చంద్రన్న కానుకలను అందించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. నిరుపేదలు పండుగ పూటా పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన చంద్రన్న కానుకలను జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసిన సంగతి తెలిసిందే. కందిపప్పు, పంచదార, గోధుమలు ఇలా అన్నిటినీ తీసేశారు. బియ్యం పంపిణీకి మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థను పరిమితం చేశారు. ఈ నేపథ్యంలో పేదలను ఆదుకోవాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త కార్డులు ఇచ్చేందుకు కసరత్తు మొదలైంది. ప్రతి నెలా బియ్యంతోపాటు సబ్సిడీ ధరలపై పంచదార, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ప్రజా పంపిణీ అవసరాలకు గాను ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోగా మద్దతు ధర ప్రకారం సొమ్ములు చెల్లించాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే పౌరసరఫరాల శాఖను

మిగతా 3వ పేజీలో...

పారిశ్రామికం పరుగు

రాష్ట్ర వ్యాప్తంగా వంద పారిశ్రామిక పార్కులు

ఒక్కొక్కటీ 100 ఎకరాల్లో ఏర్పాటుకు యత్నం

ఉపాధి కల్పన, సంపద సృష్టి కేంద్రాలుగా

పోర్టుల నిర్మాణం.. సమీక్షలో సీఎం 11

పిల్లలంతా బడుల్లోనే

డీనిపై కఠినంగా ఉండండి: చంద్రబాబు



మంగళవారం తుంగభద్రపై గేటు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు నిమ్మల, కేశవ్

వృథాకు 'స్టాప్'లాగ్!

1625 అడుగుల వద్దే తాత్కాలిక గేటు ఏర్పాటుకు సన్నద్ధం

తుంగభద్ర డ్యాం ఇంజనీర్ల ప్రత్యేక ప్రయత్నం

ఫలిస్తే 35 టీఎంసీలు కాపాడుకున్నట్లే.. స్పిల్‌వే వరకు ఖాళీ చేస్తే మిగిలేది 42 టీఎంసీలే

కేంద్ర జలసంఘం నిరంతర సంప్రదింపులు

భారీ క్రేన్ల సాయంతో 'గ్రూప్స్'లో గేటు అమరిక

తయారీలో 60 మంది సిబ్బంది నిమగ్నం

వెడల్పు 60 అడుగులు, ఎత్తు 20 అడుగులు

బరువు 65 టన్నులు.. 5 సెగ్మెంట్లుగా తయారీ

కొట్టుకుపోయిన గేటు 45 టన్నులే

డ్యాంను పరిశీలించిన కర్ణాటక సీఎం

ఏపీ మంత్రులు నిమ్మల, కేశవ్ కూడా

రాతి కట్టడం కావడం వల్లే స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేయలేదు

దేశంలో ఎక్కడా తుంగభద్ర లాంటి డ్యాం లేదు: కన్నయ్యనాయుడు

(కర్నూలు/అమరావతి - ఆంధ్రజ్యోతి)

కళ్లముందే కడలి వైపు వెళ్లిపోతున్న తుంగభద్ర జలాలను కాపాడేదెలా? కొట్టుకుపోయిన గేటు స్థానంలో 'స్టాప్‌లాగ్'ను అమర్చాలంటే.. డ్యామ్‌ను ఏ స్థాయికి ఖాళీ చేయాలి? పదులకొద్దీ టీఎంసీలు వృథాగా పోతే సీమ రైతుల పరిస్థితి ఏమిటి? ఈ అంశాలపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. తుంగభద్ర జలాశయంలోని నీటిని వీలైనంతగా కాపాడుకునేలా.. స్టాప్‌లాగ్ అమర్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. గేటు కొట్టుకుపోయే సమయానికి జలాశయంలో 105.78 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇప్పుడు నీటిమట్టం 1629 అడుగులు ఉండగా... 91.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అంటే ఇప్పటికే దాదాపు 14 టీఎంసీల నీరు వృథా అయ్యింది. నీటిమట్టం స్పిల్‌వేకంటే కిందికి దిగితే తప్ప... అంటే 1613 అడుగులకు చేరాకే స్టాప్‌లాగ్ అమర్చగలమని తొలుత భావించారు. అంటే... అప్పుడు నీటినిల్వ 42 టీఎంసీలకు చేరుకుంటుంది. ప్రస్తుతమున్న నిల్వ ప్రకారం చూసినా... దాదాపు 50 టీఎంసీల నీటిని వదులుకున్నట్లే! ఇది కరువు రైతులకు కన్నీరు తెప్పించే అంశమే. ఈ నేపథ్యంలో... వీలైనంతగా నీటిని కాపాడుకునే దిశగా పలురకాల వ్యూహాలు రచిస్తున్నారు. 1625 అడుగుల మట్టం వరకు

మిగతా 12వ పేజీలో...

సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్!

ప్రజలతో సంబంధం ఉండే శాఖలకు అనుమతి



ఐదేళ్లు దాటితే తప్పనిసరి బదిలీ

ఇతరుల్లో పరిపాలనాపరమైన అవసరాల మేరకు ట్రాన్స్‌ఫర్లు

రెవెన్యూ, పౌరసరఫరాలు, గనులు, పంచాయతీరాజ్, మున్సిపల్‌కు వర్తింపు

గ్రామ వార్డు సచివాలయాలకూ..

నేడో, రేపో ఆదేశాలు వెలువడే అవకాశం

ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, అన్ని శాఖల్లోనూ కాకుండా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే శాఖల్లో మొదట బదిలీ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు నేడో రేపో వెలువడే అవకాశం ఉందని తెలిసింది.

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఐదేళ్లపాటు ఒకేచోట ఉద్యోగం చేస్తున్నవారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. మిగిలిన ఉద్యోగులను పరిపాలనాపరమైన అవసరాల మేరకు బదిలీ చేయనున్నారు. తాజా నిబంధనల ప్రకారం ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో ఉన్న ఉద్యోగులంతా బదిలీల పరిధిలోకి వస్తారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల వివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టాలనుకున్న రెవెన్యూ గ్రామ సభలను బదిలీల నేపథ్యంలోనే వాయిదా వేసింది. ప్రాథమికంగా రెవెన్యూ ల్యాండ్స్, సివిల్ సప్లైస్, గనులు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో బదిలీలు జరుగుతాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, వెటర్నరీ, ఎక్సైజ్, ఇతర శాఖల్లో బదిలీలు ఇప్పుడే ఉండవు. ఎక్సైజ్‌లో కొత్త

మిగతా 2వ పేజీలో...

రెవెన్యూ సదస్సులు వాయిదా 2

ఉద్యోగుల బదిలీ ప్రక్రియే కారణం.. ఒకేసారి రెండూ చేపడితే ఇబ్బందే

సెప్టెంబరు తొలివారంలో నిర్వహణ.. త్వరలో షెడ్యూల్: మంత్రి అనగాని



3

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

అవినీతి, అవకతవకలపై క్షేత్రస్థాయిలో విచారణ

ఎమ్మెల్యేల ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం



3

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో..

ఈడబ్ల్యూఎస్ కోటా జీవో సస్పెన్షన్

కన్వీనర్ కోటాలో ఇది చెల్లదన్న హైకోర్టు

ఎన్ఎంసీకి విరుద్ధంగా ఉందని వెల్లడి

ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు

కౌంటర్ దాఖలుకు కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశం



12

కుల గణనపై గ్రామస్థాయి పోరాటం

బీజేపీకి రాజ్యాంగంపై గౌరవం లేదు

అదానీ.. ప్రధాని మోదీ బినామీ: షర్మిల

ఉత్తరాంధ్రకు సుజలం!

విశాఖకు గోదావరి జలాల తరలింపునకు కార్యాచరణ సిద్ధం

పోలవరం ఎడమ కాలువ విస్తరణకు కొత్త టెండర్లు

రూ.767.68 కోట్లతో 4 ప్యాకేజీల పనులు

మంత్రివర్గ ఆమోదం కోసం ప్రతిపాదనలు 3

పురుషోత్తపట్నం వద్ద ఎడమ కాలువలోకి ఎత్తిపోత

'పుష్కర'లో అదనంగా 50వేల ఎకరాలకు సాగునీరు

ఫ్రీ హోల్డ్‌పై సర్కారు నజర్

పెద్దల గుట్టు రట్టుచేసేందుకు విచారణ

విశాఖ, చిత్తూరు జిల్లాలపై ఫోకస్

'సాగర నగరం'లో తీగ దొరికింది.. 11

ఇక భూచోళ్లను బయటకు తీయడమే



పీసీసీ అధ్యక్షులు సమావేశానికి వస్తున్న ఖర్గే, రాహుల్

సెబీ చీఫ్, అదానీపై.. 22న దేశవ్యాప్త ఉద్యమం 2

ఈడీ కార్యాలయాల ముట్టడి.. షేర్‌మార్కెట్ స్కాంలో మోదీ పాత్ర: కాంగ్రెస్

కులగణనపైనా విస్తృతంగా ప్రజల్లోకి.. పీసీసీ, ఏఐసీసీ నేతలతో ఖర్గే భేటీ

రూ.4.5 లక్షల కోట్లు ఫట్.. సెన్సెక్స్ 693 పాయింట్లు డౌన్ 10

చట్టబద్ధమైన తల్లి ఎవరు?

అండం ఇచ్చిందొకరు.. కడుపున మోసిందొకరు

- సరగసీ ఖర్చును భరించిన మహిళ మరొకరు
- అండ/వీర్య దాతకు.. బిడ్డపై చట్టపరమైన హక్కులు ఉండవని తేల్చిన బాంబే హైకోర్టు


ముంబయి, ఆగస్టు 13: అండ/వీర్య దాతకు.. పుట్టే బిడ్డపై ఎలాంటి చట్టపరమైన హక్కులూ ఉండవని, ఆ బిడ్డకు తాము బయలాజికల్ పేరెంట్స్ అని చెప్పుకోజాలరని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. మహారాష్ట్రకు చెందిన ఒక మహిళ (42) పెళ్లయి చాలాకాలమైనా బిడ్డలు లేకపోవడంతో.. అద్దె గర్భం ద్వారా పిల్లలను పొందాలని భావించింది. తన చెల్లి అండం, తన భర్త వీర్యంతో సరగసీ విధానంలో 2019 ఆగస్టులో ఇద్దరు కవల ఆడపిల్లలను పొందింది. అయితే.. అదే ఏడాది ఏప్రిల్‌లోనే ఆమె చెల్లెలు భర్త, కుమార్తె రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. 2021 మార్చిలో.. భర్త ఆమెకు విడాకులిచ్చి ఆమె చెల్లెలితో, ఇద్దరు కవలలతో కలిసి వేరే ఫ్లాట్‌లో నివసించడం ప్రారంభించాడు. రెండేళ్ల పాటు మాతృత్వ మాధుర్యాన్ని అనుభవించిన ఆ మహిళ.. ఆ పిల్లలను చూసే అవకాశం కూడా తనకు కల్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు, కోర్టును ఆశ్రయించింది. తనకు ఉన్న 'విజిటేషన్ రైట్స్' (వెళ్లి పిల్లలను చూసుకునే హక్కు)ను కాపాడాలని కోరింది. కింది కోర్టు ఆమె వినతిని తిరస్కరించగా.. ఆమె బాంబే హైకోర్టులో అప్పీలు చేసింది. అయితే.. 'అండ దానం' చేసినందున తానే అసలైన (బయలాజికల్) తల్లినని ఆమె చెల్లెలు కోర్టులో వాదించింది. ఆమె భర్త కూడా ఆమెనే బలపరిచాడు. అయితే.. అండం ఆమెదే అయినా, ఆమె స్వచ్ఛంద దాత అని.. ఆ బిడ్డలను కడుపున మోసింది ఆమె కాదు కాబట్టి చట్ట ప్రకారం ఆమెను తల్లిగా పరిగణించకూడదని పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. వాదనలు విన్న జస్టిస్ జాదవ్.. మంగళవారం తీర్పునిచ్చారు. సరగసీ ద్వారా ఆ పిల్లలు పుట్టింది 2018లో కాబట్టి.. 2021 నాటి సరగసీ (నియంత్రణ) చట్టం ఈ కేసులో వర్తించదని.. 2005లో భారత వైద్య పరిశోధన మండలి మార్గదర్శకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. వాటి ప్రకారం 'వీర్యదాత'గానీ, 'అండదాత'గానీ ఎన్నటికీ శిశువులపై చట్టపరమైన హక్కును ప్రకటించుకోలేరని తేల్చిచెప్పారు. అండం ఇచ్చిన తల్లి 'జెనెటిక్ మదర్' మాత్రమే అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి వారాంతంలో మూడు గంటల పాటు పిల్లలతో గడిపేందుకు ఆ తల్లికి (పిటిషన్ వేసిన మహిళకు) అవకాశం ఇవ్వాలని ఆదేశించారు.

నేను ఓడిపోతే.. వెనిజువెలాకు వెళ్లిపోతా!



వాషింగ్టన్, ఆగస్టు 13: అధ్యక్ష ఎన్నికల్లో ఒక వేళ ఏదైనా జరిగి తాను ఓడిపోతే వెనిజువెలాకు వెళ్లిపోతానని, అప్పుడు అమెరికా కంటే అదే సురక్షిత ప్రాంతమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు ఆయన 'ఎక్స్'లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసలను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తాను తిరిగి అధ్యక్షుడినైతే... అమెరికా చరిత్రలో జరగనన్ని బహిష్కరణలు జరుగుతాయని హెచ్చరించారు. దేశంలో లక్షల సంఖ్యలో అక్రమ వలసదారులున్నారని వారందరిని బహిష్కరిస్తామన్నారు. బైడెన్ కంటే కమలా హ్యారిస్ మరింత అసమర్థురాలని వ్యాఖ్యానించారు. ఆమె గెలిస్తే అమెరికా నాశమవుతుందన్నారు.

లోకం తీరు



ఇద్దరు హాస్టల్ విద్యార్థినుల కిడ్నాప్.. అఘాయిత్యం

- రాత్రంతా రాజీవ్‌గృహకల్ప ఫ్లాట్లలో ఉంచి ఒకరిపై అత్యాచారం.. మరొకరిపై అసభ్య ప్రవర్తన
- నిందితుల్లో ఒకరు ఎస్‌బీ సీఐ వ్యక్తిగత డ్రైవర్

గుంటూరు, ఆగస్టు 13: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలను మాయమాటలతో కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులు రాత్రంతా వారిని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ ఫ్లాట్లలో ఉంచి ఒకరిపై అత్యాచారానికి పాల్పడగా, మరొకరిపై అసభ్యంగా ప్రవర్తించారు. గుంటూరు నగరంలో సోమవారం రాత్రి జరిగిందీ దారుణం. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా చెరుకుపల్లి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలాలకు చెందిన ఇద్దరు బాలికలు గుంటూరు నగరంలో జూనియర్ ఇంటర్ చదువుతూ పట్టాభిపురం చంద్రమౌళీశ్వర అగ్రహారంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్నారు. వారిలో ఓ బాలికకు ఐదు రోజుల క్రితం గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీఐకి వ్యక్తిగత డ్రైవర్‌గా పని చేస్తున్న పగడాల గోపితో పరిచయమైంది. సోమవారం రాత్రి 9 గంటలకు గోపి తన స్నేహితుడు మణికంఠతో హాస్టల్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మరో బాలికను చూసేందుకు తల్లిదండ్రులు రాగా, గేటు వద్ద ఉన్న మహిళా సెక్యూరిటీ సిబ్బంది వారిని వసతిగృహంలోకి తీసుకెళ్లారు. ఇదే అదునుగా ఇంటర్ విద్యార్థినులు ఇద్దరూ హాస్టల్ నుంచి బయటకు వచ్చేశారు. వారిని గోపి, మణికంఠ ద్విచక్రవాహనాలపై అడవి తక్కెళ్లపాడులోని రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్లలోకి తీసుకెళ్లారు. ఇరువురినీ వేర్వేరు గదుల్లో ఉంచి రాత్రంతా అసభ్యంగా ప్రవర్తించారు. గోపి ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడగా, మరో బాలిక మణికంఠను ప్రతిఘటించింది. అదే సమయంలో హాస్టల్లో ఇద్దరు బాలికలు కనిపించడంలేదంటూ వార్డెన్ అనురాధ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ కిరణ్, ఎస్‌ఐ మధు పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతోపాటు బాలికల కుటుంబ సభ్యులు కూడా గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితులిద్దరూ ద్విచక్రవాహనాలపై బాలికలను తిరిగి హాస్టల్ వద్దకు తీసుకురాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు గోపిది పల్నాడు జిల్లా అమరావతి మండలం లింగాపురం. డిగ్రీ చదివి ఎస్‌బీ సీఐ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మణికంఠ శ్యామలనగర్ శివారు సీతారాం కాలనీలో నివసిస్తూ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్!

(మొదటి పేజీ తరువాయి)

పాలసీ వచ్చాక ఆ శాఖలో బదిలీలు చేపట్టే అవకాశం ఉందని తెలిసింది. ఆతర్వాత ప్రాధాన్యం మేరకు పూర్తి దృష్టి లోపం ఉన్న ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించనున్నారు. వాస్తవానికి వీరిని ఉన్న స్థానాల నుంచి కదిలించరు. కానీ, వారు బదిలీ కోరుకుంటే.. కోరుకున్న చోటకు పంపుతారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల పూర్తయిన ఉద్యోగులకు, తర్వాత మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ప్రాధాన్యం ఇస్తారు. తర్వాత 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లిదండ్రులున్న ఉద్యోగులకు అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత కారుణ్య నియామక ఉద్యోగులు, జీవిత భాగస్వాములు, వితంతు ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల్లో ప్రారంభం కావాల్సిన రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం వాయిదా వేసింది. త్వరలో ఉద్యోగుల బదిలీలు చేపట్టాల్సి ఉన్నందున ఈ సమయంలో సదస్సుల నిర్వహణ చేపడితే సమస్యలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే సదస్సులను వాయిదా వేసింది. ఒకవైపు సదస్సులు, మరోవైపు బదిలీలు చేపడితే ఇబ్బందిగా ఉంటుందని సర్కారు భావించింది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల బదిలీల తర్వాతే రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. రెవెన్యూ సదస్సులను సెప్టెంబరు మొదటి వారం నుంచి నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. సదస్సుల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

అవసరం మేరకే టీచర్ల సర్దుబాటు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను అవసరమైన మేరకే చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు స్పష్టం చేశారు. సర్దుబాటు తర్వాత కూడా టీచర్లు మిగిలితే వారిని సొంత పాఠశాలలకే పంపాలని సూచించారు. మంగళవారం ఆర్జేడీలు, డీఈవోలు, డీవైఈవోలు, ఎంఈవోలతో వెబ్-ఎక్స్ సమావేశం నిర్వహించారు. మిగులు టీచర్లలో సీనియర్ టీచర్ సర్దుబాటులోకి వెళ్తానంటే అవకాశం కల్పించాలన్నారు. జూనియర్ టీచర్ 70 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యంతో ఉంటే, అదే పాఠశాలలో వేరే టీచర్‌ను సర్దుబాటు చేయాలని సూచించారు.

సెబీ చీఫ్, అదానీపై..

22న దేశవ్యాప్త ఉద్యమం

ఈడీ కార్యాలయాల ఘెరావ్.. షేర్‌మార్కెట్ స్కాంలో మోదీ పాత్ర: కాంగ్రెస్

- కులగణనపైనా విస్తృతంగా ప్రజల్లోకి
- పీసీసీ, ఏఐసీసీ నేతలతో ఖర్గే భేటీ
- అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై చర్చ



రాష్ట్రాల పీసీసీ అధ్యక్షుల సమావేశానికి హాజరైన నేతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అదానీతో వ్యాపార సంబంధాలు ఉన్నట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించిన దరిమిలా.. సెబీ చీఫ్ మాధురి పురీ బుచ్ రాజీనామా చేయాలని.. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఈ నెల 22వ తేదీన దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య ఉద్యమం ధర్నాలు చేపట్టనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారమిక్కడ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ సహా 56 మంది నేతలు హాజరయ్యారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్, జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఆ సందర్భంగా దేశవ్యాప్త ఉద్యమానికి నిర్ణయం తీసుకున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్వహించాలన్న అంశంపై కూడా ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఆర్థిక, సామాజిక రాజకీయ న్యాయానికి సంబంధించి రాజ్యాంగంలో పేర్కొన్న అధికరణలను గౌరవించాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. 'దేశంలో జరుగుతున్న అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంపై విస్తృతంగా చర్చించాం. అదానీ, సెబీ సంబంధాలపై హిండెన్‌బర్గ్ నివేదికలో వెల్లడించిన అంశాలపై చర్చలు జరిపాం. ఫైనాన్షియల్ మార్కెట్‌ను నియంత్రించాల్సిన సెబీయే రాజీపడింది. ఈ కుంభకోణంలో ప్రధానమంత్రి పాత్ర పూర్తిగా ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఆగస్టు 22న దేశవ్యాప్తంగా ఉద్యమించడంలో భాగంగా రాష్ట్రాల్లో ఈడీ కార్యాలయాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఘెరావ్ చేస్తారు. సెబీ చైర్‌పర్సన్‌ను తొలగించాలి. విశ్వసనీయత కోల్పోయిన వ్యక్తి ఆ పదవిలో ఉండడానికి వీల్లేదు. జేపీసీ ద్వారా ఈ మెగా కుంభకోణంపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం' అని వివరించారు. కులగణన, రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ అంశాలపై ఉద్యమ కార్యాచరణను త్వరలో నిర్ణయిస్తామని.. జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విస్తృత స్థాయిలో జనంలోకి వెళ్తామని అన్నారు. వయనాడ్ ఉత్పాతాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలని సమావేశం డిమాండ్ చేసిందన్నారు. వయనాడ్ మృతులకు సంతాపం తెలిపిందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, పూజాస్థలాలపై దాడులు జరగకుండా నిలిపివేసేందుకు మోదీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్, జమ్మూకశ్మీరుల్లో ఎన్నికల సన్నద్ధతపై చర్చించామని, అవసరమైన చోట్ల పొత్తులు పెట్టుకుంటామని వేణుగోపాల్ చెప్పారు.

సెబీ చీఫ్ రాజీనామా కోరాలి: ఖర్గే

'సెబీకి, అదానీకి మధ్య సంబంధాలపై దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. స్టాక్ మార్కెట్లో చిన్న మదుపరుల డబ్బును గందరగోళంలో పడేయకూడదు. మోదీ ప్రభుత్వం తక్షణమే సెబీ చైర్‌పర్సన్ రాజీనామాను కోరాలి. దీనిపై జేపీసీని ఏర్పాటుచేయాలి' అని ఖర్గే 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. నిరుద్యోగం, హద్దుల్లేని ద్రవ్యోల్బణంపై ప్రజల్లోకి వెళ్లాలని.. దేశమంతా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు పిలుపిచ్చారు. మోదీ ప్రభుత్వ జమానాలో రాజ్యాంగంపై దాడి కొనసాగుతోందన్నారు. కులగణన అనేది ప్రజల డిమాండ్ అని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌పై పోరాటం కొనసాగుతుందన్నారు. సైన్యంలో 'అగ్నిపథ్' స్కీంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతపై ధ్వజమెత్తారు. రైళ్ల రోజూ పట్టాలు తప్పడం రివాజైందన్నారు. వాతావరణ సంబంధ ప్రకృతి విపత్తులు, మౌలిక వసతుల ధ్వంసం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టండి

- టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: స్పామ్ కాల్స్‌కు వెంటనే చెక్ పెట్టాలని ట్రాయ్ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రమోషనల్, మార్కెటింగ్‌కు రిజిస్టర్ చేసుకోని సంస్థలు చేసే కాల్స్, కంప్యూటర్ జనరేటెడ్ కాల్స్‌ను వెంటనే నిలిపివేయాలని సూచించింది. తక్షణమే ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్ల నుంచి వస్తున్న కాల్స్‌పై ట్రాయ్‌కి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ట్రాయ్ ఆయా అన్ రిజిస్టర్డ్ టెలీమార్కెటర్ల డేటాను సమర్పించాలంటూ టెల్కోలకు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఈతరహా కాల్స్ చేస్తే రెండేళ్ల పాటు యాక్సెస్‌ను నిలిపివేస్తామని హెచ్చరించింది. ఆ సంస్థను రెండేళ్ల వరకు బ్లాక్ లిస్ట్‌లో పెడతామని పేర్కొంది.

డీఎన్డీతో పరిష్కారం

వినియోగదారులు తమకు వచ్చే స్పామ్ కాల్స్‌పై సాధారణంగా ఆయా టెలికాం ఆపరేటర్లు సూచించే నంబరుకు ఫిర్యాదు చేయడం తెలిసిందే.! అంతే కాదు.. 'డు నాట్ డిస్టర్బ్' సేవల కోసం ఏయే సంస్థలకు యాక్సెస్ ఇవ్వాలి? ఏయే సంస్థలను బ్లాక్ చేయాలి? అనేవి సామాన్యులు తెలుసుకోవడం కష్టమే. అన్ని సంస్థలను డీఎన్డీలో పెడితే.. బ్యాంకు నుంచి వచ్చే ఎస్ఎంఎస్‌లు కూడా నిలిచిపోతాయి. అయితే.. ట్రాయ్ అందుబాటులోకి తీసుకువచ్చిన 'డీఅండ్‌డీ' యాప్ ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. ఇందులో స్పామ్ కాల్స్‌పై ఫిర్యాదు చేయడం మొదలు.. డీఅండ్‌డీలో ఫీచర్ల వారీగా యాక్టివేట్, డీయాక్టివేట్ చేసుకునే వెసులుబాటు ఉంది. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్, ట్రాయ్ వెబ్‌సైట్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పర్యాటక రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారు


- నాడు 20.3 శాతం వృద్ధి.. నేడు 3.3 శాతమే: సీఎం సమీక్ష

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ టెర్రరిజం, నిర్లక్ష్య వైఖరి కారణంగా పర్యాటక రంగం పూర్తిగా దెబ్బతిన్నదని సీఎం చంద్రబాబు విమర్శించారు. కరోనా కంటే నాటి ప్రభుత్వ అసమర్థత వల్లనే టూరిజం రంగానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో ఒప్పందం చేసుకున్న సంస్థలు గత ఐదేళ్లలో వెనక్కిపోయాయన్నారు. ఆశించిన స్థాయిలో కొత్తగా పెట్టుబడులు రాలేదన్నారు. పర్యాటకరంగం అభివృద్ధిపై మంగళవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గతంలో కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేటు 20.6 శాతం ఉంటే, 2019-24 మధ్య 3.3 శాతానికి పడిపోయిందన్నారు. టీడీపీ హయాంలో టూరిజం శాఖపై రూ.880 కోట్లు ఖర్చు చేయగా, గత ప్రభుత్వం కేవలం రూ.213 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నాడు పెట్టుబడుల కోసం 190 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని రూ.1,939 కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. దీని ద్వారా 10,573 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఎకో, టెంపుల్, బీచ్‌టూరిజం అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, నాడు ఒప్పందం చేసుకున్న ప్రాజెక్టులను మళ్లీ పట్టాలు ఎక్కించడంతోపాటు పెట్టుబడుదారులతో మాట్లాడి కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలని అధికారులకు సూచించారు. టెంపుల్ టూరిజంకు రాష్ట్రంలో విస్తృత అవకాశాలున్నాయని, ఎకో టూరిజం అభివృద్ధికి అటవీశాఖతో కలిసి పని టూరిజం సెంటర్‌కు వచ్చిన పర్యాటకులు ఒకటి రెండు రోజులు అక్కడే ఉండే వాతావరణం కల్పించాలని, అప్పుడే స్థానికులకు ఉపాధితోపాటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందన్నారు. టూరిజం అభివృద్ధికి కేంద్రం ఇచ్చే నిధులు రూ.300 కోట్లతో శ్రీశైలం, రాజమండ్రి గోదావరి ప్రాంతం, సూర్యలంక బీచ్‌లలో టూరిజం ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. త్వరగా కొత్త టూరిజం పాలసీ తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో సీప్లేన్ టూరిజం తెచ్చేందుకు అవకాశాలు పరిశీలించాలన్నారు. రుషికొండ ప్యాలెస్ కోసం పెట్టిన ఖర్చులో సగం కూడా పర్యాటక రంగంపై పెట్టకపోవడం విచారకమని సీఎం అన్నారు.

హత్యాచారం కేసు సీబీఐకి!

ఫైళ్లన్నింటినీ నేడు కేంద్ర సంస్థకు అప్పగించాలి

- కోల్‌కతా పోలీసులకు హైకోర్టు ఆదేశం
- 5 రోజులైనా కేసులో పురోగతి లేదని ధ్వజం



వారాణసీలో ఓ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం రోగుల ఎదురుచూపు

కోల్‌కతా, ఆగస్టు 13: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలి(31)పై అత్యాచారం చేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో కలకత్తా హైకోర్టు మంగళవారం.. కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని కోల్‌కతా పోలీసులను ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలను బుధవారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆస్పత్రిలో ఉన్నవారికి తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. అసహజ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రభుత్వ న్యాయవాది తెలపగా.. వైద్యురాలిని దారుణంగా హతమార్చితే వెంటనే హత్య కేసుగా ఎందుకు నమోదు చేయలేదని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. వైద్యురాలి మృతదేహం ఏమీ రోడ్డు పక్కన దొరకలేదని, ఆస్పత్రి సూపరింటెండెంట్ లేదా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. ఈ కేసు దర్యాప్తు కోర్టు పర్యవేక్షణలో జరిగేలా చూడాలని కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. అలాగే కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటన్నింటినీ విచారించిన హైకోర్టు ధర్మాసనం.. పోలీసుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోల్‌కతా పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు జరుపుతున్నారని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా.. ఘటన జరిగి ఐదు రోజులైనా కోల్‌కతా పోలీసుల దర్యాప్తులో గుర్తించదగిన పురోగతి కనిపించలేదని వ్యాఖ్యానించింది. వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌పై కోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించి, దీర్ఘకాలిక సెలవుపై పంపాల్సిందిగా ఆదేశించింది. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ.. ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉన్నందున, ఆందోళనలను విరమించాలని సూచించింది. కాగా, జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు విధులు బహిష్కరించారు. తక్షణమే తగిన న్యాయం చేయాలని, హంతకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలనూ నిలిపివేశారు. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడింది.

వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) దేశంలోని వైద్య కళాశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది. వైద్య విద్యార్థులు.. ముఖ్యంగా విద్యార్థినులు క్యాజువాలిటీ, ఓపీ విభాగాలు, తమ క్వార్టర్స్(హాస్టల్స్)కు వెళ్లే మార్గాల్లో భద్రత కల్పించాలని సూచించింది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో లైటింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. "సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి, అక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలి. భద్రత కోసంమహిళా సిబ్బందిని కూడా నియమించాలి" అని కోరింది. మరోవైపు, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో ఐఎంఏ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్వీ అశోకన్ మాట్లాడుతూ.. వైద్య కళాశాలల్లో హింసకు వ్యతిరేకంగా కేంద్ర చట్టం, ఎన్ఎంసీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు.

హిందువులతో యూనస్ భేటీ

ఢాకా, ఆగస్టు 13: షేక్‌హసీనా పదవీచ్యుతి నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో దాడులకు గురవుతున్న మైనారిటీ హిందువులతో ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ మంగళవారం సమావేశమయ్యారు. రాజధాని ఢాకాలోని ప్రఖ్యాత ఢాకేశ్వరి ఆలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశ పౌరులందరికీ సమానమైన హక్కులు ఉంటాయి. దయచేసి ప్రభుత్వంతో సహకరించండి. ఓపికతో ఉండండి' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మనల్ని మనం మనుష్యులుగానే తప్ప ముస్లింలుగా, హిందువులుగా, బౌద్ధులుగా చూసుకోవద్దని పిలుపునిచ్చారు. వ్యవస్థల పతనం కారణంగానే అన్ని సమస్యలు తలెత్తుతుంటాయని, కాబట్టి, వ్యవస్థలను సరి చేయటమే ప్రస్తుత పరిష్కారమని యూనస్ తెలిపారు. గత రెండు వారాల్లో బంగ్లాదేశ్‌లోని 52 జిల్లాల్లో మైనారిటీలపై ముఖ్యంగా హిందువులపై 278 దాడి ఘటనలు జరిగాయి. ఇదిలా ఉండగా, షేక్‌హసీనాపై ఢాకాలో హత్య అభియోగం నమోదైంది. గత నెలలో పోలీసు కాల్పుల్లో ఓ వ్యక్తి చనిపోవడంపై అతని సంబంధీకులు షేక్ హసీనాతో పాటు మరో ఆరుగురిపై (వీరిలో ఇద్దరు మాజీ మంత్రులు, మాజీ పోలీసు అధిపతి) పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు, బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదని అమెరికా స్పష్టం చేసింది. ఈ మేరకు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ విలేకర్లకు స్పష్టం చేశారు.

ప్రభుత్వాస్పత్రులకూ ఆరోగ్యశ్రీ బకాయిలు

- విజయవాడ జీజీహెచ్‌కే రూ.23 కోట్లు: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ, వైద్య సేవల నాణ్యతలో సమూలమైన మార్పుల్ని తీసుకొస్తామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ సరిగా లేకపోవడంతో అనేక సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లతో మంగళవారం ఆయన మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు వేలాది కోట్లు బకాయిపడిన వైసీపీ ప్రభుత్వం.. చివరికి ప్రభుత్వాసుపత్రులకు కూడా బకాయి పెట్టిందని మంత్రి తెలిపారు. ఒక్క విజయవాడ జీజీహెచ్‌కే రూ.23 కోట్లు బకాయిపడిందన్నారు. వైద్య ఆరోగ్యశాఖను పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోందని, గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఏ రకమైన చర్యలు తీసుకుంటే రోగులకు మెరుగైన సేవలు అందించగలమన్న దిశగా చర్చించామని తెలిపారు. చేతులు తడిపితే తప్ప స్ట్రెచర్ కూడా కదలని దుస్థితి నుంచి రోగుల్ని కాపాడి మెరుగైన సేవలందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని కోరారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు తమ వ్యవహారశైలిని మార్చుకోవాలని, సమయపాలన పాటించాలని అన్నారు. బోధనాసుపత్రుల్లో ఓపీ 2వేల నుంచి 3 వేల వరకూ ఉంటోందని, ఓపీ రిజిస్ట్రేషన్ అరగంట లోపే జరిగేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్లు, వివిధ పరీక్షలు నిర్వహించే పరికరాలు నిత్యం పని చేసే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్ని మౌలిక సదుపాయాలున్నా ప్రయివేటు ఆస్పత్రులకు దీటుగా ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులకు వివిధ అంశాల ప్రాతిపదికన రేటింగ్ ఇచ్చి పోటీతత్వాన్ని పెంపొందించాలని సూచించారు. వైద్య సేవల్ని మెరుగుపర్చే దిశగా పటిష్టమైన ఫీడ్‌బ్యాక్ ఉండాలని మంత్రి సత్యకుమార్ సూచించారు. కాగా, ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్య బీమా ఉన్న వారికి వైద్యం అందించే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 54 మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయని, మరో 30 వాహనాల్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని మంత్రి తెలిపారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి మంజుల, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ లక్ష్మీశా, డీఎంఈ నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

విడదల రజని అనుచరుల భూ ఆక్రమణపై ఫిర్యాదు

- కేకే రాజు అనుచరులదీ అదే దారి
- విశాఖ మహిళపై దాడి... ఇల్లు కబ్జాకు యత్నం
- టీడీపీ కార్యాలయంలో వినతులు

స్వీకరించిన మంత్రి టీజీ భరత్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో తమ భూమిని మాజీ మంత్రి విడదల రజని అనుచరులైన మండల స్థాయి నాయకులు తమ పేర్ల మీదకు మార్చుకొన్నారని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తర్లుపాడు గ్రామానికి చెందిన చింతల శేష గిరిరావు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణకు హాజరైన పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి ఆయన వినతిపత్రం ఇచ్చి తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేకే రాజు అనుచరుల సహకారంతో కొంత మంది తనపై కత్తులతో దాడి చేసి గాయపర్చారని, తన ఇంటిని కబ్జా చేయడానికి చూస్తున్నారని విశాఖ తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీకి చెందిన కోరుకొండ విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని ఆమె మంత్రి ముందు విలపించారు. గతంలో ఎన్టీ రామారావు, వెంకయ్య నాయుడు కూడా తమ స్కూల్‌ను సందర్శించారని, అద్దె అడిగినందుకు వైసీపీ సానుభూతిపరుడైన విశ్వనాథరెడ్డి ఆ స్కూల్‌ను మూయించారని రవీంద్ర గౌడ్ ఫిర్యాదు చేశారు. తన స్కూల్ మళ్లీ తెరిపించాలని ఆయన కోరారు. తమకు చెందిన 21ఎకరాల భూమిని కొందరు కబ్జాదారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కు అయ్యి కొట్టేయాలని చూస్తున్నారని విజయనగరం జిల్లా గరివిడి మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు సారిపాక నర్సిమాంబ ఫిర్యాదు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే టీడీపీ సానుభూతిపరులమన్న పేరుతో తమను తొలగించారని, తమ దుకాణాలు మళ్లీ తమకు కేటాయించాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన రేషన్ డీలర్లు కొందరు విజ్ఞప్తి చేశారు.

అక్షరాలు ముఖ్యమా? ప్రాణాలా!

- నాడు ఏమయ్యాయి మీ గొంతులు?: పీతల సుజాత

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 188 మంది దళిత బిడ్డలను కిరాతకంగా చంపారు. ఆ రోజు వైసీపీలోని దళిత నేతల గొంతులు ఏమయ్యాయి? అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరు ఉన్న అక్షరాలను తీసివేస్తే గొంతులు అంత లేస్తున్నాయి. అక్షరాలు ముఖ్యమా లేక ప్రాణాలా?' అని టీడీపీకి చెందిన మాజీ మంత్రి పీతల సుజాత ప్రశ్నించారు. మంగళవారం ఆమె ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'అమరావతిలో అంబేడ్కర్ స్మృతి వనం కోసం టీడీపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో రూ.100 కోట్లతో ఒక ప్రాజెక్టు చేపడితే జగన్ దానిని విజయవాడకు తరలించి ఆ పేరుతో దోచుకొన్నారు. ఖర్చు విపరీతంగా పెంచేశారు. అంబేడ్కర్ విగ్రహం కింద ఆయన పేరు కంటే పెద్దగా జగన్ పేరు తాటికాయంత అక్షరాలతో రాయించుకొన్నారు. జగన్ పేరుతో పోలిస్తే అంబేడ్కర్ పేరు చిన్నగా రాసి ఆయనను అవమానించారు. విగ్రహం వద్ద అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని సరిదిద్దడానికి ఈ చర్య జరిగింది. డాక్టర్ సుధాకర్ మొదలుకొని చీరాల కిరణ్ వరకూ 188మంది దళితులు వైసీపీ హయాంలో అమానుషంగా ప్రాణాలు కోల్పోయారు. వైసీపీ నేతలు మా జోలికి వస్తే మేం ఇవన్నీ మాట్లాడాల్సి వస్తుంది. జాగ్రత్తగా ఉంటే మీ పరువే దక్కుతుంది' అని సుజాత అన్నారు.

మళ్లీ చంద్రన్న కానుకలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. రాష్ట్రంలో రేషన్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి చంద్రన్న సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు, చంద్రన్న రంజాన్ తోఫా పథకాలను పునరుద్ధరించేందుకు ఆ శాఖ ఇప్పటికే కసరత్తు చేస్తోంది. ఈ మూడు పండగలకు రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా చంద్రన్న కానుకలు అందించడానికి ఏడాదికి రూ.538 కోట్లు చొప్పున ఐదేళ్లకు రూ.2,690 కోట్ల అదనపు భారం పడుతుందని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం (2014-19) ఉన్నప్పుడు ఏటా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు చంద్రన్న కానుకలను అందించింది. చంద్రన్న సంక్రాంతి కానుక కింద అరకిలో కందిపప్పు, అరకిలో శనగపప్పు, అరకిలో బెల్లం, అరలీటరు పామాయిల్, కిలో గోధుమ పిండి, 100 మిల్లీ గ్రాముల నెయ్యితో కూడిన కిట్లను కార్డుదారులకు అందించారు. క్రిస్మస్ కానుక కింద కూడా అవే ఇచ్చారు. ఇక రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు 2 కిలోల చక్కెర, 5 కిలోల గోధుమపిండి, కిలో వర్మిసెల్లి, 100 మిల్లీగ్రాముల నెయ్యితో కూడిన తోఫా కిట్లను ఉచితంగా అందించారు. ఆ తర్వాత 2019 జూన్‌లో జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే వీటిని నిర్దాక్షిణ్యంగా నిలిపివేసింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో రేషన్‌కార్డు దారులందరికీ మళ్లీ చంద్రన్న కానుకలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 1,48,43,671 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 12 లక్షలకుపైగా ముస్లిం కార్డుదారులున్నారు. ఇవి కాకుండా ప్రతినెలా రెగ్యులర్ కోటా కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యంతో చక్కెర, కందిపప్పు, గోధుమపిండి, జొన్నలు, సజ్జలు వంటి తృణధాన్యాలను కూడా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

సరికొత్త రేషన్‌కార్డులు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రేషన్‌కార్డుల రంగులు మారనున్నాయి. గత ప్రభుత్వ ప్రచార పిచ్చి పతాకస్థాయికి చేరి.. పేదలకిచ్చిన రేషన్ కార్డులపై కూడా వైసీపీ రంగులు వేయడమే కాకుండా అప్పటి సీఎం జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఫోటోలను ముద్రించింది. ఇప్పుడు పాత రేషన్‌కార్డుల స్థానంలో కొత్త కార్డులివ్వాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన డిజైన్లు పరిశీలనలో ఉన్నాయి.

కొత్తకార్డులపై విధానపరమైన నిర్ణయం

రాష్ట్రంలో ప్రస్తుతం 1.48 కోట్ల రేషన్‌కార్డులు ఉన్నా.. వీటిలో 90 లక్షల రేషన్‌కార్డులు మాత్రమే బీపీఎల్ కింద ఉన్నట్లు కేంద్రం గుర్తించింది.. వాటికి మాత్రమే ఆహార భద్రత చట్టం కింద రాయితీ ఇస్తోంది. మిగిలిన 58 లక్షలకు పైగా కార్డులపై సబ్సిడీల ఖర్చును రాష్ట్రప్రభుత్వమే భరించాల్సి వస్తోంది. రాష్ట్రంలోని మొత్తం రేషన్ కార్డులను ఆహార భద్రత చట్టం పరిధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా మొరపెట్టుకుంటున్నా కేంద్రం అంగీకరించడం లేదు. పేదరికంతో సంబంధం లేకుండా నచ్చిన వారందరికీ కార్డులు ఇచ్చుకుంటూ పోవడం వల్ల రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రజలు బీపీఎల్ జాబితాలోకి వచ్చేశారని, అంత మందికి రాయితీ ఇవ్వలేమని తేల్చేసింది. దీంతో రోజులు, గంటల వ్యవధిలో కొత్త కార్డులు మంజూరు చేస్తామని బీరాలు పలికిన జగన్ ప్రభుత్వం చేతులెత్తేసింది. కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రతి ఆర్నెల్లకోసారి అర్హులకు కొత్త కార్డులు మంజూరు చేస్తామంటూ మాట మార్చింది. పోనీ వాటినైనా సక్రమంగా మంజూరు చేసిందా అంటే అదీ లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చేనాటికి రాష్ట్రంలో 1.47 కోట్ల రేషన్‌కార్డులు ఉండగా.. గడచిన ఐదేళ్లలో 1.48 కోట్లకు పెరిగాయి. అంటే గత ఐదేళ్లలో కొత్తగా ఇచ్చిన కార్డులు కేవలం 1.10 లక్షలే. కొత్త కార్డుల కోసం వచ్చిన దాదాపు 78 వేల దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టేసింది. ఇంకా రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం మొత్తం 3.36 లక్షల దరఖాస్తులు దాదాపు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పెండింగ్ దరఖాస్తులతోపాటు కొత్తగా పెళ్లయిన దంపతులకు, అన్ని అర్హతలూ ఉన్న కుటుంబాలకు కొత్త కార్డులను మంజూరు చేసే అంశంపై కొత్త ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవలసి ఉంది.

6 నెలలుగా రేషన్ తీసుకోనివారి కార్డులు కట్!

కాలానుగుణ సమీక్షల ద్వారా వచ్చిన సార్టింగ్ డేటా ప్రకారం జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 90 లక్షల కార్డుల్లో 1,36,420 కుటుంబాలు ఆరు నెలలకు పైగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదు. ఆ కార్డులన్నింటినీ తొలగిస్తే.. వాటి స్థానంలో రాష్ట్ర కార్డులను భర్తీ చేయవచ్చు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మరికొన్ని ప్రతిపాదనలు కూడా చర్చకు వస్తున్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల వార్షికాదాయాన్ని ప్రాతిపదికగా చేసుకుని రెండు రకాల రేషన్ కార్డులు ఇచ్చింది. బీపీఎల్ పరిధిలోకి వచ్చే పేదలకు తెల్ల కార్డు, ఏపీఎల్ కిందకు వచ్చే మధ్యతరగతి వారికి గులాబీ కార్డు ఇచ్చింది. తెల్ల కార్డుదారులకు ఇచ్చే రేషన్ సరుకులపై సబ్సిడీని ప్రభుత్వం భరించగా.. గులాబీ కార్డు ఉన్నవారికి ఫైన్ క్వాలిటీ బియ్యం, కందిపప్పు, చెక్కర, గోధుమలు వంటి సరుకులను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అందించింది. తర్వాత గులాబీ కార్డులను తొలగించి అందరికీ ఒకే రేషన్‌కార్డు విధానాన్ని అమలులోకి తెచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వంటి పథకాలకు ఈ రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో.. కోటీశ్వరులైన ధనవంతులు కూడా ఏదో విధంగా రేషన్ కార్డులను సంపాదిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వంపై అధిక భారం పడుతోంది. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవడాన్ని నిలుపుదల చేస్తే వాటికి ఉన్న డిమాండ్ గణనీయంగా తగ్గిపోతుందని పౌరసరఫరాల శాఖ వర్గాలే చెబుతున్నాయి. లేదంటే గతంలో మాదిరిగా కార్డుల విభజన చేసి.. మళ్లీ తెల్ల కార్డులు, గులాబీ కార్డులను అమల్లోకి తెచ్చినా దాదాపు సగం భారం తగ్గుతుందని అంటున్నాయి.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. దీంతో హౌసింగ్‌లో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో గత వైసీపీ ప్రభుత్వం భారీ అవినీతి, అక్రమాలకు తెరతీసింది. పలు జిల్లాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లకు భూసేకరణ, మెరక పనులు, మౌలిక వసతుల కల్పన, ఇళ్ల నిర్మాణం.. ఇలా ప్రతి దశలోనూ భారీ ఎత్తున అవకతవకలు జరిగాయి. ఈ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులతో కూడిన లేఖలు రాస్తున్నారు. జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మునిసిపాలిటీ పరిధిలోని అర్బన్ హౌసింగ్ లేఅవుట్‌లో అవినీతిపై విచారణ జరిపించాలని కడప జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి గత నెలలో చంద్రబాబుకు లేఖ రాశారు. దానిపై స్పందించిన సీఎం వెంటనే విచారణకు ఆదేశించారు. కడప జిల్లా కలెక్టరు నేతృత్వంలో విచారణ చేయగా.. పులివెందుల లేఅవుట్‌లో 2 వేలకు పైగా ఇళ్ల స్థలాలను అనర్హులకు కేటాయించినట్టు తేలింది. ఆ ఒక్క లేఅవుట్‌లోని ఇళ్లకే రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ద్వారా రూ.82 కోట్లు విడుదల చేయగా.. ఇంతవరకు ఒక్క ఇంటిని కూడా పూర్తిచేయలేదు. అక్కడ ఇళ్లకు కేటాయించిన సిమెంటు, స్టీలు, ఇసుకను కాంట్రాక్టర్లు బయట అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఇంకా వివిధ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో.. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పేదల ఇళ్ల లేఅవుట్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో విజిలెన్స్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పేదల ఇళ్ల నిర్మాణంలో వచ్చిన ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికలు సమర్పించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ అన్ని జిల్లాల విజిలెన్స్ ఎస్పీలు, అదనపు ఎస్పీలకు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు, అనంతపురం, విశాఖ, విజయనగరం, కాకినాడ తదితర జిల్లాల్లో ఇప్పటికే విజిలెన్స్ బృందాల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీలు పూర్తయిన తర్వాత అన్ని జిల్లాల నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

అక్షయ పాత్ర, హరేకృష్ణ ఫౌండేషన్లకు భాష్యం విద్యాసంస్థలు రూ.కోటి వితరణ



సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న సాకేతరామ్. చిత్రంలో మంత్రి నారాయణ తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 13: రాష్ట్రంలో ఈ నెల 15న ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ల నిర్వహణ, గోకుల క్షేత్రం నిర్మాణం కోసం భాష్యం విద్యాసంస్థలు తమ వంతు వితరణ ప్రకటించాయి. ఆయా సంస్థల నిర్వహణ కోసం రూ.కోటి చెక్కును భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తనయుడు సాకేతరామ్ మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, అక్షయపాత్ర, హరేకృష్ణ ఫౌండేషన్ నిర్వాహకుల సమక్షంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు రూ.50 లక్షలు, హరేకృష్ణ గోకుల క్షేత్రం నిర్మాణానికి మరో రూ.50 లక్షల చొప్పున మొత్తం కోటి విరాళాన్ని అందజేశారు.

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో.. ఈడబ్ల్యూఎస్ కోటా జీవో సస్పెన్షన్

- కన్వీనర్ కోటాలో ఇది చెల్లదన్న హైకోర్టు
- ఎన్ఎంసీకి విరుద్ధంగా ఉందని వెల్లడి.. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు
- కౌంటర్ దాఖలుకు కేంద్ర, రాష్ట్రాలకు ఆదేశం

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్(ఆర్థిక బలహీన వర్గాలు) కోటా కింద భర్తీ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 94 అమలును మంగళవారం హైకోర్టు సస్పెండ్ చేసింది. ప్రభుత్వ జీవో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. కాలేజీలకు కేటాయించిన సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలని ఎన్ఎంసీ ఇచ్చిన పబ్లిక్ నోటీసు ఆధారంగానే ప్రభుత్వం జీవో 94 ఇచ్చిందని ఎస్‌జీపీ ప్రణతి చేసిన వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. ప్రైవేటు కాలేజీల్లో ఈ కోటా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి ప్రయత్నిస్తోందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా సీట్లను పెంచేందుకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్ల పెంపు కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేసుకొనేలా ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్ఎంసీ, ఎన్టీఆర్ హెల్త్ యునివర్సిటీని ఆదేశించింది. విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 10శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్ కోటా కింద భర్తీ చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న జీవో 94ను జారీ చేసింది. అయితే, ఈ జీవోను సవాల్ చేస్తూ పి. చరిష్మా మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది రాగూర్ యాదవ్ వాదనలు వినిపించారు. ఎన్ఎంసీ సీట్లు పెంచిన తర్వాతే 10శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎన్ఎంసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఎన్ఎంసీ తరఫున న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపిస్తూ.. అదనపు సీట్లు కేటాయించాలని ప్రైవేటు కాలేజీలు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అయితే, సంబంధిత కాలేజీలు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. కాలేజీలకు కేటాయించిన సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలని 2023, అక్టోబరులో ఎన్ఎంసీ ఇచ్చిన పబ్లిక్ నోటీసు ఆధారంగా ప్రభుత్వం జీవో 94 ఇచ్చిందన్నారు. పబ్లిక్ నోటీసుకు భిన్నంగా ఎన్ఎంసీ వాదనలు వినిపిస్తోందని తెలిపారు. పిటిషనర్లకు ఏదైనా అభ్యంతరం ఉంటే ఎన్ఎంసీ పబ్లిక్ నోటీసును సవాల్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

ఎన్నికల గుర్తులపై జోక్యం చేసుకోం!

- సీఈసీ ట్రిబ్యునల్ వద్దే తేల్చుకోండి.. 'గాజుగ్లాసు'పై పిటిషన్ల పరిష్కారం

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల గుర్తుల కేటాయింపు విషయంలో సీఈసీ ఉత్తర్వులపై తాము జోక్యం చేసుకునేది లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అభ్యంతరాలుంటే వాటిని ఎన్నికల ట్రిబ్యునల్ ముందు సవాల్ చేసుకోవచ్చని సూచించింది. 'గాజుగ్లాసు' గుర్తు విషయంలో ఎన్నికల సంఘం నిర్ణయంపై ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో 'గాజుగ్లాసు' గుర్తు కేటాయింపు విషయంలో దాఖలైన అప్పీళ్లను పరిష్కరిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తు కేటాయించే విషయంలో ఎన్నికల సంఘం చట్టనిబంధనలు అనుసరించలేదని పేర్కొంటూ రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ, దళిత బహుజన పార్టీలు ఎన్నికల సమయంలో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి వ్యాజ్యంలో జోక్యానికి నిరాకరించారు. దీంతో ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లు ఇటీవల జస్టిస్ జి. నరేందర్ ధర్మాసనం ముందు విచారణకు రాగా సీఈసీ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల గుర్తు కేటాయింపుపై అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని, హైకోర్టుకు రావడానికి వీల్లేదని పేర్కొంది. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అఫిడవిట్ దాఖలు చేయాలని సీఈసీను ఆదేశించింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్ దాఖలు చేసింది. పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం గాజుగ్లాసు గుర్తుతో పాటు ఇతర గుర్తుల కేటాయింపుల విషయంలో అభ్యంతరాలను ట్రిబ్యునల్ వద్దే తేల్చుకోవాలంది.

ఉత్తరాంధ్రకు సుజలం!

- విశాఖకు గోదావరి జలాల తరలింపునకు బృహత్తర కార్యాచరణ సిద్ధం
- పోలవరం ఎడమ కాలువ విస్తరణకు కొత్త టెండర్లు
- రూ.767.68 కోట్లతో 4 ప్యాకేజీల పనులు

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిన వెంటనే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి మోక్షం లభించింది. విశాఖపట్నం నగరానికి ఏడాదిలోపే అంటే 2025 జూన్ నాటికి.. తాగు, పారిశ్రామిక అవసరాల కోసం 23.44 టీఎంసీల గోదావరి జలాలను సరఫరా చేసేందుకు బృహత్తర కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు గోదావరి జలాలను తరలిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనకు జల వనరుల శాఖ దీనికి రూపకల్పన చేసింది. విశాఖను పాలనా రాజధానిని చేస్తానంటూ ఐదేళ్లు గడిపేసిన జగన్మోహన్‌రెడ్డి.. పోలవరం ఎడమ, కుడి ప్రధాన కాలువలనూ.. హెడ్‌వర్క్స్ పనులనూ వదిలేశారు. కానీ చంద్రబాబు సీఎంగా పగ్గాలు చేపట్టిన రెండు నెలల్లోపే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి.. సుజల స్రవంతిని పరుగులు తీయించేలా చర్యలు తీసుకుంటున్నారు. గత నెల 13వ తేదీన ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన సందర్భంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దార్లపూడి వద్ద జల వనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ నగరానికి 23.44 టీఎంసీల గోదావరి జలాలను తరలించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. రూ.767.68 కోట్లతో ఎడమ కాలువ విస్తరణ పనులకు కొత్తగా టెండర్లు పిలిచి 2025 నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించింది. వీటికి టెండర్లు పిలవాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటికి మంత్రివర్గ సమావేశం ఆమోదం పొందాల్సి ఉంది. 169 కిలోమీటర్ల మేర ఎడమ కాలువ పనులను 2025 జూన్ నాటికి పూర్తి చేసి.. పుష్కర ఆయకట్టుకు అదనంగా 50,000 ఎకరాలకు సాగునీరందించవచ్చని జల వనరుల శాఖ చెబుతోంది. పురుషోత్తపట్నం వద్ద నిర్మించిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేలా పథకాన్ని డిజైన్ చేశారు. అక్కడి నుంచి విశాఖకు నీటిని తరలిస్తారు.



36వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ రమేశ్‌తో వైద్యశాల సిబ్బంది

అమరావతిలో అత్యాధునిక ఆసుపత్రి

- రమేశ్ హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవంలో డాక్టర్ రమేశ్ వెల్లడి

విజయవాడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆరు పడకలతో తన ప్రయాణాన్ని ప్రారంభించిన రమేశ్ హాస్పిటల్స్ ప్రజల నమ్మకాన్ని చూరగొని దిగ్విజయంగా 36 ఏళ్లు పూర్తి చేసుకుందని ఆ సంస్థ అధినేత డాక్టర్ పోతినేని రమేశ్ బాబు పేర్కొన్నారు. విజయవాడలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'త్వరలో రాజధాని అమరావతిలో అత్యాధునిక ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నాం. మేయో, క్లీవ్ ల్యాండ్ క్లినిక్‌ల స్ఫూర్తితో ఈ ఆసుపత్రి నిర్వహణ సాగుతుంది. అత్యున్నత స్థాయి వైద్యసేవలు, అత్యాధునిక వైద్య పరికరాలను ఈ ఆసుపత్రిలో అందుబాటులోకి తెస్తాం. రమేశ్ హాస్పిటల్స్ సుదీర్ఘ ప్రస్థానంలో 25 వేల గుండె శస్త్ర చికిత్సలు జరిగాయి. వైద్యరంగంలో టెలీ మెడిసిన్ వైద్య విధానాన్ని తీసుకొచ్చిన ఘనత రమేశ్ హాస్పిటల్స్ సొంతం. దీని ద్వారా లక్షలాది మంది రోగులకు సాంత్వన కలిగించాం. గత రెండు సంవత్సరాలుగా క్లౌడ్ డాక్స్ రమేశ్ పేరుతో టెలీ ఐసీయూ ప్రాజెక్టును తీసుకువచ్చాం. గుండెపోటుకు మొదటి గంట అమూల్యం అనే అవగాహన కార్యక్రమంతో మొదలుపెట్టి గుండెపోటు ముప్పును సీటీ యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా ముందే కనుగొనటం, ఆధునిక వైద్య విధానాల్లో వైద్య చికిత్స అందించడం అనే దృఢ సంకల్పంతో రమేశ్ హాస్పిటల్ ముందుకు వెళుతోంది. వైద్యరంగంలో అత్యున్నత వైద్య విధానాలతో సేవలందిస్తున్నందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అవార్డులను ప్రదానం చేశాయి. అత్యుత్తమ విజయాలను నమోదు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో రమేశ్ హాస్పిటల్ పేరు లిఖించాం. కోస్టల్ కారిడార్‌లో విజయవాడ, గుంటూరు, ఒంగోలులో 925 పడకలతో మల్టీ సూపర్ స్పెషాలిటి వైద్య సేవలను అందిస్తున్నాం' అని డాక్టర్ రమేశ్ వివరించారు. సమావేశంలో రమేశ్ హాస్పిటల్స్ చైర్మన్ ఎంఎస్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హుందా రాజకీయాలు చేద్దాం

- విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికపై చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ఎమ్మెల్సీ సీటును గెలవడం పెద్ద కష్టం కాదు. దిగితే తేలిగ్గా గెలుస్తాం. కాని అంత అవసరం లేదు. హుందా రాజకీయాలు చేద్దాం' అని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'అన్ని సందర్భాల్లో గెలుపు ఒకటే ముఖ్యం కాదు. ప్రజల అభిప్రాయాలు, విలువలు ముఖ్యం. ఈ కోణంలోనే ఈ ఎన్నికలో కూటమి నుంచి పోటీ పెట్టవద్దని నిర్ణయం తీసుకొన్నాం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వైసీపీ నుంచి చాలా మంది ప్రజా ప్రతినిధులు కూటమి వైపు వచ్చారు. ఇంకా చాలా మంది వస్తామని సంకేతాలు పంపిస్తున్నారు. కాని మన ముందు ఇంతకంటే ముఖ్యమైన లక్ష్యాలు ఉన్నాయి. రాష్ట్ర పునర్నిర్మాణం, అన్ని వర్గాల అభివృద్ధి మనకు ప్రధానం. వాటిపై దృష్టి కేంద్రీకరించి పనిచేద్దాం' అని ఆయన అన్నారు. చంద్రబాబు తీసుకొన్న నిర్ణయాన్ని కూటమి నేతలు ప్రశంసించారు. ఆయన అత్యంత హుందాగా వ్యవహరించారని వారు పేర్కొన్నారు. పోటీకి దూరంగా ఉండాలన్న నిర్ణయాన్ని ఈ సమావేశం ఆమోదించింది.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త ఆరంభం!

అనేక వారాలపాటు తీవ్ర హింస, రక్తపాతాన్ని చవిచూసిన బంగ్లాదేశ్ చల్లబడుతోంది. నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా గతవారం ప్రమాణం చేశారు. ప్రధాన మంత్రితో సమానమైన ఈ హోదాలో ఆయన ఉంటూ, మరో పదహారు మందితో కూడిన సలహామండలి పాలనలో ఆయనకు సహకరిస్తూండటంతో దేశం తిరిగి గాడినపడటం మొదలైంది. కోటా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన నాహిద్ ఇస్లాం, ఆసిఫ్ మహ్మూద్‌తో పాటు మహిళా హక్కుల కార్యకర్త ఫరీద్ అక్తర్‌లతో పాటు, ఆర్థికవేత్తలు, పౌర సమాజ ప్రతినిధులు, ఒక సైనిక కమాండర్ ఇత్యాదులు ఇందులో ఉన్నారు. దాదాపు అన్నిరంగాలనుంచి ప్రాతినిధ్యం ఉన్నట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సినీ, కళారంగాలకు చెందినవారు లేరని కొందరు నటీమణులు గుర్తుచేశారు. వ్యవస్థలన్నీ కుప్పకూలిన స్థితిలో ఈ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు ఒక కొత్త ఆరంభానికి పునాది.

రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా తాత్కాలిక ప్రభుత్వం నడుచుకుంటుందని యూనస్ హామీ ఇస్తున్నారు. దీర్ఘకాలం రగిలిన తన దేశం ఇంకా చల్లారలేదనీ, పలు అవాంఛనీయఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయనకు తెలియకపోదు. షేక్ హసీనా మీద ఉన్న ఆగ్రహం ఎవరిమీదకు అనవసరంగా మళ్ళుతున్నదో కూడా ఆయనకు అవగాహన ఉన్నది. ప్రధానంగా మైనారిటీల రక్షణకు సంబంధించి ఆయన పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ పరిస్థితులు పూర్తిగా నియంత్రణలోకి రాలేదు. రాజధాని ఢాకాలో హిందువులు పెద్ద సంఖ్యలో రోడ్ల మీదకు వచ్చి తమపైనా, దేవాలయాలపైనా జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ ఘటనలు తాత్కాలిక ఆగ్రహావేశాల్లో భాగమే తప్ప, నిర్దిష్టమైన వ్యూహాలు, కరడుగట్టిన వ్యతిరేకతలు లేవని అక్కడి నాయకులు అంటున్నారు. షేక్ హసీనాకు భారతదేశంతో ఉన్న దశాబ్దాల అనుబంధం, ఆఖరు ఘట్టంలోనూ భారత్ ఆమెకు అండగా నిలవడం ఇత్యాదివి కొందరికి ఏ మాత్రం గిట్టని విషయం మనకు తెలిసిందే. హిందువులకు భద్రత కల్పించండి అంటూ మహ్మద్ యూనస్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. ఆ చెదురుమదురు ఘటనలు ఇక జరగవని అక్కడి నాయకులు హామీ ఇస్తున్నారు. హిందువులపై దాడుల్లో మతం కోణం లేదని, రాజకీయకోణం మాత్రమే ఉన్నది బీఎన్పీ నాయకుల వాదన.

న్యాయవ్యవస్థ, పోలీసు, మీడియా సైతం ఉద్యమకారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సివచ్చింది. ఆయా వ్యవస్థలు, వ్యక్తుల అండదండలతోనే షేక్ హసీనా పదిహేనేళ్ళపాటు దేశాన్ని నిరవధికంగా, నిరంకుశంగా ఏలగలిగారనీ, ఆమె ఆదుపాజ్ఞల్లోకి పోయిన వ్యవస్థలను కూల్చడం, పునర్నిర్మించుకోడం దేశ భవిష్యత్తుకు అవసరమని వారు నమ్మారు. బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్, మరో ఐదుగురు న్యాయమూర్తులు మారుమాట్లాడకుండా రాజీనామాలు చేసిన దృశ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. హసీనా ప్రతీ తప్పునూ వెనకేసుకొస్తూ వీరంతా ఆమెకు రక్షణగా నిలిచారని విద్యార్థి ఉద్యమకారుల ఆగ్రహం. హసీనామీద కోపాన్ని వారు ఎక్కడెక్కడో ప్రదర్శిస్తున్నారు కానీ, పరిస్థితులు వేగంగా ఉపశమించకపోతే వారు ఎంతో ప్రేమగా ప్రతిష్ఠించుకున్న తాత్కాలిక ప్రభుత్వానికి అప్రదిష్ట తప్పదు.

ప్రజాభీష్టాన్ని నిర్ణయించేవి ఎన్నికలే. అవి స్వేచ్ఛగా, స్వతంత్రంగా జరిగినప్పుడు మిగతా ప్రపంచం ఈ పరిణామాలన్నింటినీ నమ్ముతుంది. షేక్ హసీనా ఏలుబడిలో ఒక్క ఎన్నికకూడా సవ్యంగా సక్రమంగా జరగలేదని విమర్శలు ఉన్నందున తాత్కాలిక ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్పు స్పష్టంగా కనిపించాలి. పార్లమెంట్ రద్దయిన మూడునెలల్లోగా ఎన్నికలు జరగాలని బంగ్లాదేశ్ రాజ్యాంగం నిర్దేశిస్తున్నప్పటికీ, అంతలోగా కచ్చితంగా జరుగుతాయని యూనస్ ప్రభుత్వం చెప్పడం లేదు. ప్రత్యేక పరిస్థితుల్లో గడువు పెంచుకొనే సౌలభ్యం ఉన్నదని బీఎన్పీ నాయకులు గుర్తుచేస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆ పార్టీ అధినేత ఖలీదా జియా విదేశాల్లో చికిత్స చేయించుకొని వెనక్కువచ్చేవరకూ ఎన్నికలు ఉండకపోవచ్చునని కొందరి అనుమానం. ఎన్నికలు ఎప్పుడు ప్రకటిస్తే అప్పుడు షేక్ హసీనా బంగ్లాదేశ్‌లో అడుగుపెడతారని ఆమె కుమారుడు అంటున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలు ఎంతో నమ్మకంగా బాధ్యతలు అప్పగించిన మహ్మద్ యూనస్ తన విధిని సక్రమంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సి ఉంది. ఆయనను ముందుపెట్టి బీఎన్పీ, జమాత్-ఎ-ఇస్లామీ వంటివి వెనకనుంచి చక్రం తిప్పుతాయన్న విమర్శలు, విశ్లేషణల్లో నిజం లేదని రుజువుచేయాలి.

తరం మార్పులో తిరస్కృతుడైన నెహ్రూవాది



రాజీవ్ గాంధీ హయాంలో రాజకీయాల్లో ప్రవేశించిన నట్వర్ సింగ్ (1929–2024) నెహ్రూవియన్ ఆలోచనా విధానానికి చెందినవారు. రాజీవ్ ప్రభుత్వంలో ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారు. రాజారావు, నిరాద్ చౌదురి, ఆర్‌కే నారాయణ్, తక్కజి శివశంకర పిళ్లై లాంటి ఎందరో రచయితలతో సన్నిహిత సంబంధాలుండి, సాహిత్యంలో మంచి అభినివేశం ఉన్న నట్వర్‌సింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకోలేకపోయిన కాంగ్రెస్ నేతల్లో ఒకరు.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఆకులు పండిపోయి నేలరాలడం, చెట్లు మళ్లీ చిగురించి నవ నవోన్మేషంగా మారడం ప్రకృతికి ఎంత సహజమో, మానవ సమాజానికి కూడా అంతే సహజం. మూడు రోజుల క్రితం మరణించిన 95 సంవత్సరాల మాజీ విదేశాంగ మంత్రి నట్వర్‌సింగ్ కొన్ని దశాబ్దాల కాంగ్రెస్ చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. ఆయన మరణంతో కాంగ్రెస్‌ను పెనవేసుకున్న ఒక రాజకీయ సంస్కృతి కూడా అదృశ్యమైందని చెప్పవచ్చు. నిజానికి నట్వర్‌సింగ్‌తో కాంగ్రెస్ భవబంధం దాదాపు దశాబ్దంన్నర క్రితమే సమసిపోయింది. ఎన్‌డి తివారి, పోతేదార్, శివశంకర్, కోట్ల విజయ భాస్కరరెడ్డి, పి.వి.నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, మోతీలాల్ వోరా, అర్జున్‌సింగ్, గాడ్గిల్ తదితరులతో పాటు నట్వర్‌సింగ్ కూడా చివరకు కాలగమనంలో కలిసిపోయారు. నిజానికి ఈ నేతల్లో చాలా మంది కంటే నట్వర్‌సింగ్ జూనియర్. రాచకుటుంబంలో పుట్టి, నెహ్రూ హయాంలో విదేశాంగ సర్వీసులో చేరి ఆయన చెల్లెలు కృష్ణహతీ సింగ్ పిల్లలతో పాటు కలిసి చదువుకున్నందువల్ల గాంధీ కుటుంబ కోటరీలో చేరగలిగిన నట్వర్‌సింగ్ పలువురు కాంగ్రెస్ నేతల మాదిరే ఆ కుటుంబ ఆంతరంగిక సభ్యులుగా మెలిగారు. ఇందిర మరణానంతరం రాజీవ్ గాంధీ హయాంలో రాజకీయాల్లో ప్రవేశించి పార్లమెంట్ సభ్యుడుగా తొలిసారి గెలిచిన నట్వర్‌సింగ్ నెహ్రూవియన్ ఆలోచనా విధానానికి చెందినవారు. ఇందిర హయాంలో విదేశాంగశాఖ అధికారిగా ఉండగానే ఆయన పద్మభూషణ్ పురస్కారాన్ని పొందారు. రాజీవ్ హయాంలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాని నట్వర్‌సింగ్ ఆ సమయంలో విదేశాంగ విధానంలో జరిగిన తప్పులను నివారించలేకపోయారు. ఎంత మేధావి అయినా అధికారంలో ఉన్నవారికి సమీపంలో ఉండాలని నిర్ణయించుకున్న వారికి తమ అధినేతలు చేసే తప్పులను ఆ సమయంలో ప్రశ్నించే ధైర్యం ఉండదు. తమ అధినేతల కటాక్ష వీక్షణాలకు దూరమైన తర్వాత వారు చేసిన తప్పులను విమర్శిస్తే మాత్రం ప్రయోజనం ఏముంటుంది?

రాజీవ్ మరణానంతరం అర్జున్‌సింగ్‌తో పాటు ప్రధాన మంత్రి కావాలని ఆశించిన వారిలో నట్వర్‌సింగ్ ఒకరు. కాని ఆ అవకాశం పి.వి.కి దక్కడంతో అసమ్మతివాదులుగా మారిపోయారు. అర్జున్, తివారీ, షీలాదీక్షిత్‌లతో కలిసి సూరజ్‌కుండ్ ఏఐసిసి సదస్సులో నిరసన తెలిపారు. పి.వి.కి అడుగడుగునా కష్టాలు సృష్టించారు. 'మేము ఎన్ని కష్టాలు సృష్టించినా పి.వి. ప్రభుత్వం చెక్కుచెదరలేదు. అయిదు సంవత్సరాలు నిబ్బరంగా మైనారిటీ ప్రభుత్వాన్ని నిర్వహించారు. మా అందరికంటే ఆయనే తెలివైన నాయకుడని నిరూపించుకున్నారు' అని నట్వర్‌సింగ్ తన ఆత్మకథలో వాపోయారు. తర్వాత మరోసారి యూపీఏ హయాంలో కూడా విదేశాంగ మంత్రిగా అవకాశం వచ్చినప్పటికీ అప్పటికే విదేశాంగ విధానం అలీన లక్షణాలను కోల్పోయి, ఆర్థిక విధానాల ఆధిపత్యానికి లోనయ్యే క్రమం వేగవంతమైంది. ఆ క్రమంలోనే ఆయన నిష్క్రమణకు రంగం సిద్ధమైంది. ఇరాక్ నుంచి చమురు దిగుమతి చేసుకుని ఆహార సరఫరాలు చేసే పథకానికి సంబంధించి నట్వర్ సింగ్, ఆయన కుమారుడు లబ్ధిదారులు అన్న ఆరోపణలు రావడంతో 2006లో కాంగ్రెస్ ఆయనను బహిష్కరించింది. ఆ సమయంలో ఆయన మౌనంగా ఉండి, సోనియా శరణు వేడినా తర్వాతి కాలంలో కాంగ్రెస్ చేరదీసి ఉండేదేమో? కాని నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్‌కు అంకితభావంతో సేవ చేసిన తనకు పార్టీ అండగా నిలబడకపోవడంతో ఆయన మనసు గాయపడి కాంగ్రెస్‌ను ధిక్కరించారు. ఆయన కుమారుడు బీజేపీలో చేరాడు. నట్వర్ సైతం తన చరమదశలో నరేంద్రమోదీని కలిసి ప్రశంసల వర్షం కురిపించడం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పలచన చేసింది. చివరకు పూర్తిగా విస్మరణకు గురై, పలకరించేవారు కరువైన పరిస్థితుల్లో నట్వర్ దివంగతులయ్యారు. రాజారావు, నిరాద్ చౌదురి, ఆర్ కేనారాయణ్, తక్కజి శివశంకర పిళ్లై లాంటి ఎందరో రచయితలతో సన్నిహిత సంబంధాలుండి, సాహిత్యంలో మంచి అభినివేశం ఉన్న నట్వర్‌సింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకోలేక నిష్క్రమించిన అనేకమంది కాంగ్రెస్ నేతల్లో ఒకరని చెప్పక తప్పదు.

నట్వర్‌సింగ్ లాంటి వారిని వదుల్చుకోవడమే కాంగ్రెస్‌లో కాల పరిణామంలో వస్తున్న మార్పులకు నిదర్శనం అని భావించాల్సి ఉంటుంది. తనను తాను నెహ్రూవాదిగా చెప్పుకున్నప్పటికీ పీవీకి తాను ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలకూ నెహ్రూ విధానాలకు పొంతనలేదన్న విషయం తెలియనిది కాదు. ఆలోచనా విధానానికి వయసుకూ సంబంధం ఉండదని నిరూపించిన కొద్ది మంది నేతల్లో పీవీ ఒకరు. అందుకే తాను చేయదలుచుకున్న మార్పుల చక్రానికి అనుగుణంగా లేని వ్యక్తులను వయసుతో నిమిత్తం లేకుండా ఆయన వదుల్చుకున్నారు. వారు గాంధీ కుటుంబ విధేయులన్న విషయాన్ని కూడా ఆయన పట్టించుకోలేదు.

సోనియాగాంధీకి కూడా గత కాలపు అవశేషాల పట్ల అంత ఆసక్తి లేదు. పీవీకి వ్యతిరేకంగా తివారీ, అర్జున్ సింగ్, పోతేదార్, నట్వర్‌సింగ్ తదితరులు అసమ్మతి శిబిరం నడుపుతున్నప్పటికీ ఆమె తన ప్రయోజనాల రీత్యా వారిని వారించలేదు కాని వారిని పూర్తిగా చేరదీయలేదు కూడా. తనకు ప్రధాని పదవి వచ్చే అవకాశాలు లేవని తెలిసినప్పుడు మన్మోహన్‌సింగ్ లాంటి వారికి అవకాశం కల్పించారు కాని విధేయులను పక్కన పెట్టారు. కాకపోతే మంత్రి పదవుల్లో, గవర్నర్ పదవుల్లో ఇచ్చి బుజ్జగించారు. నట్వర్‌సింగ్ లాంటివారిపై జైరాం రమేశ్ లాంటి తర్వాతి తరం నేతలు జోకులు విసురుతుంటే సోనియా నవ్వుతూ ఉండేవారని నట్వర్ రాసిన ఆత్మకథ చదివినప్పుడు అర్థమవుతోంది.

నట్వర్ మాత్రమే కాదు, క్రమక్రమంగా ఇందిర, రాజీవ్, సంజయ్ హయాం కాలపు నేతలందరూ కనుమరుగయ్యారు. ఒకప్పుడు సంజయ్‌గాంధీ మిత్రగణంలో చలాకీగా ఉన్న అంబికా సోనీ నిన్నమొన్నటి వరకూ రాజ్యసభ సభ్యురాలిగా ఉండి ఇప్పుడు 8 పదులు దాటిన వయసులో కాలక్షేపం చేస్తున్నారు. మరణించేంత వరకూ మోతీలాల్ వోరాను కోశాధికారిగా కొనసాగించి, రాజ్యసభలో నిద్రపోతున్నా కాంగ్రెస్ ఆయనను ఓపికగా భరించి గౌరవంగా నిష్క్రమించేందుకు వీలు కల్పించింది. సంజయ్ మిత్రుడైన గులాంనబీ ఆజాద్ లాంటి అనేక మంది తమ దారి తాము చూసుకుంటే దిగ్విజయ్‌సింగ్, కమలనాథ్ లాంటి నేతలు సహజంగా నిష్క్రమించే తరుణం ఆసన్నమైందని చెప్పక తప్పదు. ఎకె ఆంటోనీ, మన్మోహన్‌సింగ్, మీరాకుమార్ తదితరులు ఇప్పటికే క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 77 సంవత్సరాల సోనియాగాంధీ తనకు తాను ప్రత్యక్ష ఎన్నికలకు దూరమై రాజ్యసభను ఎంచుకున్నారు. అనేకమంది సీనియర్ నేతల సంతానం రాజకీయాల్లో ఇప్పటికే ప్రవేశించారు. మళ్లీ 2029లో లోక్‌సభ ఎన్నికలు జరిగే నాటికి ఇప్పుడున్న వారిలో అనేకమంది మనకు రంగంలో కనపడకపోవచ్చు.

నిజానికి నరేంద్ర మోదీ పాలించిన గత పదేళ్ల కాలంలో చాలా మంది నాయకులు తెరమరుగయ్యారు. మోదీ అధికారంలోకి రాగానే ఒక వ్యూహం ప్రకారం అడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ వంటి వృద్ధులను మాత్రమే కాదు, పాత తరానికి సన్నిహితంగా ఉన్నవారందరినీ క్రమక్రమంగా బీజేపీలో నిర్ణయాధికారం నుంచి దూరం చేసే ప్రక్రియ ప్రారంభిస్తే కాంగ్రెస్‌లో సహజంగా ఈ మార్పులు జరిగాయని చెప్పక తప్పదు. కాంగ్రెస్ వయసును రాజకీయాల్లో ఒక కొలమానంగా పెట్టుకోకపోయినా తరం మార్పు ఆ పార్టీలో కూడా జరిగింది. సోనియాగాంధీ నెహ్రూ, ఇందిర, రాజీవ్ కాలం నుంచి ఉన్నవారందరినీ కొంతకాలం భరించారు. రాహుల్ కూడా మొదట్లో పాతతరం వారిని భరించక తప్పలేదు. కాని క్రమంగా కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాత్మకంగా పార్టీలో సంస్థాగతంగా బాధ్యతలు కొత్త వారికి అప్పజెప్పడం ప్రారంభించింది. గత ఏడాది ఉదయపూర్‌లో జరిగిన ఏఐసీసీ సదస్సులో 50 శాతం నేతలను 50 సంవత్సరాల లోపు వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నది. దాన్ని పూర్తిగా అమలు చేయలేకపోయినా తమ నాయకత్వం వయసును తగ్గించుకునే ఆలోచనలో కాంగ్రెస్ ఉందనడంలో సందేహం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శుల్లో అందరూ 70 ఏళ్ల లోపు ఉన్నవారే. వీరిలో జైరాం రమేశ్ ఒక్కరే అందరికన్నా సీనియర్. రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, సచిన్ పైలట్, గౌరవ్ గొగోయ్, దీపేందర్ హుడా, రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, ప్రణీతీ షిండే, సుప్రియా శ్రీనాటే, బి.వి. శ్రీనివాస్, ఫులోదేవి నేతమ్, గుర్దీప్ సప్పల్, కన్హయ్యకుమార్, నీరజ్ కుందన్ తదితర యువ నేతలదే కాంగ్రెస్ రాజకీయాల్లో భవిష్యత్ అని చెప్పక తప్పదు. ఇతర పార్టీల్లో కూడా అలాంటి యువ నేతలు ఎందరో ఉన్నారు.

కాని ప్రపంచ దేశాల్లో వస్తున్న మార్పులు, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంలో రోజురోజుకూ మారిపోతున్న పరిణామాలు, భాషలోనూ, భావాల వ్యక్తీకరణలోనూ కనపడుతున్న కొత్తదనం, సమాజానికి అవసరమైన ప్రమాణాలు, నైపుణ్యాలు, నాణ్యత గల సేవలు, పెరుగుతున్న భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించాల్సిన మౌలిక సదుపాయాలు, సంపద కేంద్రీకృతం కాకుండా అందరికీ అందుబాటులోకి రావాల్సిన మార్గాల గురించి ఆలోచించని రాజకీయతరం లేకపోతే ఏమి ప్రయోజనం ఉంటుంది? గడచిన అయిదు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక యువనేతకు పూర్తి మెజారిటీ ఇచ్చి అధికారం చలాయించే అవకాశం ప్రజలు కల్పించినప్పటికీ నిధులను పూర్తి దుర్వినియోగం చేసి రాష్ట్రం కొన్ని దశాబ్దాలు వెనుకకు పయనించేందుకు వీలు కల్పించారు. అదే సమయంలో నేటి వాట్సాప్‌లో గతం గురించి గొప్పలు చెప్పుకుంటూ ఆధునిక భావజాలాన్ని, హేతుబద్ధతను, వివేచనను అవహేళన చేసే వారిని చూస్తుంటే ఆవేదన కలుగుతుంది. 'కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు, తాతగారి, బామ్మగారి భావాలకు దాసులు, నేటి నిజం చూడలేని కీటక సన్యాసులు' అని ఇలాంటి వారిని చూసే మహాకవి శ్రీశ్రీ రాసి ఉంటారు. వీరికన్నా తమ అనుభవాన్ని జరిగిన తప్పులను సవరించుకునేందుకు ఉపయోగించుకుని ప్రజల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఒక లక్ష్యంతో చర్యలు చేపట్టే వారికి వయసుతో నిమిత్తం ఏముంటుంది?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

60 రోజులు.. 60 మంచి పనులు...

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రెండు నెలలు పూర్తి అయ్యింది. రాష్ట్ర ఖజానా దివాళా స్థితిలో వున్నా రెండు నెలల్లోనే 60కి పైగా చెప్పుకోదగిన కార్యక్రమాలు చేశారు. గత ముఖ్యమంత్రి జగన్ సీఎం అయిన మొదటి రెండు నెలల్లో పింఛన్లు రూ.250లు పెంచడం తప్ప మంచి పనులేమీ చేయలేదు. ప్రజావేదికను కూల్చి విధ్వంసంతో పాలన ప్రారంభించారు. రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వం 60కి పైగా మంచి పనులు చేసినా హామీలన్నీ అమలు చేయలేదని జగన్, నీలి మీడియా దుష్ప్రచారం చేస్తున్నది. తాను అధికారం చేపట్టే నాటికి ఖజానాలో రూ.100 కోట్లే ఉన్నాయని జగన్ అబద్ధాలు చెబుతున్నారు. చంద్రబాబు హయాంలో మిగులు విద్యుత్ ఉంది. సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు అన్నీ సిద్ధం చేసి జగన్ చేతిలో పెట్టారు. అయినా ఎడాపెడా అప్పులు చేశారు. భారీగా ధరలు, పన్నులు, ఛార్జీలు పెంచారు. ఇవన్నీ కప్పిపెట్టి అబద్ధాలు చెబుతున్నారు.

చంద్రబాబు అధికారానికి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు ఒకే దఫా రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడంతోపాటు, బకాయిలు రూ.3 వేలు కూడా కలిపి రూ.7 వేలను 64 లక్షల మందికి ఇవ్వడం దేశ చరిత్రలో ప్రథమం. ఒకటవ తేదీనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు ఇచ్చారు. వైసీపీ పాలనలో కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే ఉండేది కాదు. ఎన్‌డీఏ పాలనలో అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి ప్రోత్సాహం, ఎనిమిది వెనుకబడిన జిల్లాలకు కేటాయింపులు, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడల అభివృద్ధి అంశాలు కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో చోటు చేసుకున్నాయి. రైతులకు ధాన్యం బకాయిలు రూ.1,674 కోట్లు చెల్లించారు. రూ.286 కోట్లతో రోడ్ల మరమ్మత్తులు చేపట్టారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి, నారా లోకేష్, మంత్రులు, ప్రజాదర్బార్ ద్వారా ప్రతిరోజూ తీసుకుంటున్న అర్జీలు 50 వేలకు పైగా చేరాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో గతంలో అర్జీలు తీసుకునేవారు కాదు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం కానున్నాయి. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవోను రద్దు చేశారు. చేనేత వృత్తిదారులకు జీఎస్టీ ఎత్తివేత, గృహ నిర్మాణానికి రూ.50 వేలు అదనంగా ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలతో పాటు గ్రామంలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు మంజూరు చేశారు. అమరావతిలో రూ.250 కోట్లతో ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ ఏర్పాటు జరగబోతున్నది. డ్రిప్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో ఇచ్చే పథకం తిరిగి ప్రారంభించారు. ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమైంది. గల్ఫ్ బాధితులు నారా లోకేష్ చొరవతో విడుదలయ్యారు. తుపాన్ బాధితులకు రెట్టింపు సహాయం చేశారు.



రెండు నెలల్లోనే చెప్పుకోదగిన పనుల్ని చంద్రబాబు ప్రభుత్వం చేసింది. అయినా జగన్‌రెడ్డి నిత్యం విషప్రచారం చేస్తున్నారు. వ్యక్తుల మధ్య జరిగిన కొన్ని ఘటనల్ని కొండంత చేసి రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టకుండా కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రంలో గతంలో నియంతృత్వం రాజ్యమేలగా, నేడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నది.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరించబోమని కేంద్రమంత్రి కుమారస్వామితో ప్రకటన చేయించారు. దివ్యాంగులకు వైద్యకళాశాలల్లో అడ్మిషన్లు, లాప్‌టాప్‌లు ఇచ్చారు. ప్రజల ఆస్తుల్ని కబ్జా చేసే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అసైన్‌మెంట్ భూములు 9 లక్షల ఎకరాలు కారుచౌకగా వైసీపీ నేతలు కొట్టేసే కుట్రకు బ్రేక్ వేశారు. మదనపల్లె భూకబ్జాలపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించారు. గంజాయి నియంత్రణకు ఐదుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు, రాజముద్రతో భూ-పాస్ పుస్తకాల జారీ, ప్రజా రాజధాని అమరావతిలో భూమిలేని కూలీలకు పెన్షన్ ఇచ్చి, దాన్ని మరో ఐదేళ్లకు పొడిగించారు. పరదాలు, ట్రాఫిక్ ఆంక్షలు లేకుండా, చెట్లు నరికి వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలు సాగుతున్నాయి. శ్రీశైలానికి ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపడానికి ఆదేశాలు జారీ చేశారు. ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసి గత ప్రభుత్వ నేరాలు, ఘోరాలు ప్రజల ముందుంచారు. రేషన్ సరుకులు పెంచారు. విదేశాలకు అక్రమ బియ్యం ఎగుమతులకు బ్రేక్ వేశారు. కౌలు రైతులకు కోపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయించారు.

ముచ్చుమర్రి గ్యాంగ్ రేప్ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకున్నారు. తిరుమల ప్రక్షాళనతోపాటు లడ్డూ నాణ్యత పెంచారు. మూడు నెలల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణ పూర్తికి చర్యలు తీసుకున్నారు. యూట్యూబ్, గూగుల్, మహేంద్ర వంటి సంస్థలతో భేటీలు జరిగాయి. ఉపాధి పథకం ద్వారా 6.50 కోట్ల పనిదినాలు కల్పన వల్ల అదనంగా 54 లక్షల మంది లబ్ధికి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తిదాతల పేర్లు పెట్టారు. మైనారిటీ విద్యార్థులకు టెట్‌లో ఉచిత శిక్షణకు 19 కేంద్రాల ఏర్పాటు, మెటీరియల్ కాంపొనెంట్ క్రింద రూ.2 వేల కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు, 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి సంతకం చేశారు. ఇలా రెండు నెలల్లోనే 60కి పైగా చెప్పుకోదగిన పనుల్ని చంద్రబాబు ప్రభుత్వం చేసింది. అయినా జగన్‌రెడ్డి నిత్యం విషప్రచారం చేస్తున్నారు. వ్యక్తుల మధ్య జరిగిన కొన్ని ఘటనల్ని కొండంత చేసి రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టకుండా కుట్రలు చేస్తున్నారు.

గతంలో చంద్రబాబు, లోకేష్ పర్యటనలను అడ్డుకున్నారు. కానీ నేడు జగన్ పర్యటనల్ని ప్రభుత్వం అడ్డుకోలేదు. రాష్ట్రంలో గతంలో నియంతృత్వం రాజ్యమేలగా, నేడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నది. బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతివనంలో అంబేడ్కర్ పేరు చిన్న అక్షరాలతో, జగన్ పేరు తాటికాయంత అక్షరాలతో వేసి అంబేడ్కర్‌ను అవమానించారు. దాన్ని సహించలేని ఎవరో అక్కడ జగన్ పేరు తొలగించారు. దాన్ని అడ్డం పెట్టుకుని అబద్ధాలతో కుల విద్వేషాలు రెచ్చగొట్టేందుకు జగన్ మీడియా చేయని విన్యాసం లేదు. తన దుష్ట లక్షణాల్ని టీడీపీకి అంటగట్టి చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్ నైజం.

• గురజాల మాల్యాద్రి
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

అన్యాయపు శిక్ష!

ఏడాదిన్నర కాలంగా ఢిల్లీ మద్యం విధానం కేసులో జైల్లో ఉన్న ఆ రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసి ఊరటనిచ్చింది. ఆ కేసు విచారణకు సీబీఐ ఇంకా సిద్ధం కాలేదు. దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన బెయిల్ కోసం క్రింది కోర్టుల మెట్లు ఎక్కీ దిగీ వస్తున్నారు. సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు బెయిల్‌ని వ్యతిరేకిస్తూ రావడం వల్ల, విచారణ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని చెప్పడం వల్ల ఆయనకు బెయిల్ ద్వారా స్వేచ్ఛ లభించలేదు. ఈ విషయాల్ని గమనించి సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కింది కోర్టులు రక్షణాత్మక వైఖరితో సేఫ్ గేమ్ ఆడుతూ, బెయిల్ ఇవ్వకుండా ఆయన స్వేచ్ఛ హక్కుని కాలరాయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పు పట్టింది. ఎందుకంటే న్యాయ సూత్రాల ప్రకారం బెయిల్ అన్నది నిందితుడి సహజ హక్కు, తప్పనిసరి సమయాల్లోనే జైలులో ఉంచాలి. ఆ వ్యక్తి ద్వారా సాక్ష్యాలు ప్రభావితం అవుతాయనుకుంటేనో, లేదా ఆయన దేశం విడిచి పారిపోతాడనుకుంటేనో జైల్లో ఉంచాలి. దర్యాప్తు సంస్థలు అన్ని పత్రాల్నీ సేకరించి పెట్టుకున్నపుడు, వాటిపైనే కేసు ఆధారపడి ఉన్నప్పుడు ఆయనకి కేసును ప్రభావితం చేసే అవకాశం లేదన్నది కింది కోర్టులు గమనించాల్సింది. విచారణ ప్రక్రియ మొదలవ్వడమే తీవ్రంగా జాప్యం కావడం, అంత వరకూ నిందితుడు జైల్లోనే మగ్గాల్సి రావడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. తప్పు చేశాడని ఋజువు కాకముందే శిక్షించడం అన్యాయం. ఒకవేళ ఆయన నిరపరాధి అయితే, చేయని నేరానికి, శిక్ష అనుభవించాల్సి రావడం ఎంత వేదనాభరితం? దర్యాప్తు సంస్థల నిష్పక్షపాత ధోరణిపై, అధికార పీఠాలతో వాటి దగ్గరతనంపై అనుమానాలున్నప్పుడు న్యాయ ప్రక్రియ మరింత లోపరహితంగా ఉండాలి. నిందితుడి వైపు నుండి ముందు ఆలోచించాలి.

ఇలా విచారణ ఖైదీలకు న్యాయవ్యవస్థ అనుమతించిన బెయిల్ హక్కు దూరం కావడం అరుదైన విషయం కాదు. జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం గత సంవత్సరం జైళ్లల్లో మగ్గుతున్న విచారణ ఖైదీలు నాలుగు లక్షల ముప్పయి వేల మంది. పూచీకత్తులకు ధనం లేక, సహాయం లేక ముద్దాయిలుగా ముద్రపడక ముందే, ఆ నేరానికి తమకు పడగల శిక్షకన్నా ఎక్కువ శిక్షకు గురై ఉన్నారు. సమాజంలో పలుకుబడి, అధికారం ఉన్న సిసోడియా లాంటి వారికే, అదీ అన్ని వనరులతో పోరాడితేనే, అందాల్సిన న్యాయం ఏడాదిన్నరకి అందితే, ఇక ఏ దిక్కూ లేని వారి సంగతేమిటి? ఆ లక్షలాది మందికి కూడా న్యాయం దక్కేలా వ్యవస్థను సరిదిద్దుకోవాలి. లేదంటే అది ఒక సామాజిక వైఫల్యంలా, భారతీయ న్యాయ వ్యవస్థకే మచ్చలా మిగిలి పోతుంది.

– డి.వి.జి. శంకరరావు

పేదవాడి అన్నం గిన్నె... 'అన్న' క్యాంటీన్!

'దేశంలో అత్యధిక శాతం ప్రజలు ప్రతిరోజూ ఆకలితోనో, అర్ధాకలితోనో ముణగదీసుకొని పడుకోవడం కంటే మించిన విషాదం, అనాగరికత మరొకటి లేదు. ప్రజల క్షుద్బాధను తీర్చడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం కావాలి' అన్నారు మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్ర్యం లభించిన సందర్భంలో. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందిన 1947 ఆగస్టు 15 నాటికి దేశంలో పేదరికం 80 శాతంగా ఉంది. అప్పటికి 4 ఏళ్ల ముందు.. బెంగాల్‌లో తీవ్ర క్షామం ఏర్పడి 40 లక్షల మంది ఆకలితో చనిపోవడం భారతదేశం ఎదుర్కొన్న పెను విషాద సంఘటనల్లో ఒకటి.

1956లో ప్లానింగ్ కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ మిన్హాస్ ఆనాటికి దేశంలో పేదరికం స్థాయి 65 శాతంగా ఉన్నట్లు అంచనా వేశారు. ప్రతిరోజూ 2,200 కేలరీల శక్తి అందించే ఆహారం తీసుకోలేని ప్రతి ఒక్కరూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్టుగా ప్లానింగ్ కమిషన్ లెక్కగట్టింది. ఆ తర్వాత పేదరికం స్థాయి కొలవడానికి ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోవడం మొదలుపెట్టారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదరిక నిర్మూలన అతిపెద్ద సవాలుగా మారింది. అయితే అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు విడివిడిగా, ఉమ్మడిగా పలు రకాల పేదరిక నిర్మూలనా పథకాలు అమలు చేయడం మొదలుపెట్టాయి. అయినప్పటికీ, దేశంలో ఆకలితో అలమటించేవారి సంఖ్య పెరుగుతూ పోయింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారకరామారావు 1983లో కిలో బియ్యం రూ.2ల చొప్పున 25 కిలోల బియ్యం ప్రతి పేద కుటుంబానికి అందించే పథకం ప్రవేశపెట్టి సంక్షేమ రంగంలో ఓ కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఈ పథకం పేదల క్షుద్బాధను తీర్చడమేకాక వారికి ఆహారభద్రత సమకూర్చింది. దీనివల్ల రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు వెల్లడించాయి.

తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొలిరోజుల్లోనే ఎన్‌టిఆర్ "పేద ప్రజలే నాకు దేవుళ్లు. వారికి ఇంత నైవేద్యం పెట్టడమే నా విధివిధానం" అని తన ఉద్దేశాన్ని చాలా స్పష్టంగా తెలియజెప్పారు. ఆయన అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 43 శాతం మంది పేదలు ఉన్నారు. అందులో గ్రామీణ ప్రాంత పేదరికం దాదాపు 50 శాతం దాటి ఉన్నట్లు అధికారిక లెక్కలు తెలిపాయి. ఆ నేపథ్యంలోనే తొలి అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి పేద కుటుంబానికి నెలకు 25 కిలోల బియ్యాన్ని కిలో రూ.2లకు అందించే పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు ఎన్‌టిఆర్ ప్రకటించారు. ఈ పథకం అమలునకు విధివిధానాలు రూపొందిస్తున్న క్రమంలో ఓ ఉన్నతాధికారి ఆయనతో "సార్.. మరోసారి ఆలోచించండి. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు మోయలేని భారం పడుతుంది" అని చెప్పబోతుంటే "పేదవాడికి పట్టెడన్నం పెట్టలేనప్పుడు ప్రభుత్వం దేనికండి? రాజకీయాలు దేనికి? ఎంత భారమైనా పరవాలేదు నేను చూసుకొంటాను" అని ఎన్‌టిఆర్ తీవ్ర స్వరంతో బదులిచ్చారు.

విశేషం ఏమంటే పేదవాడి ఆకలి తీర్చడానికి అందించే బియ్యం పథకంలో ఎన్‌టిఆర్ అంకెలగారడీ చేయలేదు. చిత్తశుద్ధితో ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలనుకొన్నారు. అందులో భాగంగా ఆనాడు తెల్లరేషన్ కార్డు పొందడానికి ఉన్న వార్షిక ఆదాయ పరిమితిని రూ.3,600 నుంచి రూ.6,000లకు పెంచారు. దాంతో 1 కోటి 43 లక్షల కుటుంబాలకు కిలో రెండు రూపాయల బియ్యం పథకం అందింది. అంతేకాకుండా వారసత్వంగా సంక్రమించిన బలహీన ప్రజాపంపిణీ వ్యవస్థ (డిడిఎఫ్)ను పటిష్టం చేయడానికి సమర్థుడు, నిజాయితీపరుడైన ఐఏఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్‌ను సివిల్ సప్లయిస్ కమిషన్‌గా నియమించారు. అంతకుముందు, కాంగ్రెస్ పాలనలో పీడీఎస్ వ్యవస్థ బలహీనంగా, అవినీతిమయమై ఉండేది. చౌకధరల డిపోల ద్వారా కిరోసిన్, పంచదార, అప్పుడప్పుడు అరకొరగా బియ్యం ఇచ్చేవారు. తూనికల్లో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకొన్నవారే కరువయ్యారు. అయితే, కె.ఆర్.వేణుగోపాల్, ఆ తర్వాత ఆయన స్థానంలో వచ్చిన సి.డి.అర్థల సారథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టం అయింది. ఢిల్లీ వెళ్లి నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని ఒప్పించి కేంద్రం ద్వారా లభించే బియ్యం కోటాను పెంచడంలో కూడా ఎన్‌టిఆర్ విజయం సాధించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి పేదవాడి ఇంట్లో నెలలో మొదటివారంలో 25 కిలోల బియ్యం మూట.. అది కూడా 100 గ్రాముల తరుగులేకుండా ఉండాలని ఎన్టీఆర్ ఇచ్చిన ఆదేశం తు.చ. తప్పకుండా అమలైంది. ఈ పథకం ద్వారా దాదాపు 20 లక్షల మెట్రిక్ టన్నులు బియ్యం పంపిణీ అయ్యేవి. పేదలు ఏ రోజు బియ్యం ఆ రోజు తెచ్చుకొనే దుస్థితి నుంచి, నెలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి తెచ్చుకొని ఆహారభద్రతతో స్థిమితంగా, సుఖంగా నిద్రపోయిన మెరుగైన స్థితికి రాష్ట్రం చేరుకుంది.

ఇక, హైదరాబాద్–సికింద్రాబాద్ జంటనగరాలతో పాటు రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలలో ఎన్టీఆర్ పాలనలో అన్నపూర్ణ క్యాంటీన్ల ఏర్పాటునకు కూడా ఘనమైన నేపథ్యం ఉంది. 80వ దశకంలో ఇప్పటి మాదిరిగా నగరాలలో, పట్టణాలలో రోడ్‌సైడ్ టిఫిన్ సెంటర్లు, ఇడ్లీ బండ్లు లేని సమయంలో కార్మికులు, రోజువారీ కూలీలు, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజల రోజువారీ ఆకలి అవసరాలు తీర్చడానికి హోటళ్లు మాత్రమే ఉండేవి. అయితే, అందులో తినుబండారాల ధరలు పేదలకు అందుబాటులో లేవని గుర్తించిన ఎన్‌టిఆర్ 1984 ఫిబ్రవరిలో హోటళ్లను వాటి వ్యాపార పరిణామాన్ని బట్టి వర్గీకరణ చేసి.. ఆయా హోటళ్లల్లో తినుబండారాల ధరలను ఫిక్స్ చేస్తూ ఓ ఆర్డినెన్స్ తెచ్చారు. అయితే, ఆ ధరలు తమకు సమ్మతం కావంటూ హోటళ్ల యజమానుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చింది. ఆ సందర్భంగా ఫిబ్రవరి 21, 1984న ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు అసెంబ్లీలో నిబంధన 329 కింద జరిగిన చర్చలో మాట్లాడుతూ హోటళ్ల యజమానులకు ఓ అప్పీల్ చేశారు. "ధరలు తగ్గించమని నేను పై అంతస్తులో ఉన్నవారి కోసం అభ్యర్థించడం లేదు. పేదవారి కోసం అడుగుతున్నాను. ఈ రోజు స్వల్పంగా ఫలహారం తీసుకోవడం, కాఫీ లేదా టీ త్రాగడం సమాజంలో ఒక నిత్యావసరంగా మారిపోయింది. నేతిపలహారాలు, మసాలాదోశ, మసాల వడ, మైసూర్‌పాక్‌ల ధరలను మేం నిర్ణయించడం లేదు. కేవలం పేదలు తినే ఇడ్లీ, వడ, ఉప్మా, సాదాదోశ, కాఫీ, టీ, ఒక ప్లేటు భోజనానికి మాత్రమే ధరలు నిర్ణయించాం. విస్తరి నిండా కూడా భోజనం పెట్టడానికి నిర్ణయించలేదు. ఎవరు ఆకలితో, అన్నార్తితో వస్తారో వారికి కొంత ఆకలి తీర్చడానికి మీరు ఈ కాస్త సహకారం ఇవ్వండి.. పేదవారి ఆకలిని గమనించి సహకరించి పుణ్యం కట్టుకోండి" అంటూ ఎన్‌టిఆర్ చేసిన అభ్యర్థన పేదవాడి ఆకలి తీర్చడానికి పడిన ఆరాటానికి అద్దం పడుతుంది.

ఆనాడు అసెంబ్లీలో ఈ చర్చ జరిగినపుడు.. హోటళ్ల వాళ్లు న్యాయస్థానానికి వెడితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వచ్చే అవకాశం ఉందని కొందరు సభ్యులు హెచ్చరించిన నేపథ్యంలో.. ప్రభుత్వమే పేదల ఆకలిని తీర్చడానికి క్యాంటీన్లు తెరవాలని నిర్ణయించి రాష్ట్రవ్యాప్తంగా 'అన్నపూర్ణ క్యాంటీన్లు' ప్రారంభించారు. జంటనగరాలతోపాటు రాష్ట్రంలోని అనేక పట్టణాలలో సబ్సిడీ ధరలపై పేదలకు ఉదయం వేళ ఉపాహారం, మధ్యాహ్నం ప్లేట్ భోజనం అందించే అన్నపూర్ణ క్యాంటీన్లు ఆనాడు పేద ప్రజల పాలిట అక్షయపాత్రగా ఉపయోగపడ్డాయి. దేశంలో పేదల కోసం ప్రభుత్వమే క్యాంటీన్లు ప్రారంభించి సబ్సిడీ ధరలపై ఆహారాన్ని అందించడం అదే ప్రథమం. పేదల ఆకలిని గుర్తించి తీర్చడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న ఏకైక నాయకుడు దేశంలో ఎన్‌టిఆర్ ఒక్కరే.


పేదల పెన్నిధి అయిన ఎన్‌టిఆర్ పేరుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల ఆకలిని తీర్చడానికి ఐదు రూపాయల స్వల్పధరతో భోజనం అందించే 'అన్న క్యాంటీన్ల'ను ఐదేళ్ల తర్వాత పునఃప్రారంభించడం ఆహ్వానించదగినది. పేదలకు పట్టెడన్నం పెట్టడమే తన రాజకీయ విధానమని చాటిచెప్పిన ఎన్టీఆర్‌కు అందించే ఘనమైన నివాళి అన్న క్యాంటీన్ల ప్రారంభం.

తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొలిరోజుల్లోనే ఎన్‌టిఆర్ "పేద ప్రజలే నాకు దేవుళ్లు. వారికి ఇంత నైవేద్యం పెట్టడమే నా విధివిధానం" అని తన ఉద్దేశాన్ని చాలా స్పష్టంగా చెప్పారు. అందులో భాగంగానే కిలో బియ్యం రూ.2ల చొప్పున 25 కిలోల బియ్యం ప్రతి పేద కుటుంబానికి అందించే పథకం ప్రవేశపెట్టారు. ఆ తరువాత ప్రభుత్వమే పేదల ఆకలిని తీర్చడానికి క్యాంటీన్లు తెరవాలని నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా 'అన్నపూర్ణ క్యాంటీన్లు' ప్రారంభించారు. పేదల ఆకలిని గుర్తించి తీర్చడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న ఏకైక నాయకుడు దేశంలో ఎన్‌టిఆర్ ఒక్కరే.



■ విక్రమ్ పూల
సీనియర్ జర్నలిస్ట్

(ఆగస్టు 15న 'అన్న క్యాంటీన్లు' పునఃప్రారంభం)



చెట్టూ.. మట్టీ.. చెరువూ.. చేనూ ఏదీ వదల్లేదు. ఉద్యోగం.. ఉపాధి.. ఇసుక.. బుసక.. అన్నిటిలోనూ దందాలు.. కమీషన్లు.. ప్రతిదీ అరాచకమే. చివరికి కాపాడమని కోరుతూ వచ్చిన బాధితుల నుంచీ లంచాలే. ఇలా ఎన్నో దారుణాలు. ఇంకెన్నో పాపాలు. ఆ పాపాలే ఇప్పుడు శాపాలయ్యాయి. గత ఐదేళ్లలో కట్టుకున్న అవినీతి కోటను బద్దలు చేస్తున్నాయి. 2160 గజాల అగ్రిగోల్డ్ భూముల కోసం కక్కుర్తిపడి కన్న కొడుకునే జైలుపాలు చేసుకునే దుస్థితిలోకి నెట్టాయి. కృష్ణాజిల్లా పెడన ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఐదేళ్లూ అవినీతి అక్రమాల్లో జోగాడిన.. జోగి రమేశ్ పరిస్థితి ఇది. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో సొంత పార్టీ నాయకులే ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఐదేళ్లు సంపాదించింది సరిపోక చివరికి కన్న కొడుకు భవిష్యత్తును పణంగా పెట్టారంటూ వైసీపీ నాయకులు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)

● చంద్రబాబు ఇంటిపై దాడితో మొదలై..

గత ప్రభుత్వంలో అప్పటి మాజీ సీఎం చంద్రబాబు నివసిస్తున్న ఉండవల్లి కరకట్ట ఇంటిపై 2021 సెప్టెంబరు 17న వైసీపీ నాయకులు దాడికి యత్నించారు. వందల సంఖ్యలో కార్లలో తరలివచ్చి ఈ దాడికి సిద్ధమయ్యారు. ఈ దాడికి జోగి రమేశ్ నేతృత్వం వహించారు. జోగి అనుచరులైన పాలడుగు దుర్గా ప్రసాద్, నల్లమోతు జాన్, మధుపల్లి ఆనంద్‌కుమార్, మేడపాటి నాగిరెడ్డి, ఆరేపల్లి రాము, నల్లమోతు మధు తదిరులతోపాటు జోగి తమ్ముడు రాము కూడా దాడిలో పాల్గొన్నారు. ఈ దాడి తర్వాతే జోగికి మంత్రి పదవి ఖాయమైంది.



జోగి రాజీవ్‌ను ఇబ్రహీంపట్నంలోని అతని ఇంటి వద్ద అరెస్టు చేస్తున్న పోలీసులు

పాపాల్లో జోగి!




ప్రభుత్వాసుపత్రి వద్ద జోగి అనుచరుల నిరసన

వైసీపీ పాలనలో మట్టి, ఇసుక, చెరువు, భూమి.. ఏదీ వదలని జోగి రమేశ్

ప్రతి పనిలోనూ కమీషన్ల పర్వం

వసూళ్లలో తరతమ భేదాల్లేవ

- చివరికి అగ్రిగోల్డ్ భూములనూ వదల్లేదు
- రాజకీయంగా ఆదరించిన పెడనలోనూ అవినీతే
- సొంత నియోజకవర్గం మైలవరంలో అంతే
- కన్న కొడుకునే జైలు పాలు చేసుకున్న జోగి
- అగ్రి వ్యవహారంపై వైసీపీ నాయకుల నుంచే విమర్శలు



భూ సమస్యల్లోనూ తలదూర్చి వాటాలు

పెడన మండలం కొంకేపూడి గ్రామంలో జడ్జి తిరుమలరావుకు 5.30 ఎకరాల పొలం ఉంది. అనంతపురంలో జడ్జిగా పనిచేస్తూ తిరుమలరావు 2021లో కోవిడ్‌తో మృతి చెందారు. 2018లోనే భార్య నుంచి ఆయన విడాకులు తీసుకున్నారు. తిరుమలరావుకు కొంకేపూడిలో ఉన్న 5.30 ఎకరాలను కౌలుకు ఇచ్చి దాని ద్వారా వచ్చే ఆదాయంపై ఆయన తల్లి వెంకటసుబ్బమ్మ జీవనం సాగించేవారు. తిరుమలరావు భార్యకు, తల్లికి ఈ భూమికి సంబంధించి వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి జోగి రమేశ్ అనుచరుడైన పామర్తి సాంబశివరావు అలియాస్ డొకోమో సాంబ ఈ వివాదంలో జోక్యం చేసుకుని మొత్తం భూమిని తిరుమలరావు భార్య పరమయ్యేలా చూస్తానని, తనకు 1.30 ఎకరాలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు 2022 డిసెంబరులో 1.30 ఎకరాల భూమిని పామర్తి సాంబశివరావు తండ్రి అర్జునరావు పేరుతో రిజిస్టర్ కూడా చేయించేసుకున్నారు. మిగిలిన 4 ఎకరాల భూమిని మంత్రి అండతో బలవంతంగా కబ్జా చేసి తిరుమలరావు భార్యకు అప్పగించే ప్రయత్నం చేయడంతో 75 ఏళ్ల వృద్ధురాలైన తిరుమలరావు తల్లి పోలీసులను ఆశ్రయించారు. కానీ న్యాయం జరగకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉపశమనం పొందారు.

ప్రతి పనికీ ఓ రేటు

- పెడన నియోజకవర్గంలో చెరువు తవ్వాలంటే ప్రతి ఎకరాకీ అక్షరాల పది వేల రూపాయిలు జోగి రమేశ్ అనుచరులకు కప్పంగా కట్టుకోవాల్సిందే. గూడురు మండలంలో సంవత్సరానికి రూ.కోటి చెల్లిస్తే మట్టి తోలకాలకు అనుమతి ఇచ్చేవారు. బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను మండలాల్లోనూ ఇదే దుస్థితి.
- చెరువుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే జోగి అనుచరులకు రూ.4 లక్షలకు పైబడి సమర్పించుకోవాల్సి వచ్చేది.
- కృత్తివెన్ను మండలం లక్ష్మీపురంలో డ్రైనేజీ భూముల్లో తరతరాలుగా నివాసముంటున్న వ్యాపారులకు, స్థానికులకు అధికారులతో నోటీసులు ఇప్పించి, కట్టడాలన్నీ కూల్చివేస్తామని బెదిరించి, వారిని భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి జోగి అనుచరులు డబ్బులు వసూలు చేశారు.
- పెడన మండలం నడుపూరు కొత్తపల్లి రోడ్డుకు రూ.52 కోట్లు విడుదలైనా జోగి అనుచరులు తమకు రూ.కోటి ఇస్తేనే పనులు ప్రారంభించుకునేలా సహకరిస్తామని కాంట్రాక్టర్‌ను బెదిరించడంతో పనులు ప్రారంభించకుండానే కాంట్రాక్టర్ వెనుదిరిగారు. నడుపూరు నరికేపాలెంలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం కావాల్సిన రోడ్డు విషయంలోనూ ఇదే జరిగింది.
- పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలంలోని మల్లంపూడి వద్ద రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మిస్తే వేలాది మంది రైతులకు ఉపయోగపడుతుంది. ఈ వంతెన నిర్మాణానికి అనుమతి ఇచ్చేందుకు సాక్షాత్తూ స్థానిక ప్రజాప్రతినిధి భర్త ఒకరు మంత్రి పేరు చెప్పి వసూళ్లకు తెగబడ్డారు. రైతుల నుంచి విడతల వారీగా 4.50 లక్షలు గుంజేసిన సదరు ప్రజాప్రతినిధి ఆ తర్వాత జోగికి రూ.40 లక్షలు ఇస్తేనే పని అవుతుందని చెప్పడంతో రైతులు అడ్డం తిరిగి ముందు ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేసి గుట్టురట్టు చేశారు.
- పెడన నియోజకవర్గంలోని మండలాల్లో కాపుసారా కాసేవారికి మంత్రి అనుచరుల అండదండలు పుష్కలంగా ఉండేవి. కాపుసారా ద్వారా నెలకు రూ.10 కోట్లపైచిలుకు సంపాదన మంత్రి అనుచరుల జేబులోకి వెళ్లేది.

మైలవరంలోనూ ఆయనదే హవా..

జోగి రమేశ్ సొంత నియోజకవర్గం మైలవరం. మంత్రి అయిన తర్వాత మైలవరం నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలపై జోగి అనుచరుల దృష్టిపడింది. అంతే అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు జరిపేసి రూ.కోట్లు జేబులో వేసుకున్నారు. వీటీపీఎస్ బూడిద రవాణా విషయంలో జోగి అనుచరుల దందానే సాగింది. జోగి మంత్రి అయిన తర్వాత కేవలం ఏడాది కాలంలో గ్రావెల్ తవ్వకాల ద్వారా సుమారు రూ.50 కోట్లు ఆర్జించినట్లు సమాచారం.

అక్టోబరు 1 వరకు 144 సెక్షన్

పోలీసు కమిషనరేట్ పరిధిలో అక్టోబరు ఒకటో తేదీ వరకు 144 సెక్షన్ విధిస్తూ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. బీఎన్ఎస్ 163, సీఆర్పీసీ 144లను అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేదుకు ఈ నిషేధాజ్ఞలు అమలు చేసినట్టు పేర్కొన్నారు. దీని ప్రకారం జనం గ్రూపులుగా ఉండడం, ఎలాంటి అనుమతులు లేకుండా నిరసనలు, ర్యాలీలు నిర్వహించడం చేయకూడదని స్పష్టం చేశారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదరించిన పెడననే గుల్ల చేసి..

యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జోగి రమేశ్ సొంత నియోజకవర్గం మైలవరం. కానీ అక్కడి ప్రజలు ఆయన్ను ఎప్పుడూ ఆదరించలేదు. పెడన నియోజకవర్గ ప్రజలే ఆయన్ను ఆదరించి అందలం ఎక్కించారు. 2009లో, 2019లో తిరిగి పెడన నుంచి వైసీపీ అభ్యర్థిగా గెలుపొంది 2022 ఏప్రిల్‌లో మంత్రి అయ్యారు. ఆ నియోజకవర్గం అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకున్నదే లేదు. పైగా అడ్డగోలుగా నియోజకవర్గాన్ని.. నియోజకవర్గ ప్రజలను అడ్డగోలుగా దోచుకున్నారు. ఏ చిన్న పని కావాలన్నా దానికి ఓ రేటు పెట్టి మరీ వసూళ్లు చేశారు. చెరువు తవ్వుకోవాలన్నా.. నియోజకవర్గ పరిధిలో ఏదైనా పోస్టింగ్ కావాలన్నా.. చివరికి సొంత పార్టీ వారికి ఏదైనా నామినేటెడ్ పోస్టు వేయించాలన్నా తన మన భేదం లేకుండా అందరూ తగిన రేటు చెల్లించుకోవాల్సి వచ్చేది.

మల్లవల్లి వంతెన నిర్మాణంలో కమీషన్

మల్లంపూడి వంతెన నిర్మాణానికి వాస్తవానికి రూ.కోటి సరిపోతోంది. కానీ కమీషన్ల కోసం వంతెన ఎస్టిమేషన్లను మూడు రెట్లు పెంచేసి రూ.3 కోట్లు చేశారు. వంతెనకు ఇరువైపులా 2 కిలోమీటర్ల మేర అవసరం లేకున్నా రోడ్డు నిర్మాణాన్ని ఈ వంతెన నిర్మాణంలో ప్రతిపాదించి ఎస్టిమేషన్‌ను పెంచేశారు. సాక్షాత్తూ అప్పటి మంత్రి జోగి సూచనల మేరకే ఇలా చేశామని వైసీపీ నాయకులే రైతులకు చెబుతున్నారు.

ఇబ్రహీంపట్నంలో జోగి రాజీవ్ అరెస్టు

- ఇబ్రహీంపట్నంలోని నివాసంలో ఏసీబీ సోదాలు
- అగ్రిగోల్డ్ భూముల గోల్‌మాల్ వ్యవహారంలో చర్యలు

ఇబ్రహీంపట్నం : అంబాపురంలో సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకున్నారనే ఆరోపణలపై వైసీపీ నాయకుడు, మాజీమంత్రి జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేసి విజయవాడ ఏసీబీ కార్యాలయానికి తరించారు. 15 మంది ఏసీబీ అధికారులు ఇబ్రహీంట్నంలోని జోగి నివాసంలో సోదాలు నిర్వహించారు. అగ్రిగోల్డ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని జోగి కుటుంబ సభ్యులపై ఈనెల 8న కేసు నమోదయ్యింది. అగ్రి భూముల రిజిస్ట్రేషన్‌పై పూర్తి నివేదికను సంబంధిత తహసీల్దార్ ప్రభుత్వానికి అందజేశారు. ఈ నేపథ్యంలో సోదాలు చేసిన అధికారులు ప్రధాన నిందితుడైన జోగి రాజీవ్‌ను అరెస్టు చేశారు.



నా కొడుకు అరెస్టు అన్యాయం : జోగి

తనపై కక్షతో ఎలాంటి తప్పు చేయని తన కొడుకును అరెస్టు చేశారని మాజీమంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు ఇంటి మీదకు తాను దాడికి వెళ్లలేదని అయ్యన్నపాత్రుడు జగన్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపేందుకు మాత్రమే చంద్రబాబు ఇంటి మీదకు వెళ్లానన్నారు. అది మనస్సులో పెట్టుకొని ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు కేరాఫ్..

- పరారీలో సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు
- జోగి భూ కబ్జాలో ప్రధాన పాత్రధారి
- ఇబ్రహీంపట్నంలోనూ భారీగా వసూళ్లు

6లో

ఆకలి అన్నవారికి అండగా..



రేపు గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్న సీఎం

- ఎన్టీఆర్‌జిల్లాలో 14 అన్న క్యాంటీన్లు ఏర్పాటు
- రూ.కోటి వ్యయంతో పునరుద్ధరణ
- తొలిదశలో గ్రామీణ ప్రాంతాల్లో 3, పట్టణ ప్రాంతంలో 11 చోట్ల ఏర్పాటు
- పంద్రాగస్టు తర్వాత రోజు నుంచి అన్నీ పునరుద్ధరణ

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నిరుపేదల పథకం అమలయ్యే రోజులొచ్చాయి. జనాదరణ పొందిన పథకాల్లో ఒకటైన అన్న క్యాంటీన్లు మళ్లీ తెరుచుకునేందుకు సిద్ధమయ్యాయి. గత ఐదేళ్లూ ఈ పథకాన్ని లేకుండా చేసి పేదల పొట్టగొట్టిన వైసీపీ పాలనకు జనం చరమగీతం పాడటంతో అన్నార్తుల ఆకలి తీరే అవకాశం ఏర్పడింది. అన్న క్యాంటీన్లు ఆగస్టు 15న ప్రారంభంకానున్నాయి. కృష్ణాజిల్లా గుడివాడలో అన్న క్యాంటీను సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/చిట్టినగర్): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమ పథకాలలోకెల్లా అన్న క్యాంటీన్ల పథకం అగ్రస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడలో అప్పట్లో పదికిపైగా అన్న క్యాంటీన్లను ఏర్పాటయ్యాయి. హోటళ్లలో భోజనానికి రూ.100కు మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో అన్న క్యాంటీన్‌లో రూ.5కే మంచి భోజనం అందించేవారు. విజయవాడ అంటే వలసల కేంద్రం. ఈ క్యాంటీన్లను కార్మికులు, చిరుద్యోగులు ఎక్కువగా ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపుకొట్టింది. కరోనా మహమ్మారి రెండేళ్ల పాటు కొనసాగటం వల్ల ఎంతో మంది పనులు కోల్పోయారు. వీరికి ఆహారం కూడా అందలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రభుత్వం మార్పుతో అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ

ఇటీవల ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ అన్న క్యాంటీన్ల పథకాన్ని తెరపైకి తెచ్చింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 14 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఆగస్టు 16 నుంచి తొలి దశలో ఈ క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులో రానున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా రూరల్ ప్రాంతాలలో 3 చోట్ల , అర్బన్ ప్రాంతంలో 11 చోట్ల వీటిని ఏర్పాటు చేస్తున్నారు. రూ.కోటి వ్యయంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి, రెండు కొత్తగా తప్ప చాలా వరకు పాత వాటిని పునరుద్ధరించారు. అన్న క్యాంటీన్లకు అనుగుణంగా మళ్లీ వాటి ఇంటీరియర్‌ను తీర్చిదిద్దటంతో పాటు రంగులు వేయాల్సి వచ్చింది. దీంతో రూ.కోటి మేర ఖర్చు చేసి వీటికి అనుగుణంగా తీర్చిదిద్దారు.

రేపు గుడివాడకు సీఎం

- పర్యటనలో అన్న క్యాంటీన్ ప్రారంభం



గుడివాడలో అన్న క్యాంటీన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సీఎం చంద్రబాబు నాయుడు గురువారం గుడివాడకు రానున్నారు. 24వ వార్డులోని రామబ్రహ్మంపార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభించనున్నారు. పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరరావు మంగళవారం అధికారులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. హెలీప్యాడ్, పోలీస్ బందోబస్తు, అన్న క్యాంటీన్ వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై వారు అధికారులకు పలు సూచనలు చేశారు.

● కృష్ణాజిల్లాలో ఐదు అన్న క్యాంటీన్లు

జిల్లాలోని పురపాలక సంఘాల్లో తొలివిడతగా ఐదు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. గుడివాడ పురపాలక సంఘంలో తుమ్మలరామబ్రహ్మం పార్కులో, మహాత్మాగాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో పంపులచెరువు వద్ద, పెడన పురపాలసంఘంలో బస్టాండ్ సెంటర్ సమీపంలో, ఉయ్యూరు పురపాలకసంఘం శివాలయం రోడ్డులోని ఓల్డ్ వాటర్‌ట్యాంకు వద్ద అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. 15వ తేదీన మధ్యాహ్నం గుడివాడలో తుమ్మలరామబ్రహ్మం పార్కులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో 16వ తేదీన అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తారు. మచిలీపట్నంలోని అన్న క్యాంటీన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ, ఉయ్యూరు నియోజకవర్గాల శాసనసభ్యులు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. మునిసిపల్ కమిషనర్లు, ఆర్డీవోలకు అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడెక్కడంటే..

క్రసం	ఏరియా	ప్రాంతం
1.	జగ్గయ్యపేట	సీతారామపురం మండల పరిషత్ స్కూల్
2.	నందిగామ	రైతు బజార్
3.	తిరువూరు	మసీదు ఎదురుగా , మెయిన్ రోడ్డు
4.	విజయవాడ	ఏపీఎస్ఆర్ఎం స్కూల్
5.	విజయవాడ	అయోధ్యనగర్ బుడమేరు వాగు
6.	విజయవాడ	బావాజీపేట(గులాబితోట), ఏఎస్ రాజు బ్రిడ్జి దగ్గర
7.	విజయవాడ	ధర్నాచౌక్
8.	విజయవాడ	గాంధీ మహిళా కళాశాల
9.	విజయవాడ	హౌసింగ్‌బోర్డు కాలనీ
10.	విజయవాడ	పటమట హైస్కూల్
11.	విజయవాడ	రాణిగారితోట (సిమెంట్ గోడౌన్)
12.	విజయవాడ	ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు (విద్యాధరపురం)
13.	విజయవాడ	సాయిబాబా టెంపుల్, నేతాజీ బ్రిడ్జి దగ్గర
14.	విజయవాడ	సింగ్‌నగర్



దసరా నాటికి నవహారతులు

మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి పవిత్రసంగమం ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. కృష్ణా - గోదావరి నదుల అనుసంధాన ప్రాంతంలో నవహారతులను దసరా ఉత్సవాల నాటికి పునరుద్ధరిస్తామన్నారు. - ఇబ్రహీంపట్నం

జాతి సమైక్యతకు ప్రతిరూపం..

హర్ ఘర్ తిరంగా

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



హర్ ఘర్ తిరంగా కాన్వాస్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 13 : జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో హర్ ఘర్ తిరంగా కాన్వాస్‌పై సంతకాలు చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సృజన, డీఆర్వో వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి కాన్వాస్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అని, ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకం ఔన్నత్యాన్ని, ప్రాధాన్యాన్ని చాటిచెప్పేందుకు, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్లు ఎ.మహేష్, కేవీ సత్యవతి, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్ఏ సమన్వయకర్త కె.రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఉప్పొంగిన దేశభక్తి..

ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ శ్రేణులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించాయి. మంగళవారం పార్టీ నేత తొర్లికొండ సీతారామయ్య ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయ పతాకాన్ని పట్టణంలో ఊరేగించారు. పాఠశాలల విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి దేశం పట్ల ప్రేమ, గౌరవంతో మెలగాలని సూచించారు. - **నందిగామ**

ఢిల్లీలో పంద్రాగస్టు వేడుకలకు వినీల



పటమట : ఢిల్లీలో ఈనెల 15న జరగబోయే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విజయవాడ నుంచి మై భారత్ వలంటీర్ అడ్డగర్ల వినీలను ఎంపిక చేశారు. పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వేలాదిమంది దరఖాస్తు చేసుకోగా వారిలో 68 మంది ఎంపికయ్యారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని అడ్డగర్ల వినీల ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలు విడుదల

మచిలీపట్నం, ఆగస్టు(ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరుజిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల నిర్వహణకోసం ఓటర్ల జాబితాల తయారీకి షెడ్యూల్‌ను కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం విడుదల చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ స్థానం నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పదవీకాలం 2025 మార్చి 20వతేదీ నాటికి పూర్తికానుంది. ఈ స్థానానికి ఎన్నికల నిమిత్తం ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలును కలెక్టర్ విడుదల చేశారు. సెప్టెంబర్ 30వతేదీన ఓటర్ల చేర్పుల రిజిస్ట్రేషన్‌కు అనుమతులు ఇస్తారు. అక్టోబరు 16వ తేదీన, 25వ తేదీన ఓటర్లుగా చేరాలని రెండు విడతల్లో పత్రికా ప్రకటనలు జారీచేస్తారు. నవంబరు 6వతేదీ వరకు ఓటర్లుగా చేరేందుకు అవకాశం కల్పిస్తారు. నవంబరు 20 నాటికి ఓటర్ల జాబితాల డ్రాఫ్ట్‌ను తయారు చేస్తారు. నవంబరు 23న ఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు. నవంబరు 23వతేదీనుంచి డిసెంబరు 9వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబరు 25వతేదీన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. డిసెంబరు 30న తుదిఓటర్ల జాబితాలను ప్రకటిస్తారు.

వివాహిత అదృశ్యంపై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

▸ పవన్‌ను కలిసి వివరించిన సోదరులు



డిప్యూటీ సీఎంకు వివరిస్తున్న యువకులు

గన్నవరం, ఆగస్టు 13 : తమ సోదరి కనిపించడంలేదని ఆమె సోదరులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆశ్రయించారు. మంగళవారం రేణిగుంట నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశాడు. వివరాల్లోకి వెళితే.. ముదినేపల్లికి చెందిన వివాహిత ఈనెల 8న భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం తలెత్తడంతో తన కోసం వెతకవద్దని, ఆరేళ్ల పాపను జాగ్రత్తగా చూసుకోవాలని లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి వస్తూ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద సీసీ ఫుటేజ్‌లో కనిపించిందని, అక్కడి నుంచి ఎటు వెళ్లిందో తెలియలేదని విజయవాడ రూరల్ జనసేన ప్రధాన కార్యదర్శి లంకే సురేష్‌కు ఆమె సోదరుడు బాలాజీ తెలిపాడు. ఈ విషయం మంగళవారం డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లాగా.. తప్పకుండా విచారణ చేయిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలి

▸ వెంకయ్య నాయుడు



ఉంగుటూరు, ఆగస్టు 13 : ప్రతి ఒక్కరూ తమకు ఆసక్తి వున్న రంగంలో నైపుణ్యాభివృద్ధి సాధించాలని, అందుకు తగిన శిక్షణ తీసుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు యువతరానికి సూచించారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో మంగళవారం వివిధ ట్రేడుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముచ్చటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన, పెద్దలను గౌరవించడం చాలా అవసరమని, సంస్కారం లేని చదువు నిరర్థకమని అన్నారు. యువతకు తగిన నైపుణ్య శిక్షణ అందిస్తే దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని చెప్పారు. వివిధ వృత్తివిద్యాకోర్సుల్లో నైపుణ్యం సాధించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల యువతకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, నైపుణ్యశిక్షణను సరిగా అమలుచేయగలిగితే ఉచిత పథకాలు అవసరం లేదని ఆయన స్పష్టంచేశారు. వృత్తివిద్యాకోర్సులను ప్రభుత్వాలే కాకుండా ప్రైవేటుసంస్థలు కూడా అందించాలని సూచించారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తెరగాలని, తీవ్ర నీటికొరతతో భవిష్యత్తులో నీటియుద్ధాలు జరిగే అవకాశం వుందని హెచ్చరించారు. ఆపరిస్థితి రాకుండా ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో జంపాల శరత్‌బాబు, సెక్రటరీ చుక్కపల్లి రామకృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్‌ఐలకు అరెస్టు వారెంట్లు

జగ్గయ్యపేట, ఆగస్టు 13 : మునిసిపల్ కౌన్సిలర్ నూకల సాంబశివరావు, ఆయన భార్య అస్మలను అక్రమంగా అరెస్టు చేసి దాడి చేశారన్న అభియోగంపై జగ్గయ్యపేట కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరు కాని అప్పటి జగ్గయ్యపేట సీఐ వైవీవీఎల్ నాయుడు, ఎస్ఐ ప్రియకుమార్, కానిస్టేబుళ్లు ఎస్.చిరంజీవిరావు, జి.నాగరాజు, పి.హరిబాబులపై జగ్గయ్యపేట కోర్టు మంగళవారం నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసినట్టు బాధితుల తరఫు న్యాయవాది సత్యశ్రీనివాస్ తెలిపారు. 2017లో నమోదైన క్రిమినల్ కేసులో వాయిదాలకు హాజరు కాకపోవటంతో గతంలో ఒకసారి వారిపై ఎన్‌బీడబ్ల్యు ఇవ్వగా, రీకాల్ చేయించుకున్నారు. తర్వాత వాయిదాలకు హాజరు కాకపోవటంతో మళ్లీ కోర్టు ఎన్‌బీడబ్ల్యు జారీ చేసినట్టు చెప్పారు.

పవిత్ర సంగమానికి పూర్వ వైభవం

▸ దసరా నాటికి నవహారతులు సిద్ధం

▸ ఏర్పాట్ల పరిశీలనలో మంత్రులు



పవిత్ర సంగమం వద్ద పరిశీలన చేస్తున్న మంత్రులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 : ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద కృష్ణా-గోదావరి నదుల అనుసంధాన ప్రాంతంలో నవహారతులను దసరా ఉత్సవాల నాటికి పునరుద్ధరిస్తామని, పవిత్ర సంగమానికి పూర్వవైభవం తెస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. హారతుల పునరుద్ధరణపై సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారధిలు మంగళవారం పవిత్రసంగమ ప్రాంతంలో పర్యటించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, నవహారతులను 30 నుంచి 45 రోజుల లక్ష్యంగా నిర్ణయించుకొని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే పలుశాఖల అధికారులతో మాట్లాడినట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాంత విశిష్టతను చెడగొట్టడమే కాకుండా కృష్ణమ్మకు నిత్యహారతులను నిలిపివేసిందన్నారు. 2019కి ముందు వరకు నిత్యహారతులు కొనసాగాయని.. వేల మంది భక్తులు హాజరయ్యేవారన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు 50 ఎకరాలు సేకరించి ఆలయాన్ని నిర్మిస్తామన్నారు. నదికి ఆవల ఉన్న లంక భూములను సేకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. పవిత్రసంగమం నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు బోట్ షికార్, స్పీడ్ బోట్ వంటి ఏర్పాట్లు చేసేందుకు సంకల్పించినట్టు చెప్పారు. నిత్య హారతులకు నెలకు రూ.11 లక్షలు ఖర్చవుతుందని, దాతల సహకారం కూడా తీసుకుంటామన్నారు. పవిత్రసంగమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అన్ని శాఖల సహకారం తీసుకుంటామని ప్రధానంగా సీఆర్‌డీఏ నుంచి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డవలప్‌మెంట్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కృష్ణమ్మకు ఇచ్చే హారతులతో రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. భక్తుల భద్రతతో పాటు పారిశుధ్యం విషయంలో శ్రద్ధ వహిస్తామన్నారు. రాష్ట్రంలోనే ఒక ఐకానిక్ ప్రాంతంగా పవిత్రసంగమాన్ని మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని హౌసింగ్, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసార్థి అన్నారు. ప్రాథమికంగా అంచనా వేసిన పనులకు రూ.88 లక్షలు పైగా నిధులు అవసరమని, ఆ నిధులతో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు మంత్రులకు నివేదిక ఇచ్చారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ నిధిమీనా, తిరువూరు ఆర్డీవో మాధవి, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, ఇరిగేషన్ ఈఈ కృష్ణారావు, దేవస్థానం ఈఈ ఎల్.రమా కోటేశ్వరరావు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.రమ్యకీర్తన, వెస్ట్ డీసీపీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంటింటి ఓటర్ సర్వే

▸ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్

▸ పాల్గొన్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు



కృష్ణలంక, ఆగస్టు 13 : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ అన్నారు. రాష్ట్ర కార్యాలయం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌వోలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జి.సృజన, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ, ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ రూపొందించేందుకు ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అక్టోబరు 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 24వ తేదీ లోగా అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబరు 24 లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి 1వ తేదీలోగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా రూపొందించి సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని వివేక్ యాదవ్ ఆదేశించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ఈ ఏడాది నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితాను, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి వున్నందున ఇందుకు సంబంధించిన కార్యకలాపాల షెడ్యూల్‌పైనా మార్గనిర్దేశనం చేశారు.

సంక్షిప్త సవరణకు సిద్ధం కావాలి : కలెక్టర్ బాలాజీ



గుడివాడ : జిల్లా ఎన్నికల అధికారులతో ఓటర్ల జాబితా తయారీపై వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా గుడివాడ మున్సిపల్ కార్యాలయం నుంచి కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు. కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నికకు సంబంధించి తాజా ఓటర్ల జాబితా షెడ్యూల్ ప్రకారం తయారు చేయవలసి ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. ఆర్డీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు కేరాఫ్..

▸ పరారీలో సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు!

▸ జోగి భూ కబ్జాలో ప్రధాన పాత్రధారి

▸ నున్నలో భారీ స్థాయిలో అక్రమాలు

▸ పటమట పోస్టు కోసం రూ. 2 కోట్లు ఖర్చు పెట్టేందుకూ వెనుకాడని వైనం

▸ ఇబ్రహీంపట్నంలోనూ భారీగా వసూళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జోగి రమేష్ భూ కబ్జా వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు అవినీతి రిజిస్ట్రేషన్లకు కేరాఫ్‌గా నిలిచారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల అక్రమాల్లో అంటకాగి జోగి రమేష్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. ఈ క్రమంలో చేయరాని పాపాలను చేశారు. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ నాగేశ్వరరావు కీలక పాత్రధారిగా మారాడు. వివాదాస్పద భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేయటం సంచలనమైంది. జోగి రమేష్ భూ కొనుగోళ్ల వ్యవహారంలో నాగేశ్వరరావు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న భూములను ఏ విధంగానూ రిజిస్ట్రేషన్ చేయటానికి వీలులేదు. ఒక వేళ చేయాల్సి వస్తే పంచనామా నిర్వహించాలి. అభ్యంతరాలను కోరాల్సి ఉంటుంది. ఇవేమీ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసేశారు. నాగేశ్వరరావు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఆదినుంచీ వివాదాస్పదమే..

నాగేశ్వరరావు వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. నున్నలో పనిచేస్తున్న సందర్భంలోనే ఆయన పటమట సబ్ రిజిస్ట్రార్ సీటు కోసం రూ. 2 కోట్లు ఖర్చు పెట్టేందుకూ వెనుకాడలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పటమట సీటు కోసం రిజిస్ట్రేషన్ శాఖలో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు రూ. 2 కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధం కావటం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆయన ప్రయత్నంపై పత్రికలలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. ఈ క్రమంలో రాఘవరావుకు పటమట సబ్ రిజిస్ట్రార్ పోస్టు వచ్చింది. దీంతో నాగేశ్వరరావు ఆశలు ఫలించలేదు. జోగి రమేష్ వివాదానికి ముందు కూడా ఆయన పటమట రావటానికి తన కోటరీ ద్వారా ప్రయత్నించారు. జోగి రమేష్ భూ కబ్జాలో కీలక పాత్ర పోషించడటంతో మళ్లీ అవకాశం తప్పింది. పటమట సబ్‌రిజిస్ట్రార్‌గా ఆరిఫ్ వచ్చారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నాగేశ్వరరావు అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ప్రతి రిజిస్ట్రేషన్‌కు నాగేశ్వరరావు భారీ రేటు కడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏజెంట్లలో నమ్మకస్తులను పెట్టుకున్నారు. భారీగా సమర్పించుకుంటే తప్ప భూ రిజిస్ట్రేషన్లు చేయలేని పరిస్థితి. ఇబ్రహీంపట్నం వచ్చిన తర్వాత కూడా నాగేశ్వరరావు తీరు మారలేదని తెలుస్తోంది. ముడుపులు చెల్లించనిదే ఆయన పనిచేయని పరిస్థితి. నాగేశ్వరరావు నున్నలో సాగించిన అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది.

అగ్రి భూములు కాజేసిన వారిని అరెస్టు చేస్తే తప్పేంటి

▸ కొనకళ్ల, కాగిత కృష్ణప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 13 : అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమంగా అగ్రిగోల్డ్ భూములను దోచుకున్న జోగి రమేశ్, ఆయన కుమారుడు జోగి రాజీవ్, అధికారులపై చర్యలు తీసుకోవడంలో తప్పేమీ లేదని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల



సమావేశంలో కొనకళ్ల నారాయణ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు మాట్లాడారు. అగ్రి బాధితుల పక్షాన నిలబడతామని 2019లో ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు చెప్పారని, అధికారంలోకి రాగానే అగ్రి భూములను స్వాహా చేశారని కొనకళ్ల ధ్వజమెత్తారు. భూముల అన్యాక్రాంతంపై అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ అరెస్టులకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ప్రమేయం ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఏసీబీ అధికారులు దర్యాప్తు చేసిన తర్వాతే జోగి రాజీవ్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. పెడన నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి విక్రయాలు జరిపి కోట్లాది రూపాయలు జోగి రమేష్ అక్రమంగా సంపాదించాడన్నారు. ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తాయన్నారు. సమావేశంలో టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా..

రాష్ట్రంలో కూటమి పాలన

▸ ఢిల్లీలో మంత్రి కొల్లు రవీంద్ర

▸ పర్యాటక, రైల్వే, మైనింగ్ అధికారులతో సమాలోచనలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 13 : రాష్ట్రాభివృద్ధితో పాటు సంపద సృష్టించే లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని, ఇందులో భాగంగా కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందుతాయని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో రెండవ రోజుగా కేంద్ర మైనింగ్ సెక్రటరీ



కేంద్ర మైనింగ్ సెక్రటరీ కాంతారావును కలిసిన మంత్రి కొల్లు రవీంద్ర

కె.ఎల్. కాంతారావును కలిశారు. రాష్ట్రంలో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, సిబెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే సహకరిస్తామన్నారు. బీచ్ శాండ్ మైనింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను త్వరలో పరిష్కరించాలని కేంద్ర అధికారులకు కొల్లు రవీంద్ర వినతిపత్రాలు అందచేశారు. కేంద్ర మంత్రులతో చర్చలు జరపడం వల్ల సత్ఫలితాలు అందుతాయన్నారు. జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ప్రాంతీయ కార్యాలయాలు ఏపీలో ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఏపీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఏటి), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి)లు ఏర్పాటు చేయాలని కోరారు. మైనింగ్, మినరల్ ప్రాసెసింగ్‌లో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రులను అధికారులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక గ్రానైట్ ప్రమోషన్ బోర్డును ఏర్పాటు చేయాలని కొల్లు రవీంద్ర అడిగారు. క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పెట్టుబడులను ఏపీ ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆఫ్‌షూర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి చేసేందుకు కేంద్ర టూరిజం సెక్రటరీకి వివరించామన్నారు. మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని కోరామన్నారు. మచిలీపట్నం - రేపల్లె రైల్వేలైను వేయగలిగితే కృష్ణాజిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా భూములు బొక్కేసి సి గార్డ్ వాడుకోడానికి జోగి రమేష్ సిగ్గుపడాలన్నారు. జోగి రమేష్ బండారం అంతా బయటపడుతోందని, అగ్రిగోల్డ్ ఆస్తులను అన్యాక్రాంతం చేశారన్నారు. అమరనాథ్‌గౌడ్‌ను వైసీపీ నాయకులు హత్య చేసినపుడు జోగి రమేష్ కులం గుర్తుక రావడం లేదని, ఇప్పుడు కులం గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలిస్తున్న అధికారులు

అన్న క్యాంటీన్లు

వచ్చేస్తున్నాయ్

▸ రేపు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

▸ అధికారుల పరిశీలన .. చకచకా ఏర్పాట్లు

గుడివాడ : ఈనెల 15వ తేదీన స్థానిక పార్కులోని అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక తుమ్మలరాం బ్రహ్మం పార్కులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, ఏఎన్ఆర్ కళాశాలలో హెలీప్యాడ్‌లను పరిశీలించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా తొలిసారి గుడివాడ వస్తున్న చంద్రబాబుకు ఘనస్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న నెట్టెం రఘురాం

పేదల ఆకలి తీర్చేందుకే.. : నెట్టెం

జగ్గయ్యపేట : పేదల కడుపు నింపేందుకే అన్నా క్యాంటీన్లు అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చెప్పారు. మంగళవారం ఆయన మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు నెట్టెం శివరాం, మునిసిపల్ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను మూసివేసి జగన్ రాజకీయ కక్ష తీర్చుకున్నాడన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగానే అన్నా క్యాంటీన్లను రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తుందని చెప్పారు. తక్కువ ధరకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. 15న అన్నా క్యాంటీన్‌ను జగ్గయ్యపేటలో ప్రారంభిస్తామని చెప్పారు. డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతురావు, మాజీ కౌన్సిలర్లు సైదులు, అనిల్‌లు ఉన్నారు.

బావిలో పడి రైతు మృతి




మోపిదేవి, ఆగస్టు 13 : చేనుకు నీరు పెట్టి వచ్చిన రైతు ఇంటి దగ్గర ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మంగళవారం ఈ విషాద ఘటన మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి శివారు మేళ్లమర్రులో జరిగింది. రైతు, జనసేన పార్టీ కార్యకర్త ఆకుల రామయ్య రాత్రి తన పొలానికి నీరు పెట్టి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



స్కూటర్, మద్యం, నిందితులతో సెబ్ సీఐ

తెలంగాణ మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట : తెలంగాణ నుంచి యాక్టివా స్కూటర్‌లో తరలిస్తున్న 200 బాటిల్స్ మద్యం, ఇద్దరు నిందితులను మంగళవారం జగ్గయ్యపేట సెబ్ సీఐ మణికంఠరెడ్డి వలపన్ని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జగ్గయ్యపేట-షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన సిమ్మ సత్తి రాజు యాక్టివాను తనిఖీ చేయగా డిక్కీ లోపల దాచి ఉంచిన 200 బాటిల్స్ దొరికాయని సీఐ తెలిపారు. ఇతడు నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన పెద్దమల్ల నరసింహారావుకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో చెప్పాడని, ఇరువురితో పాటు మద్యం, వాహనం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వివరించారు.



రాష్ట్ర స్థాయి టాపర్లు పి.రిషిక, ఎ.యశస్విని

పాలిటెక్నిక్‌లో స్వర్ణ విజేతలు

గుడ్లవల్లేరు, ఆగస్టు 13 : విద్యార్థులు మార్కుల కోసమే కాకుండా విజ్ఞానం సాధించే విధంగా విద్యను సముపార్జన చేయాలని రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు అన్నారు. మంగళవారం గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం. అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ వేదికగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వి.పద్మారావు హాజరై మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో పాలిటెక్నిక్ సాంకేతిక విద్యలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు మూడు బంగారు, నగదు అవార్డులను అందజేసేలా నిధిని ఏర్పాటు చేసి ప్రతీఏటా వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు స్మారక బహుమతులను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. అవార్డులు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

2024 సంవత్సరానికి రాష్ట్రంలో అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో మొదటి ర్యాంక్ సాధించిన పి.రిషితకు, ద్వితీయ ర్యాంక్ సాధించిన ఎ.యశస్వినీకు (ఈసి) బంగారుపతకం, రూ.10వేలు నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, సంస్థ అధ్యక్షులు వల్లభనేని సుబ్బారావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.86

మోటారుసైకిల్ ఢీకొని గాయాలు

విద్యాధరపురం, ఆగస్టు 13: మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి నల్లకుంట ప్రాంతంలో జరిగింది. భవానీపురం చర్చిరోడ్డులో కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ఇతను భవానీపురం ఐరన్ యార్డ్‌లో ఉన్న ఓ ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్నాడు. ఇతను సోమవారం నల్లకుంట ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌పోర్టులో లారీ లోడ్ చేసి రాత్రి 10.45కు తన స్నేహితుడితో కలిసి ఇంటికి బయలుదేరాడు. జాతీయ రహదారి వద్ద ఆటో కోసం నిలబడ్డారు. అతివేగంగా వచ్చిన మోటార్ సైకిల్ వెంకటేశ్వర రెడ్డిని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ బాధితుడిని అతని స్నేహితుడు భవానీపురంలో ఉన్న ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకువెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

'డ్రింక్ ఫ్రమ్ టాప్' ఇంటింటి సర్వే

ఈ వారంలో పూర్తి చేయాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ధర్నాచౌక్, ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి కుళాయి 'డ్రింక్ ఫ్రమ్ టాప్' అంశంపై నగరంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. దీనిలో భాగంగా కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం గాంధీనగర్‌లో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ వారం చివరికల్లా వీఎంసీ పరిధిలోని 2,17,083 అసెస్‌మెంట్‌లకు సర్వేని పూర్తి చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలు సర్వే చేసిన అంశాలపై నివేదికను సమగ్రంగా పొందుపరచాలని సూచనలు చేశారు. ఈ సర్వేలో ప్రతీ అసెస్‌మెంట్‌కు ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి, ప్రతీ కనెక్షన్‌కి ఎన్ని ఇళ్లు ఉన్నాయి అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈఈ వి.శ్రీనివాస్, అడ్మిన్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న వీఎంసీ కమిషనర్

24 గంటల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పాయకాపురం: పాయకాపురం శివారు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కుంటున్న తాగునీటి సమస్యను 24 గంటల్లో పరిష్కరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. పాతపాడు, కండ్రిక, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే స్థానికంగా పారిశుధ్య నిర్వాహణపై ఆరా తీశారు.

సీవేజ్ ప్లాంట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

● 15వ డివిజన్ వాసులకు ఎమ్మెల్యే గద్దె హామీ

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 13: సీవెజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సాంకేతికంగా అభివృద్ధి చేసి, ప్లాంట్ నుంచి వచ్చే దుర్వాసన, గ్యాస్ వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులకు విముక్తి కల్పిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. మంగళవారం 15వ డివిజన్ పుట్ట రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 ఏళ్ల క్రితం ప్లాంట్ నిర్మాణం జరిగిందని, అప్పటి నుండి దీని ద్వారా డ్రెయినేజీ వ్యవస్థ నడుస్తుందని, అది నగరం మొత్తానికి మంచి చేస్తున్నప్పటికి స్థానికులకు మాత్రం దాంట్లో వాడే కెమికల్స్ వలన కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్పొరేషన్ అధికారులు కూడా ప్రజల సమస్యను పరిష్కరించడానికి చాలా వరకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధునాతన టెక్నాలజీ ఉపయోగించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్వహించడం ద్వారానే ప్లాంట్ నుంచి వెలువడే గ్యాస్‌ను బంధించి మరో చోటుకు పంపడం ద్వారా సమస్యను కొంత వరకు పరిష్కరించవచ్చని తెలిపారు. ఐఐటీ బృందాన్ని రప్పించి పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు, కార్పొరేషన్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గద్దె రామ్మోహన్ తదితరులు



రిఫరెన్స్ పుస్తకాలు అందజేత

గవర్నర్‌పేట: సాయి సేవా సమితి నిర్వాహకులు నాదెళ్ల ఉమాదేవి, కామేశ్వరి, సరస్వతిలు మంగళవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి రిఫరెన్స్ పుస్తకాలు అందజేశారు. డీఎస్సీ, వివిధ పరీక్షలకు నోటిఫికేషన్‌లు వెలువడి కారణంగా కొత్త ముద్రణలు కావాలని విద్యార్థులు గ్రంథాలయ నిర్వాహకులను కోరారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి అభ్యర్థన మేరకు సాయి సేవా సమితి సభ్యులు రూ. 3వేల విలువ చేసే పుస్తకాలు గ్రంథాలయానికి అందజేశారు. విద్యార్థులు, గ్రంథాలయాధికారిణి దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

సెల్ఫ్ కేర్ ఫోకసింగ్ ఆన్ మెంటల్ హెల్త్‌పై సెమినార్

వన్‌టౌన్, ఆగస్టు 13: మానసిక వికలత్వం సమయంలో స్వీయ సంరక్షణ ఎంతో అవసరమని మానసిక వైద్య నిపుణులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం కాలేజి ఐసీసీ కమిటీ ఆధ్వర్యంలో సీఎస్‌ఈ డేటా సైన్స్ విభాగం, ఏపీ హెల్త్ అండ్ వెల్‌నెస్ వర్టికల్, కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో సెల్ఫ్ కేర్ ఫోకసింగ్ ఆన్ మెంటల్ హెల్త్ సెమినార్‌ను నిర్వహించారు. సీఎస్‌ఈ డేటా సైన్స్ విభాగ విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఉమన్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్, హవేరా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ మెబిలిటి కో ఫౌండర్ ఆకుల చాందిని చందన, వాసవ్య ఫిజియోథెరపి సెంటర్ ఉమన్ హెల్త్ టీటీ, అంకురా హాస్పటల్ లాక్టేషన్ కన్సల్టెంట్ సుదీప్తివర్ధన్, మానసిక, శారీరక రక్షణ వంటి అంశాలపై మాట్లాడారు. స్వీయ రక్షణలో ఆచరణాత్మక విధానాలను వివరించారు. పని ప్రదేశాలలో, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కళాశాల కార్యదర్శి సీఏ చిట్టా అమరసుధీర్, ట్రెజరర్ కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎ. పతంజలి శాస్త్రి, డాక్టర్ అక్బర్, డేటా సైన్స్ ఐసీసీ కో ఆర్డినేట్ వి. నవ్యశ్రీ, అధ్యాపక సమన్వయకర్తలు ప్రియాంక, అనూష, సురేష్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అన్న క్యాంటీన్లకు స్వాతంత్ర్యం వచ్చేసింది

● ఎమ్మెల్యే బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 13 : వైసీపీ పాలనలో తాళాలు పడ్డ అన్న క్యాంటీన్లకు స్వాతంత్ర్యం వచ్చేసిందని, ఐదేళ్ల తరువాత తిరిగి అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. టీడీపీ నాయకుడు, బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దొడ్డ చిన్నారావు ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద మంగళవారం 250 మందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు భోజనం అందజేశారు. నేతలు పైడి శ్రీను, దాసరి ఉదయశ్రీ, పిరియా సోమేశ్వరరావు, బత్తుల కొండ పాల్గొన్నారు.







వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పరంజ్యోతి మానవ సేవా సమితి నిర్వాహకులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వన్‌టౌన్, ఆగస్టు 13: శ్రీపరంజ్యోతి పద్మావతి అమ్మ జన్మదినం సందర్భంగా శ్రీపరంజ్యోతి మానవ సేవా సమితి కన్వీనర్ ఉట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలు వృద్ధాశ్రమాల్లో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 15న అమ్మ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత మంగళవారం భవానీపురంలోని వెంకటసాయిశ్రీ వృద్ధాశ్రమంలో, కబేళా సెంటర్ వద్ద ఉన్న ఆశీర్వాద ట్రస్టులో, నవులూరులో అమ్మనాన్న ఆశ్రమాల్లో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు బూర్లె వెంకట్రావు, ఓంకార్, రవ ప్రసాద్, సాగర్, దుర్గాప్రసాద్, సృజన లక్ష్మి, పాల్గొన్నారు.

చోరీ కేసులో 9 మందికి జైలు శిక్ష

రైల్వే స్టేషన్, ఆగస్టు 13: రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన 9 మందికి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ఏడవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.వి. శర్మ మంగళవారం ఏడు నెలల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. విజయవాడ, భీమవరం, కాకినాడ, రాజమండ్రి స్టేషన్ల ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులను దర్యాప్తు చేశారు.





స్వాతంత్ర్యం వచ్చిన వేళ..

నేడు, రేపు ఫొటోల ప్రదర్శన

లబ్బీపేట, ఆగస్టు13: దేశానికి స్వాతంత్ర్య వచ్చిన సందర్భంలో జరిగిన సంఘటనలను ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించేందుకు ఆనాటి జ్ఞాపకాల ఫొటోల ప్రదర్శనను బందర్‌రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో బుధ,గురువారాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్ కుమార్, జిల్లా సేల్స్ అధికారి కొమ్మెజు వరప్రసాద్ తెలిపారు. 1947 ఆగస్టు 14,15 తేదీల్లో జరిగిన పరిణామాలు, 14అర్ధరాత్రి జరిగిన సంఘటనలతో ఉన్న ఫొటోలు, 15న పరిస్థితుల ఫోటోలు ఏర్పాటు ద్వారా ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. బుధవారం ఉదయం 10గంటలకు విజయకృష్ణ సూపర్ బజార్ ఎదురుగా ఉన్నా పైలెట్ పెట్రోల్ బంకులో స్వాతంత్ర్య సమరయోధుల భవన నిర్వాహకులు సర్వోదయ ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీవీ సత్యనారాయణ, నందకిషోర్, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సేవా కార్యక్రమాలు



వన్‌టౌన్, ఆగస్టు 13: కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సామాజిక బాధ్యతా కార్యక్రమాలు) హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మంగళవారం పలు వితరణా కార్యక్రమాలను నిర్వహించింది. గోశాలలోని గౌర ఫిల్లింగ్ స్టేషన్, నిడమానూరులోని విజయలక్ష్మి ఆయిల్ కంపెనీ, విజయవాడలోని అరుణశ్రీ ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద అన్న వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీనగర్‌లోని ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్ విద్యార్థులకు యూనిఫామ్‌లు, కృష్ణలంకలోని మిషనరీస్ ఆఫ్ చారిటీలోని పెద్దలకు దుస్తులు, గుణదలలోని విజయమేరీ ఇంటిగ్రేటెడ్ అంధ విద్యార్థులకు స్నానపు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ బెన్నీ సి థామస్‌తో పాటు సౌత్ సెంట్రల్ జోన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

ఐరన్ కరెంట్ స్తంభంపై వాలిన చెట్టుకొమ్మలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాతరాజరాజేశ్వరి పేట, ఆగస్టు 13 : స్థానిక కేదారేశ్వరపేట 8వ లైన్‌లోని గుంట ప్రాంతంలో ఐరన్ కరెంట్ స్తంభం వద్ద నెలకొన్న సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు, నాయకులు కదిలారు. సంవత్సరం దాటిన సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సమస్యకు విముక్తి కలిగింది. ఐరన్ కరెంట్ స్తంభంపై వాలి ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడంతో పాటుగా, ఐరన్ స్తంభంకు ఆధారంగా ఏర్పాటు చేసిన ఐరన్ రాడ్‌ను తొలగించి పూర్తిస్థాయిలో ఐరన్ కరెంట్ స్తంభాన్ని సరిచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎండలోనే బస్సు కోసం ...

● ఎన్టీఆర్ సర్కిల్ ఎస్‌బీఐ బస్టాప్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

పటమట, ఆగస్టు 13 : స్కూల్ విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు రోజూ ఆ చెట్టు నీడనే సేదతీరుతూ తాము ఎక్కవల్సిన బస్సు వచ్చినపుడు ఎక్కివెళ్లేవారు. అలా ఏళ్లతరబడి తన నీడన వందల మందికి ఆశ్రయం కల్పించిన ఆ భారీ వృక్షాన్ని కార్పొరేషన్ అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికేశారు. వివరాల్లోకి వెళితే పటమట ఎన్టీఆర్ సర్కిల్ ఎస్‌బీఐ బస్‌స్టాప్ వద్ద ఉన్న ఏళ్ల నాటి భారీ వృక్షాన్ని కొట్టేశారు. దీంతో ప్రయాణికులు బస్సు కోసం మండుటెండలో మలమల మాడిపోతున్నారు. ఆర్టీసీ సంస్థ వారు దాతల సహకారంతో ఇక్కడ ఒక బస్టాప్ వద్ద బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ వి. చెన్నుపాటి

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

70 మద్యం సీసాలు స్వాధీనం

కంకిపాడు, ఆగస్టు 13 : మండలంలో బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని కంకిపాడు ఎస్సై డి. సందీప్ హెచ్చరించారు. మండలంలోని కోలవెన్నులో బెల్టుషాపు నిర్వాహకుడు పరిసే రమేష్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ, మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన పరిసే సురేష్ కోల వెన్నులో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో సిబ్బందితో దాడికి పాల్పడినట్లు తెలియజేశారు. ఈ దాడుల్లో సుమారు 70 మద్యం సీసాలు స్వాధీన పరుచుకోవడం జరిగిందన్నారు. సురేష్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సు ఔషధ రంగానికి మేలు

గన్నవరం, ఆగస్టు 13 : కృత్రిమ మేధస్సు వల్ల ఔషధ రంగానికి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ సురేష్ వి.చెన్నుపాటి అన్నారు.

ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఫౌండేషన్ విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో మంగళవారం 'ప్రపంచం దృష్టిలో ఔషధ రంగం - కృత్రిమ మేదస్సు' అంశంపై రెండ్రోజుల పాటు జరిగే సెమినార్ ప్రారంభమైంది. ఒరిస్సా నుంచి డాక్టర్ మిశ్రా బెంగళూరు నుంచి కుంతల్ దాస్‌లు సెమినార్‌లో పాల్గొని కృత్రిమ మేధస్సు గురించి చర్చించారు. ప్రిన్సిపాల్ పద్మలత జ్యోతి వెలిగించి సెమినార్ ప్రారంభించారు. కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.





బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.86

రంగవల్లులతో గణిత బోధన..

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 13: విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించిన అంశాలను మనోఫలకంపై చిరస్థాయిగా ఉండేలా రంగవల్లులు(ముగ్గులు) అలంకరించి గణిత బోధన నిర్వహించినట్లు ఉపాధ్యాయుడు గోవిందన్ తెలిపారు. అన్నవరంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థినులకు మంగళవారం ముగ్గులతో బహుభుజాలు వర్గీకరణ అంశంపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అధికారిలేని ఉప విద్యాశాఖ కార్యాలయం

తిరువూరు, ఆగస్టు 13: అధికారి లేకుండానే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఒక గదిలో ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. గతంలో విద్యాశాఖకు సంబంధించి డీవైఈవో కార్యాలయంలో పనుల నిమిత్తం హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నూజివీడు వెళ్లేవారు. తిరువూరు డివిజన్ కేంద్రంగా ఏర్పడి మూడు సంవత్సరాలవుతున్నా నేటికి డివిజన్ కార్యాలయాలు రాకపోవడంతో వివిధ శాఖల అధికారులు పనుల నిమిత్తం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. విద్యాశాఖకు సంబంధించి నందిగామకు వెళ్లిరావడం, పట్టణం నుంచి సరైన రవాణా సౌకర్యం లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరువూరులో డీవైఈవో కార్యాలయం ఏర్పాటు చేసి నందిగామ డీవైఈవోని ఇన్‌చార్జిగా నియమించడంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ హైస్కూల్‌లో..

డీఎల్‌డీవో కార్యాలయం వలే..

డీవైఈవో కార్యాలయం కూడా

గతంలో మండల పరిషత్ కార్యాలయంలో అధికారి లేకుండా ఏర్పాటు చేసిన డీఎల్‌డీవో కార్యాలయం లాగానే, విద్యాశాఖకు సంబంధించి డీవైఈవో కార్యాలయం ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొక్కుబడిగా కార్యాలయాన్ని హైస్కూల్‌లోని ఒక గదిలో ఏర్పాటు చేశారు. ఎంతకాలం ఈ కార్యాలయం ఉంటుందో అనే అనుమానాన్ని కొందరు ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే డీవైఈవో కార్యాలయాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారని ప్రశ్నించడం గమనార్హం.

పాఠశాలలోనే కార్యాలయం ఏర్పాటు

డీవైఈవో కార్యాలయం ఏర్పాటుకు భవనం అందుబాటులో లేక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యాలయాన్ని ప్రారంభించింది. తొలుత జడ్పీబాలికల పాఠశాలలో ఏర్పాటుకు ప్రయత్నించారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నందిగామ డీవైఈవో ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. కార్యాలయానికి ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు వచ్చాయి. డీవైఈవో పోస్టు భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

శ్యామసుందరరావు, ఎంఈవో-1

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రెడ్డిగూడెం, ఆగస్టు 13: నిబంధనల ప్రకారమే విద్యుత్‌ను వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ (ఆపరేషన్) వి.సత్యనారాయణ అన్నారు. 36 విజిలెన్స్ టీమ్‌లు మంగళవారం తనిఖీలు నిర్వహించాయి. అదనపు లోడ్ వాడుతున్నవారిపై రూ.3 లక్షల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీఈ హరికిరణ్, ఏఈ జి.వి.డి.ప్రసాద్, డిప్యూటీ ఈఈ కె.నారాయణ, ఏఈలు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

తిరువూరు: పట్టణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

రాజ్యాంగ ప్రతుల పంపిణీ

గానుగపాడు(తిరువూరు): రాజ్యంగంలోని ప్రాథమిక అంశాలు విద్యార్థులకు తెలియజేయాలని, వారికి రాజ్యాంగ ప్రతులు అందించటం జరిగిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గానుగపాడు జడ్పీహైస్కూల్‌లో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన రాజ్యంగ ప్రతులను స్కూల్‌లో మంగళవారం అందించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

పెనుగంచిప్రోలు : ముండ్లపాడు విజయపాల కేంద్రంలో రూ.1,56,500లను 96 మంది రైతులకు నాలుగు నెలల బోనస్‌గా పంపిణీ చేయటం జరిగింది. పాల కేంద్రం అధ్యక్షుడు కొత్తపల్లి రామనాథం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సర్పంచ్ గూడపాటి లావణ్యలు రైతులకు బోనస్ పంపిణీ చేశారు.



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతూన్న న్యాయాధికారి మోతీలాల్

విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

కేజీబీవీ బాలికల పాఠశాలలో న్యాయాధికారి మోతీలాల్

ఎ.కొండూరు, ఆగస్టు 13 : పాఠశాలల్లో ప్రభుత్వాలు కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ అన్నారు. ఎ.కొండూరు కేజీబీవీ బాలిక పాఠశాలను మంగళవారం సాధారణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతులు, ఆహారం, మౌలిక సాదుపాయల కల్పన గురించి పిల్లలను అడిగి తెలుసు కొన్నారు. హాస్టల్‌ల్లో ఆహార తయారీకి వినియోగించే వాటి నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. పాఠశాలకు సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎస్‌వో మీర్‌ఉనీస్సా బేగం జడ్జిని కోరారు. కార్యక్రమంలో తిరువూరు బార్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులను వివక్షతో చూడొద్దు

న్యాయాధికారి శోభారాణి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శోభారాణి

జగ్గయ్యపేట, ఆగస్టు 13: మానసిక దివ్యాంగుల పట్ల వివక్ష తగదని, వారితో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందికి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మానసిక వ్యాధిగ్రస్థులకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్న అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, దాసరి నాగేశ్వరరావు, విజయకుమారి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా జెండా ర్యాలీ

మైలవరం, ఆగస్టు 13: లీలావతి గిరిజన పాఠశాల విద్యార్థులు మంగళవారం పట్టణ వీధుల్లో తిరంగ జెండా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం ఉడతా లక్ష్మీనారాయణ, సంస్థ కార్యదర్శి రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు లేకుండా మనుగడ అసాధ్యం

ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి

మైలవరం: మొక్కలు లేకుండా మానవ మనుగడ అసాధ్యమని ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు జె.రాముడు, వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, డాక్టర్ వి.ఫణికుమార్, వి.ఉమాలక్ష్మి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి

తిరువూరు, ఆగస్టు 13: గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గం స్థాయి సర్పంచ్‌ల సదస్సులో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఒక్కొక్క మండలానికి రూ.5 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా, అభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేద్దామన్నారు. ప్రస్తుతం పంచాయతీలకు రావల్సిన నిధుల వివరాలు సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఈవోఆర్‌డీ వెంకటరత్నం, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాల్గొన్నారు. సాయంత్రం మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.



జగ్గయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరరావు



పెనుగంచిప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య



విస్సన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి పెద్దిబాబు

అభివృద్ధి పనులపై ప్రత్యేకాధికారుల సమీక్ష

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 13: చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరరావు మంగళశారం విద్యా, గృహ, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా విధివిధానాలను ఆయన అధికారులకు వివరించారు. పాఠశాలలు, గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంఈవో చిట్టిబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

నందిగామ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి గృహ నిర్మాణం, విద్య, ఉపాధి, రెవెన్యూ, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓడీఎఫ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణం లక్ష్యాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, స్కూల్ డ్రాప్ అవుట్ సర్వే, పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై మంగళవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య, ఎంపీడీవో సాయి హర్ష సచివాలయ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

విస్సన్నపేట: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల ప్రత్యేకాధికారి వి.పెద్దిబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవన్యూ సదస్సులను విజయవంతం చేయాలని, నరేగా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంఈవో వి.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ కెనడీ

పంట నమోదు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

తిరువూరు, ఆగస్టు 13: పంట నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని, పంట సాగుదారుడి వివరాలు మాత్రమే ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ జి.కెనడి సూచించారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం రైతుసేవా కేంద్రాల సిబ్బందికి ఈ-క్రాప్, పంటకోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట నమోదుకు సెప్టెంబరు 15 చివరి తేదీ అన్నారు. ఈ-క్రాప్ నమోదుతో దిగుబడి అయిన పంట అమ్ముకోవడమే కాకుండా ప్రభుత్వ పథకాలు, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పంటనష్ట పరిహారం పొందేందుకు అర్హులన్నారు. శిక్షణా తరగతుల్లో తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం ఏవోలు పాల్గొన్నారు.

కొనకంచిలో ఉచిత వైద్య శిబిరం

పెనుగంచిప్రోలు : కొనకంచిలో విషజ్వరాల నివారణకు మంగళవారం వైద్యఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారులు నిర్వహించారు. గ్రామంలో మురుగు నీరు నిల్వకుండా గ్రామపంచాయతీ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో భీమవరం, పెనుగంచిప్రోలు వైద్యాధికారులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ సీతారాం, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు.

ముచ్చింతాలలో దోమల మందు పిచికారి

ముచ్చింతాలలో దోమల నివారణకు మంగళవారం దోమల మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ జక్కులూరి రాంబాబు, వార్డుసభ్యుడు వనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నేతగా పాండు

విస్సన్నపేట: మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా కొర్లమండ వీఆర్వో బోయిన పాండు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో కార్యదర్శిగా వెంకటేశ్వర్లు నాయక్‌ను ఎన్నుకున్నారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని ఈసందర్భంగా తెలిపారు. తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

కులం ఇప్పుడు గుర్తొంచిందా జోగి

బీసీ నేతల ధ్వజం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13: అధికార మదంతో పాపాలు చేసి అవి పండగానే మాజీ మంత్రి జోగి రమేష్‌కు కులం గుర్తుకురావడం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల బీసీ సెల్ నాయకులు బొంత గంగరాజు, కొల్లిమర్ల నరసింహస్వామి, గేదెల కృష్ణ, జమ్ముల వెంకటేశ్వరరావు (చిన్నోడు) అన్నారు. కిలేశపురంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ గౌడబిడ్డ అమర్నాథ్‌ను అమానుషంగా నడిరోడ్డు మీద కాల్చి హత్య చేసిన రోజును నువ్వు గౌడ అని గుర్తుకు రాలేదా జోగి అని దుయ్యబట్టారు. కులాన్ని అడ్డు పెట్టుకొని కేసులో నుంచి బయటపడదామనుకుంటే అత్యాశే అవుతుందన్నారు.

జి.కొండూరు: బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి పదవీ కాంక్షతో అమర్‌నాథ్ గౌడ్ పాచవిక హత్యను కూడా ఖండించలేని మాజీమంత్రి జోగి రమేష్ గౌడ కులానికే కళంకం అని టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉయ్యూరు నరసింహారావు ధ్వజమెత్తారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ తప్పుడు పనులు చేసి అరెస్టు అయిన కొడుకుతో పాటు తాను జైలు పాలవుతాననే కులం కార్డును వాడుకోవాలని జోగి యత్నిస్తున్నాడన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా పని చేసి చివరకు కుటుంబ సభ్యులను సైతం నేరాల్లో భాగస్వాముల్ని చేసిన జోగి రాజకీయాలకే మాయని మచ్చ అన్నారు. ఏ ఒక్క గౌడ కులస్థుడు జోగిని సపోర్టు చేయరని నరసింహారావు అన్నారు.

విద్యార్థులకు ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు

ఎ.కొండూరు: విద్యార్థులు చదువుతోపాటుగా సమాజంలో మంచి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పి.మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని చీమలపాడు, కంభంపాడు, ఎ.కొండూరు గ్రామాల్లో ఉచిత ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాడు మానవ విలువలు పెంచడం కోసం ట్యూషన్ సెంటర్లు నిర్వహిస్తునట్లు తెలిపారు.

రెడ్డిగూడెంలో పారిశుధ్య పనులు

రెడ్డిగూడెం : రెడ్డిగూడెంలో దోమల నివారణ పనులను సర్పంచ్ మల్లాది రాణి, పీహెచ్‌సీ డాక్టర్ సందేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరి కస్తూరి నేత్రాల దానం

గంపలగూడెం: ఊటుకూరుకు చెందిన వేముల కస్తూరికి చెందిన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో ఖమ్మం నేత్రనిధి మంగళవారం దానం చేశారు. నేత్రనిధి ప్రతినిధులు కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందించారు.

గురి చూసి బాణం కొడితే యాభై మీటర్ల దూరంలోని లక్ష్యాన్ని కొట్టాల్సిందే. పతకం పట్టాల్సిందే. ఆ ఆర్చరీ అథ్లెట్ పేరు వెన్నం జ్యోతి సురేఖ. మనదేశంలోనే విలువిద్యలో మేటి క్రీడాకారిణి అనేందుకు సాక్ష్యం... ఇప్పటి వరకూ ఆమె సాధించిన 62 జాతీయ, 61 అంతర్జాతీయ పతకాలే నిదర్శనం. త్వరలో కెనడా, మెక్సికో దేశాల్లో ప్రపంచ ఆర్చరీ పోటీల్లో పాల్గొనటానికి సిద్ధమవుతున్న క్రీడాకారిణి **జ్యోతి సురేఖ**ను 'నవ్య' పలకరించిందిలా...



సహనంతోనే సాధించా..

కృష్ణా జిల్లాలోని చల్లపల్లి గ్రామం మాది. అమ్మ పేరు శ్రీ దుర్గ, నాన్న పేరు సురేంద్ర కుమార్. నాన్న వ్యవసాయం చేస్తారు. మేము ఉండేది... నేను చదివింది విజయవాడలోనే. ఇక నేనొక్కదాన్నే కావటంతో అల్లారు ముద్దుగా పెంచారు. విభిన్నంగా ఆలోచించే మనస్తత్వం ఇద్దరిదీ. అందుకే మూడేళ్లప్పుడే స్విమ్మింగ్ క్లాసులో జాయిన్ చేశారు. అలా బాల్యంలో స్విమ్మింగ్ అంటే ఇష్టం పెంచుకున్నా. ఎంతంటే.. కేవలం నాలుగేళ్ల వయసులోనే ఏకంగా ఐదు కిలోమీటర్ల మేర కృష్ణా నదిలో ఈదాను. ఊహ తెలియని వయసులో చేసిన ఫీట్ అది. ఎన్నో ప్రశంసలు అందుకున్నా. 'యంగెస్ట్ స్విమ్మర్'గా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కాను. ఎందుకో తెలీదు కానీ.. మా పేరెంట్స్ విలువిద్యను నేర్చుకోమన్నారు. వారికి తెల్సినంతగా నా గురించి ఎవ్వరికీ తెలీదు కాబట్టి 'సరే' అన్నాను. వెంటనే స్విమ్మింగ్ వదిలేయటం బాధనిపించినా.. వదిలేశా. అలా పదకొండేళ్ల వయసులో(2007) ఆర్చరీలోకి వచ్చా.

అలా ఆత్మవిశ్వాసం..

ఆర్చరీలో జాయిన్ అవుతూనే కొత్తగా అనిపించింది. అది కాకుండా ఆ సమయంలో నేషనల్ స్విమ్మింగ్ పోటీ మిస్సయ్యాను. అయ్యో.. ఎందుకిలా చేశారని బాధపడ్డా.

క్వాలిఫికేషన్ కోసం 720 పాయింట్స్ ఉంటాయి. అంటే 72 బాణాలు షూట్ చేయాలి. హైయస్ట్ పది పాయింట్స్ ఉంటాయి. తొమ్మిది, ఎనిమిది.. ఇలా పాయింట్స్‌ను లెక్కగడతారు. పాయింట్స్ బట్టి ర్యాంక్ ఇస్తారు. ఆ తర్వాత ఎలిమినేషన్ మ్యాచ్‌లు ఉంటాయి. ఫుల్‌గా డివైడ్ చేస్తారు. ఆ మ్యాచ్‌లో 15 బాణాలు సంధించాల్సి ఉంటుంది. ఎవరు ఎక్కువ స్కోరయితే వాళ్లు గెలుస్తారు. ఇదరి పాయింట్స్ సమానమైతే షూట్ ఆఫ్ ఉంటుంది. ఎవరి బాణమైతే సెంటర్‌కి క్లోజ్‌లో ఉంటుందో వారే విన్నర్ అవుతారు. ఖాళీగా ఉంటే పేరెంట్స్‌తో ఎక్కువ సమయం గడుపుతా. మంచి మ్యూజిక్ వింటా. ఫలానా సినిమా బావుంది అంటే చూస్తా. పజిల్ గేమ్స్ ఆడుతుంటా. ఖాళీగా ఉంటే ఇతర గేమ్స్ చూస్తుంటా. ఈసారి ఒలింపిక్స్ బాడ్మింటన్, షూటింగ్ విభాగాలను చూశా.

"నా కూతురు అని కాదు కానీ.. మేము ఊహించని గొప్ప విజయాలు సాధించింది. నాలుగేళ్ల వయసులోనే స్విమ్మింగ్‌లో లిమ్కా రికార్డు అందుకుంది. మేం గేమ్ మార్చినా.. ఫోకస్ మారలేదు. ఆర్చరీలో అద్భుతమైన విజయాలు సాధించింది. పట్టిన పట్టు వదలదు. దేశం తరఫున సుదీర్ఘకాలం నుంచి విజయాల పరంపర కొనసాగిస్తోంది. ఒకే ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ అందుకున్న వాళ్లు లేరు! పతకాలు కొట్టి దేశం పేరు నిలబెడుతున్నా.. రావాల్సినంత గుర్తింపు మా అమ్మాయికి రాలేదనేది నా అభిప్రాయం.

\- సురేంద్ర కుమార్, తండ్రి



అయితే ఆర్చరీలో సాధన చేసే కొద్దీ ఇష్టం పెరిగింది. ఈ గేమ్‌లో ఏకాగ్రత, భుజబలం ఉండాల్సిందే అని అర్థమైంది. స్విమ్మింగ్ వల్ల భుజబలం వచ్చింది. అది ఆర్చరీకి ఉపయోగపడింది. ఇక ఏకాగ్రత నాకు ఎక్కువే. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రాక్టీస్ చేసేదాన్ని. బాగా గుర్తుంది.. నేషనల్ గేమ్స్ విజయవాడలో జరుగుతాయని.. కొన్ని నెలల ముందే నా చేతికి విల్లు ఇచ్చారు. తొలి నేషనల్ గేమ్స్‌లోనే ఆరు బంగారు పతకాలు వచ్చాయి. ఎనిమిదో తరగతిలో మెక్సికో వెళ్లి ఆడాను. విద్య, విలువిద్యను బ్యాలెన్స్ చేసుకోవాలని పేరెంట్స్ చెప్పేవారు. అలానే చేశా. నలంద విద్యానికేతన్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివా. పోటీలు ఉన్నప్పుడు ప్రాక్టీస్ చేసేదాన్ని. ప్రత్యేక క్లాసులు పెట్టించుకునేదాన్ని. అంతే కానీ చదువుల్లో వెనకపడలేదు. సాధన చేయటం.. గేమ్‌లో పతకాలు కొట్టడం.. అలా మెల్లమెల్లగా లాంగ్ రన్‌లో ఆర్చరీ అథ్లెట్‌గా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అంతేకానీ ఓవర్‌నైట్‌లో ఏదీ రాలేదు. రాదు కూడా!

నామీద నాకే కోపం వచ్చేది..

కె.ఎల్. విశ్వవిద్యాలయం నుంచి బిటెక్, ఎంబీఏ చేశా. యూనివర్శిటీ యాజమాన్యం సపోర్టుగా నిలిచింది. ఏనాడూ ఇబ్బంది అవ్వలేదు చదువుకి. ట్యూషన్స్‌లో చదివి డిస్టింక్షన్ పాసయ్యాను. దాదాపు కాలేజీకి వెళ్లలేదు కాబట్టి విద్యార్థి జీవితం మిస్సయ్యాననే బాధ ఉంటుంది. అయితే చిన్నవయసులోనే దేశానికి ఆడగటం గొప్ప విషయమే అనిపిస్తుంది. గేమ్‌లోనే కాదు లైఫ్‌లోనూ స్ట్రగుల్స్ ఉంటాయి. అప్ అండ్ డౌన్స్ ఉండనే ఉంటాయి. వాటిని దాటుకుని ముందుకు వెళ్లాల్సిందే. కొందరు స్పోర్ట్స్ చాలా సులువు అనుకుంటారు. కష్టపడితే కానీ.. తెలీదు. ఏదీ సులువుగా రాదు. కొన్నిసార్లు బాగా ఆడినప్పటికీ మెడల్స్ రావట్లేదని బాధపడేదాన్ని. నామీద నాకే కోపం వచ్చేది. ఆ సమయంలో పేరెంట్స్ 'నువ్వు చేసే పని చేయి.. తప్పకుండా వస్తాయి మెడల్స్' అనేవారు. నాలో ధైర్యాన్ని నింపారు. ఆర్చరీ ఆటతో ఎంతో సహనం నేర్చుకున్నా.

అదే నా కల...

అమెరికా, యూరప్, చైనా, థాయ్‌లాండ్, టర్కీ, మెక్సికో, దక్షిణ కొరియా... లాంటి దేశాల్లో ఎక్కువగా పోటీలు జరుగుతాయి. 2007 నుంచి 26 జాతీయ, 57 అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా. సక్సెస్ కంటే ఫెయిల్యూర్ ఇష్టం నాకు. మెడల్ వస్తే రెండు రోజులు సంతోషమే. ఫెయిల్యూర్ వస్తే సక్సెస్ అయ్యేంతవరకూ నాతోనే ఉంటుంది. గతేడాది చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో మూడు బంగారు పతకాలు వచ్చాయి. నిల్చిపోయే విజయాలివి. గతంలో కంటే ఇప్పుడు వసతులు బావున్నాయి. కేంద్ర ప్రభుత్వం బాగా సపోర్టు చేస్తోంది. ఇప్పుడు ఆర్చరీలోకి అమ్మాయిలు బాగానే వస్తున్నారు. పదిహేడేళ్ల అదితి సీనియర్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో ఇండివిద్యువల్‌గా గోల్డ్ కొట్టింది. ఇదో మంచి పరిణామం. అర్జున అవార్డు గ్రహీతను. స్పోర్ట్స్ కోటాలో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చింది. త్వరలో పోస్టింగ్ ఇవ్వనుంది ప్రభుత్వం. ఇకపోతే.. పదిహేడేళ్ల వెనక్కి తిరిగి చూసుకుంటే.. ఆర్చరీలో ఇంత సాధించానా? అనిపిస్తుంది. అమ్మానాన్న తీసుకున్న నిర్ణయమే సరైనదని అర్థమైంది. లేకుంటే ఇవాళ ఈ స్టేజ్‌లో ఉండేదాన్ని కాదేమో! ఇకపోతే ఇప్పటి వరకూ ఇన్ని పతకాలొచ్చాయి అని లెక్కపెట్టుకోను. ఎందుకంటే సాధించిన పతకాలు చెబుతూ కూర్చోలేం. ఆ ఆలోచనలు వదిలేస్తా. ఇక్కడ ఎప్పటికప్పుడు సాధన చేస్తూ.. ఫిట్‌నెస్, ప్రతిభను ప్రూవ్ చేసుకుంటేనే నిలబడగలం. ఇకపోతే దాదాపు ప్రతి టోర్నమెంట్‌లో పతకాలు ఉన్నాయి. వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో ఇండివిద్యువల్ గోల్డ్ లేదు. దీంతో పాటు వరల్డ్ కప్ ఫైనల్ ఇండివిద్యువల్‌గా గోల్డ్ మెడల్ లేదు. ఆ రెండింటినీ సంపాదించాలన్నదే నా కల."

• రాళ్లపల్లి రాజావలి



"మా అబ్బాయికి ఇంకా ఆరు నెలలు రాలేదు. అప్పుడే ఫోన్లో కార్టూన్లు చూసేస్తున్నాడు. వీడియోలు మార్చడం కూడా తెలిసిపోయింది..."- ఇది చాలామంది తల్లితండ్రుల మురిపెం. "చదువు పూర్తిగా పక్కన పెట్టేశాడు. ఎవర్నీ కలవడు. ఎవరితోనూ మాట్లాడడు. రాత్రీ పగలూ స్మార్ట్ ఫోనే ప్రపంచం. తిండి మీద ధ్యాసలేదు. ఎప్పుడు నిద్రపోతున్నాడో కూడా తెలీదు"... - ఇది మరికొందరు తల్లితండ్రుల ఆవేదన. మొదట్లో ముచ్చటగా అనిపించినది కొన్నేళ్ళు గడిచేసరికి ఆందోళనగా మారుతోంది. ప్రస్తుత సమాజంలో ప్రతిచోటా కనిపిస్తున్న ఈ ధోరణుల గురించి తన తాజా పుస్తకం 'ఐ పేరెంట్: ఎంబ్రాసింగ్ పేరెంటింగ్ ఇన్ ది డిజిటల్ ఏజ్'లో చర్చించారు రచయిత్రి, కాలమిస్ట్ నేహా జె.హీరానందాని. ఆ వివరాలు ఆమె మాటల్లోనే:

'ఈ'తరం

పేరెంట్స్ కోసం...

"రచనకు... ఆ మాట కొస్తే సృజనాత్మకమైన ఏ పనికైనా ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. 'ఐ పేరెంట్' రాయడానికి నాకు ప్రేరణ నేను ఊహించని విధంగా... మా అమ్మాయి జోయా నుంచి దొరికింది. ఆమె స్కూల్ వాళ్ళు ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చరిత్ర సృష్టించిన ఒక గొప్ప పాత్రలా దుస్తులు ధరించి రావాలని పిల్లలకు సూచించారు. "మహాత్మా గాంధీ, మదర్ థెరిస్సాలా చాలా మంది తయారై వస్తారేమో? నువ్వేం చేద్దామనుకుంటున్నావ్?" అని జోయాను అడిగాను. నా ఆలోచనల్లో మహాత్ముడు, థెరిసా చరిత్రను రూపుదిద్దిన వ్యక్తులు. కానీ "అదేం కాదమ్మా! చాలా మంది 'మిస్టర్ బీస్ట్'లా దుస్తులు వేసుకొని వస్తారు" అంది జోయా. కొంతసేపు నాకు నోట మాట రాలేదు. ఆ తరువాత ఆలోచించాను. మన పిల్లలది ఒక కొత్త ప్రపంచం. మనకు సమాంతరంగా ఉన్న మరో విశ్వంలో వాళ్ళు జీవిస్తున్నారు. వాళ్ళకు ఆసక్తి కలిగించే, స్ఫూర్తిని అందించే అంశాలు పూర్తిగా భిన్నమైనవి. వారి గురించీ, వారి పెంపకం గురించి చర్చిస్తూ ఒక పుస్తకం రాయాలనుకున్నాను. అదే 'ఐ పేరెంట్'.

వారిది మరో ప్రపంచం...

మానవ చరిత్రలో ఇంటర్‌నెట్ స్థాయిలో ప్రభావం చూపించిన అంశం మరొకటి లేదనేది నా అభిప్రాయం. అంతర్జాతీయ స్థాయిలో ఒక పెద్ద ప్రయోగానికి మనమందరం సాధనాలుగా మారిపోయాం. కుప్పలుతెప్పలుగా సమాచారాన్ని కుమ్మరిస్తూ... సవాళ్ళు విసిరి, గందరగోళానికి గురి చేస్తున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల పెంపకం సులభం కాదు. మనకు అంతగా అవగాహన లేని ఒక ప్రపంచంతో మమేకమైపోయిన పిల్లలకు మార్గదర్శకత్వం వహించడం తల్లితండ్రులకు సవాల్‌గా నిలుస్తోంది. పిల్లలకు తామే ప్రపంచం అని తల్లితండ్రులు భావిస్తారు. ఆన్‌లైన్‌లోనే జీవిస్తున్న ఈ 'జెనరేషన్ జెడ్' (1990ల చివరి నుంచి 2010ల తొలినాళ్ళ మధ్య పుట్టినవారి) విషయంలో అది నిజం కాదు. వాస్తవానికి వాళ్ళు తమదైన ప్రపంచంలో ఉన్నారు. అది ఎలాంటి సరిహద్దులూ లేని క్రీడామైదానం లాంటిది. వాళ్ళ స్నేహాలు, ఘర్షణలు, ప్రేమలు... ఇలా అన్నీ దానితోనే ముడిపడుతున్నాయి. అంటే పెద్దల ప్రపంచం ఒకటైతే... ఆన్‌లైన్‌లో జీవిస్తూ, అక్కడే నేర్చుకుంటూ, దాన్నే శ్వాసిస్తున్న పిల్లల ప్రపంచం మరొకటి. ఈ రెండు ప్రపంచాలనూ కలపాలన్నదే నా ప్రయత్నం.

సౌకర్యం... వ్యసనం కూడా!

ఇప్పటి పిల్లలు ఒక చేత్తో స్మార్ట్ ఫోన్‌తో, మరో చేత్తో ట్యాబ్లెట్‌తో పుడుతున్నారు. వారిలో చాలామందికి నడవడం రాకముందే ఒక పరికరం చేతికి వస్తోంది. దాన్ని క్లిక్ చెయ్యడం, స్క్రోల్ చెయ్యడం లాంటివి అన్నప్రాసనకన్నా ముందే వాళ్ళు నేర్చుకుంటున్నారు. మొదటి మాట నోటి నుంచి రాకముందే... ఆ పరికరాన్ని ఎలా వాడాలనేది వాళ్ళకు పూర్తిగా తెలిసిపోతోంది. దీనికి బాధ్యత పూర్తిగా తల్లితండ్రులదే. పెద్దల విషయానికొస్తే... ఒక సగటు వ్యక్తి గంటకు కనీసం 12 సార్లు తన ఫోన్‌ను చెక్ చేస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ చేతిలో లేని జీవితాన్ని మనం ఊహించలేం. అవి వార్తలను అందిస్తున్నాయి, మనల్ని సమాజంతో అనుసంధానిస్తున్నాయి, వినోదాన్ని పంచుతున్నాయి, విద్యా సంబంధమైనవి తెలియజేస్తున్నాయి. మరోవైపు పోర్న్‌పోర్టల్స్‌గా దుష్ప్రభావాలనూ కలిగిస్తున్నాయి. ఒకే ఒక పరికరం ఉంటే చాలు... ఇవన్నీ సాధ్యమవుతున్నాయి. ఇది ఇదివరకూ ఎన్నడూ ఊహకైన అందని గొప్ప సౌకర్యం. అదే సమయంలో పెద్ద వ్యసనం కూడా. ఈ వ్యసనం మానసిక వైకల్యాలకు కారణమవుతోంది. పెద్దలే ఈ సుడిగుండంలో పడి మునిగిపోతున్నప్పుడు... మానసిక పరిపక్వత లేని పిల్లల పరిస్థితి ఏమిటి?

మొదటి గ్లోబల్ జనరేషన్...

నా పుస్తకం పిల్లల డిజిటల్ అడిక్షన్ గురించి చర్చించడానికి మాత్రం కాదు. 'ఆ పిల్లలతో ఎలా వ్యవహరించాలి? వాళ్ళను ఎలా అర్థం చేసుకోవాలి? అవసరమైనప్పుడు వాళ్ళకు ఎలా అండగా నిలవాలి?' అనే అంశాలను ప్రధానంగా చర్చించాను. అందుకే ఇదంతా డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి కాబట్టి నా పుస్తకానికి 'ఐ పేరెంట్' అని పేరు పెట్టాను. తల్లితండ్రుల మీద కూడా డిజిటల్ ప్రభావం ఎక్కువగానే ఉంది. ఉదాహరణకు... ఇంగ్లండ్‌కో, బ్రిటన్‌కో చెందిన వాళ్ళెవరో... .చిన్న పిల్లలకు పెట్టే ఆహారంలో నెయ్యి ఉండాలా? వద్దా?' అనేది వాళ్ళ పరిజ్ఞానం మేరకు రాస్తారు. మన దేశంలో దాన్ని చదివిన తల్లితండ్రుల్లో ఏవో అనుమానాలు మొదలవుతాయి. జీవితంలోని ప్రతి విషయంలోకి టెక్నాలజీ చొచ్చుకువచ్చేస్తున్నప్పుడు... ఒకే విధమైన ఆనందాలే కాదు, ఒకే రకమైన సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. సైబర్ వేధింపులు, సోషల్ మీడియాను అతిగా ఉపయోగించడం, గేమ్స్‌కు బానిసలు కావడం... పిల్లల మీద తల్లితండ్రుల నుంచి వినిపిస్తున్న ప్రధానమైన ఫిర్యాదులు. అంతేకాదు... పిల్లల పట్ల అతి ప్రేమ, శృతిమించిన గారాబం వల్ల కూడా పెంపకం కష్టమవుతోంది. ప్రతి తరానికి తనదైన కలలుంటాయి. అయితే 'జనరేషన్ జెడ్' అద్భుతమైన తరం. వాళ్ళది మొట్టమొదటి గ్లోబల్ జనరేషన్. తమ సరిహద్దులను దాటి వాళ్ళు చూస్తున్నారు, ప్రపంచం పరస్పరం ఎలా అనుసంధానం అవుతోందో, ఒక ప్రాంతానికో, దేశానికో సంబంధించిన సమస్య ప్రపంచ సమస్యగా ఎలా మారుతుందో గ్రహిస్తున్నారు. వాళ్ళకు ఎన్నో విషయాల గురించి అవగాహన ఉంది. టీనేజిలోకైనా ఇంకా ప్రవేశించని పిల్లలు వాతావరణ మార్పుల మీద ప్రపంచవ్యాప్తంగా ఎలా ఉద్యమిస్తున్నారో మనం చూస్తున్నాం. అదే సమయంలో... వేరొకరితో ఎక్కువగా పోల్చుకోవడానికి, అవాంఛనీయమైన పోటీకి కూడా సాంకేతికత దారి తీస్తోంది. అది ఈ తరాన్ని అపరిమితమైన ఒత్తిడికి, మానసికమైన దుర్బలత్వానికి గురిచేస్తోంది. ఈ పరిణామాలన్నిటినీ నా పుస్తకంలో చర్చించాను. తల్లితండ్రులకు నేను చిట్కా వైద్యం లాంటి పరిష్కారాలేవీ నేను చెప్పలేదు. డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం గురించి ఆరోగ్యకరమైన చర్చ ప్రారంభించాలన్నదే నా ఉద్దేశం."

నేహా కాలమిస్ట్, రచయిత్రి. అమెరికాలోని మసాచుసెట్స్ వెల్లస్లీ కాలేజీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆంగ్ల సాహిత్యంలో ఆనర్స్ డిగ్రీ, హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎడ్యుకేషన్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. 'యునిసెఫ్'తో కొన్నాళ్ళు పని చేసిన తరువాత... ఆర్థిక, సామాజిక అంశాలపై హఫింగ్టన్ పోస్ట్, వోగ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రముఖ పత్రికల్లో కాలమ్స్ రాశారు. పిల్లల కోసం 'ది పద్మాస్' పేరిట 50 మంది 'పద్మ పురస్కార గ్రహీతల' జీవిత పరిచయాలతో పుస్తకాన్ని వెలువరించారు. స్ఫూర్తిదాయకులైన 50 మంది భారతీయ మహిళలపై 'గర్ల్ పవర్: విమెన్ హూ బ్రోక్ ది రూల్స్' అనే పుస్తకం రాశారు. చదవడం, రాయడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం... ఇవీ ఆమె ప్రధానమైన అభిరుచులు. దాదాపు ఇరవయ్యేళ్ళ నుంచి వివిధ సామాజిక అంశాలపైనా, లింగ సమానత్వంపైనా వివిధ రచనల ద్వారా తన గళాన్ని వినిపిస్తున్నారు.

హెయిర్ మాస్క్

బ్యూటీ

వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు తోడ్పడే హెయిర్ మాస్క్‌లను ఉపయోగిస్తూ ఉండాలి. వీటిని ఇంట్లోనే తయారుచేసుకునే వీలుంది. శిరోజాల సౌందర్యానికి తోడ్పడే ఆ మాస్క్‌లు ఇవే!

పొడిజుట్టు కోసం:

- ఐదు చెంచాల సెనగపిండి, పెరుగు, రెండు పెద్ద చెంచాల ఆలివ్ ఆయిల్ కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు పట్టించాలి.
- 20 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేసేయాలి.
- కండిషనర్ వాడడం మర్చిపోకూడదు.
- సెనగపిండి కుదుళ్లను బలపరిస్తే, ఆలివ్ ఆయిల్, పెరుగు జుట్టుకు మెరుపును అందిస్తాయి. జుట్టు పట్టుకుచ్చులా మెత్తగా తయారవుతుంది.

సాధారణ వెంట్రుకలు

- రెండు పెద్ద చెంచాల సెనగపిండి, బాదం పొడిలను గిన్నెలో కలుపుకోవాలి.
- దీనికి కొంత పెరుగు కూడా కలుపుకోవచ్చు.
- ఈ మిశ్రమాన్ని కదుళ్లు, వెంట్రుకలకు పట్టించాలి.
- 30 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేసేయాలి.

జిడ్డు వెంట్రుకలు

- రెండు పెద్ద చెంచాల సెనగపిండి, మెంతులు, కొబ్బరిపాలలో నానబెట్టాలి.
- ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించి మర్దన చేయాలి.
- అరగంట తర్వాత తలస్నానం చేసేయాలి.

పాడైన వెంట్రుకలు

- ఒక మగ్గిన అరటిపండును గుజ్జుగా చేసుకోవాలి.
- దీన్లో నాలుగు చెంచాల కొబ్బరినూనె, ఒక చెంచా గ్లిజరిన్, రెండు చెంచాల తేనె చేర్చి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, అరగంట తర్వాత తలస్నానం చేసేయాలి.
- ఇలా వారానికి ఒకసారి చొప్పున క్రమం తప్పకుండా రెండు నెలలపాటు చేస్తే పాడయిన వెంట్రుకలు బాగవుతాయి.

జీవం కోల్పోయిన వెంట్రుకలు

- కలబంద గుజ్జు రెండు పెద్ద చెంచాలు తీసుకోవాలి.
- దీనికి రెండు పెద్ద చెంచాల సిలికాన్ లేని కండిషనర్‌ను కలపాలి.
- ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు పూసుకుని, పెద్ద దంతాలు ఉన్న దువ్వెనతో వెంట్రుకలు అన్నింటికీ అంటుకునేలా దువ్వాలి.
- 20 నిమిషాల తర్వాత తలస్నానం చేసేయాలి.





ఫ్యాషన్

భలే భుజోడి

హుందాగా, సంప్రదాయంగా కనిపించే చీరల్లో 'భుజోడి' హ్యాండ్‌లూమ్ శారీస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బెంగాలీ కాటన్ చీరలను మరిపించే భుజోడి చీరలు మృదువుగా, సౌకర్యంగా హాయిగొలిపే లేత రంగుల్లో తయారవుతూ ఉంటాయి. అన్ని కాలాలకూ తగిన భుజోడి చీరల గురించి తెలుసుకుందామా!

నాణ్యమైన నూలుతో...

గుజరాత్, కచ్ ప్రాంతంలోని భుజోడి గ్రామంలో సంప్రదాయ భుజోడి హ్యాండ్‌లూమ్ చీరల మూలాలున్నాయి. అత్యంత నాణ్యమైన నూలుతో కూడిన క్లిష్టమైన డిజైన్ల వల్ల భుజోడి చీరలు మహిళలతో పాటు ఫ్యాషన్ డిజైనర్లను సైతం ఆకట్టుకుంటున్నాయి. గుజరాత్‌లోని భుజ్ నగరానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న భుజోడి గ్రామంలోని కళాకారుల మగ్గాలు వడికే ప్రతి చీరలో, శాలువాలో, ఘాగ్రాలో, దుప్పట్లలో 500 ఏళ్ల నాటి చరిత్ర ప్రతిఫలిస్తూ ఉంటుంది.

వేర్వేరు సందర్భాల్లో....

ఆఫీస్ వేర్‌గా భుజోడి చీరలను నిరభ్యంతరంగా ఎంచుకోవచ్చు. రోజంతా చీరకట్టులో గడపడం అసౌకర్యంగా భావించే మహిళలు సైతం ఈ చీరలను నిస్సంకోచంగా ఎంచుకోవచ్చు. తేలికగా, మెత్తగా ఉంటాయి కాబట్టి రోజంతా చీరకట్టులో ఉన్నా చికాకు అనిపించదు. కలర్‌ఫుల్‌గా కనిపించాలంటే, ఆకర్షణీయమైన మోటిఫ్స్, డిజైన్లను కలిగి ఉండే చీరలను ఎంచుకుంటే సరిపోతుంది. ఈవినింగ్ వేర్‌గా కూడా ఈ చీరలు బాగుంటాయి. క్లాసీ లుక్ కోసం కలంకారీ పనితనమున్న స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఎంచుకోవాలి.

అన్ని కాలాలకూ తగ్గట్టుగా

కాటన్ చీరలు అనగానే వాటి మెయింటేనెన్స్ కష్టమని అనుకుంటాం. కానీ భుజోడి చీరలు అందుకు పూర్తి భిన్నం. బెంగాలీ కాటన్ చీరల్లా వీటికి గంజితో పని ఉండదు. మెత్తగా, ఒంటికి హత్తుకుని హాయిగొలుపుతాయి. పైగా వేసవిలో చల్లదనాన్నీ, శీతాకాలంలో వెచ్చదనాన్ని అందిస్తాయి. కాబట్టి అన్ని కాలాలకూ అనువైన భుజోడి చీరలను మరో ఆలోచన లేకుండా కొనుగోలు చేయొచ్చు. ఈ చీరల తయారీలో సహజసిద్ధ రంగులను ఉపయోగిస్తారు కాబట్టి వెలిసిపోతాయనే భయం కూడా ఉండదు. కలంకారీ బ్లౌజ్, మెటల్ జ్యువెలరీలతో మ్యాచ్ చేస్తే, భుజోడి చీరల్లో స్టైలిష్‌గా కనిపిస్తాం. ప్రత్యేకమైన లుక్ కోసం జామెట్రిక్ మోటిఫ్స్ డిజైన్ చీరలను ఎంచుకోవాలి.



అపోలో హాస్పిటల్స్ లాభంలో 83% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 83 శాతం వృద్ధితో రూ.305 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.167 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.4,418 కోట్ల నుంచి రూ.5,086 కోట్లకు పెరిగింది. హాస్పిటల్స్‌కు చెందిన అన్ని వ్యాపార విభాగాలు అద్భుతమైన పనితీరును కనబరచటంతో ప్రోత్సాహకర ఫలితాలను నమోదు చేసినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. త్రైమాసిక కాలంలో హెల్త్‌కేర్ సర్వీసెస్ రెవెన్యూ రూ.2,637 కోట్లుగా ఉండగా అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ ఆదాయం రూ.366 కోట్లు, అపోలో హెల్త్ కంపెనీ రెవెన్యూలు రూ.2,082 కోట్లుగా ఉన్నాయి.

తగ్గిన రెయిన్‌బో హాస్పిటల్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్).. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.330.20 కోట్ల ఆదాయంపై రూ.39.73 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 15 శాతం పెరగగా లాభం మాత్రం 4.2 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో 280 పడకల సామర్థ్యం గల మూడు కొత్త హాస్పిటల్స్‌ను ప్రారంభించటం కలిసివచ్చిందని పేర్కొంది. కాగా రాజమండ్రిలో వంద పడకల సామర్థ్యం గల రీజినల్ హబ్ హాస్పిటల్‌తో పాటు బెంగళూరులోని హెన్నూర్‌లో 60 పడకలతో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికల్లా అందుబాటులోకి రానున్నాయని రెయిన్‌బో హాస్పిటల్స్ తెలిపింది. అలాగే తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ 24 నెలల్లో అందుబాటులోకి రానుందని పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	88,500 ▲
ముంబై	70,444 ▲	64,527 ▲	80,702 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	486
వరంగల్	457	గోదావరి	486
చిత్తూరు	493	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	82	విజయవాడ	90
వరంగల్	82	గుంటూరు	90
కరీంనగర్	82	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	82	చిత్తూరు	99
కర్నూలు	82	నెల్లూరు	99
విశాఖపట్నం	86	అనంతపురం	90
గోదావరి	90		

100% డిపాజిట్లు వెనక్కి తీసుకునే అవకాశం

2025 జనవరి 1 నుంచి అమల్లోకి.. ఆర్‌బీఐ ఆదేశాలు

ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిటర్లకు ఊరట



ముంబై: అత్యవసర పరిస్థితుల్లో తమ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలనుకునే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల డిపాజిటర్లకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఊరట కల్పించింది. ఈ డిపాజిట్లను ఆమోదించిన మూడు నెలల్లోపు, అత్యవసర వైద్య కారణాలతో డిపాజిటర్ల నుంచి ఉపసంహరణ విజ్ఞప్తి అందితే ఎన్‌బీఎఫ్‌సీలు వారి డిపాజిట్లను వడ్డీ లేకుండా పూర్తి (100 శాతం)గా వెనక్కి ఇవ్వాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని తెలిపింది. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) మార్గదర్శకాల్లో పేర్కొన్న అత్యవసర వైద్య పరిస్థితుల నిర్వచనాన్ని ఎన్‌బీఎఫ్‌సీలు ఇందుకు పరిగణనలోకి తీసుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

ఇతర ఖర్చులు: అత్యవసర వైద్య ఖర్చులతో పాటు ప్రభుత్వం పేర్కొనే ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడే ఖర్చులకూ ఇదే సూత్రం వర్తిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. డిపాజిట్లను ఆమోదించిన మూడు నెలల్లోపు అత్యవసరేతర కారణాలతో డిపాజిటర్లు తమ డిపాజిట్లను వెనక్కి తీసుకోవాలని కోరినా.. ఎన్‌బీఎఫ్‌సీలు ఆ విజ్ఞప్తిని ఆమోదించాలి. కాకపోతే అప్పుడు డిపాజిట్ మొత్తంలో సగాన్ని మాత్రమే వడ్డీ లేకుండా చెల్లిస్తారు. ఈ అసలులో సగం లేదా రూ.5 లక్షలు, ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తారు.

హెచ్‌ఎఫ్‌సీలకు కొత్త నిబంధనలు

దీనికి తోడు ప్రజల నుంచి డిపాజిట్లు ఆమోదించే గృహ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌సీ)లకు సంబంధించీ ఆర్‌బీఐ కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ సంస్థలు ఇక తమ మొత్తం డిపాజిట్లలో 13 శాతానికి బదులు 15 శాతం మొత్తాన్ని నగదు రూపంలో ఉంచుకోవాలని కోరింది. దీనికి తోడు ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లకు సమానమైన ఆస్తుల మొత్తాన్ని హెచ్‌ఎఫ్‌సీలు ఎల్లవేళలా కవరేజీగా ఉంచుకోవాలని స్పష్టం చేసింది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల నుంచి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్ పొందకుండా హెచ్‌ఎఫ్‌సీలు కొత్త డిపాజిట్లు సేకరించడం గానీ, ఉన్న డిపాజిట్లను పునరుద్ధరించడంగానీ చేయకూడదని ఆంక్షలు విధించింది.

రూ.4.5 లక్షల కోట్లు ఫట్

- సెన్సెక్స్ 693 పాయింట్లు డౌన్
- 79,000 దిగువ స్థాయికి సూచీ
- నిఫ్టీ 208 పాయింట్లు పతనం

10లో 7 అదానీ షేర్లకు నష్టం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 692.89 పాయింట్లు కోల్పోయి 78,956.03 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 208 పాయింట్లు క్షీణించి 24,139 వద్ద స్థిరపడింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐటీసీ వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణతో పాటు చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు మార్కెట్ నష్టాలకు కారణమయ్యాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. ఉదయం తొలి గంట ట్రేడింగ్‌లో స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడిన స్టాక్ సూచీలకు ఆ తర్వాత నష్టాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. దాంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.52 లక్షల కోట్లు తగ్గి రూ.445.30 లక్షల కోట్లకు (5.30 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.46 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, టాటా స్టీల్స్ రెండు శాతానికి పైగా నష్టపోయాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ట్రేడయ్యాయి. గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 7 స్వల్పంగా నష్టపోగా.. అదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మాత్రం పాజిటివ్‌గా ముగిశాయి.

యూనికామర్స్ బంపర్ లిస్టింగ్

సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన యూనికామర్స్ ఈసొల్యూషన్స్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. గతవారంలో ఐపీఓను ముగించుకున్న కంపెనీ.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఇష్యూ ధర రూ.108తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 112.96 శాతం ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 137.17 శాతం వృద్ధితో రూ.256.15 వరకు ఎగబాకిన షేరు ధర.. మధ్యాహ్నం నుంచి మళ్లీ తగ్గుతూ వచ్చింది. తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 94.49 శాతం లాభంతో రూ.210.05 వద్ద స్థిరపడింది.

హీరో మోటోకార్ప్ లాభం రూ.1,032 కోట్లు

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 47 శాతం వృద్ధి చెంది రూ.1,032 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.701 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.8,851 కోట్ల నుంచి రూ.10,211 కోట్లకు పెరిగింది. ఒక త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.10,000 కోట్ల మార్కును చేరుకోవటం ఇదే మొదటిసారి. కాగా త్రైమాసిక కాలంలో అమ్మకాలు మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని పేర్కొంది.

జపాన్‌కు మేడిన్ ఇండియా ఫ్రాంక్స్

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ) దేశీయంగా ఉత్పత్తి చేసిన ఎస్‌యూవీ ఫ్రాంక్స్ కారును జపాన్‌కు తొలిసారిగా ఎగుమతి చేసింది. 1,600 కార్లతో తొలి కన్‌సైన్‌మెంట్ గుజరాత్‌లోని పిపవావ్ పోర్టు నుంచి జపాన్‌కు బయలుదేరింది. మారుతి సుజుకీ తన వాహన శ్రేణి నుంచి జపాన్ మార్కెట్లో ప్రవేశపెడుతున్న తొలి ఎస్‌యూవీ ఇది. కాగా బాలెనో తర్వాత జపాన్‌కు సరఫరా చేస్తున్న రెండో కారు. ఈ ఏడాది చివరిలో ఫ్రాంక్స్‌ను జపాన్ మార్కెట్లో ప్రవేశపెడతారు.

దీర్ఘకాలానికి మన మార్కెట్లు భేష్

యూనియన్ ఎంఎఫ్ సీఈఓ మధు నాయర్

20 నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూనియన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) ఈ నెల 20న కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాన్ని ప్రారంభిస్తోంది. మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ పేరుతో ప్రారంభించే ఈ పథకం నిధుల్లో 60 నుంచి 85 శాతం మార్కెట్ పరిస్థితులను బట్టి ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు యూనియన్ ఎంఎఫ్ సీఈఓ మధు నాయర్ చెప్పారు. మిగతా నిధులను పెద్దగా నష్టభయం (రిస్క్) లేని బంగారం, వెండి ఈటీఎఫ్‌లు, రుణ పత్రాల్లో మదుపు చేస్తామన్నారు. ఈ పెట్టుబడి వ్యూహంతో మల్టీ అసెట్స్ అలోకేషన్ ఫండ్ ద్వారా మదుపరులు మంచి రాబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు. సెప్టెంబరు 3 వరకు సబ్‌స్క్రిప్షన్స్ స్వీకరించే ఈ పథకం ద్వారా రూ.1,000 కోట్లకుపైగా సమీకరించాలని యూనియన్ ఎంఎఫ్ భావిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం యూనియన్ యాక్టివ్ మూమెంటమ్ ఫండ్ పేరుతో మరో కొత్త పథకాన్ని ప్రారంభించే యోచన ఉందన్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఇప్పటికే సెబీకి సమర్పించినట్టు చెప్పారు.

పసిడి భవిష్యత్ భేష్: అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తే పసిడి ధర మరింత పెరిగే అవకాశం ఉందని నాయర్ చెప్పారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలూ ఇందుకు దోహదం చేస్తాయన్నారు. వచ్చే ఐదేళ్లలో పసిడి మదుపరులకు మంచి లాభాలు పంచే అవకాశం పుష్కలంగా ఉందన్నారు. కాగా దేశీయ స్టాక్ మార్కెట్ విలువలు.. ప్రస్తుతం కొద్దిగా అతిగానే కనిపిస్తున్నట్టు నాయర్ చెప్పారు. దీర్ఘకాలానికి చూస్తే మాత్రం మన స్టాక్ మార్కెట్‌కు ఎలాంటి ఢోకా లేదన్నారు. వేగంగా పెరుగుతున్న జీడీపీ వృద్ధి రేటు, వ్యక్తిగత ఆదాయాలు ఇందుకు దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుతం ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం వచ్చే మూడు నాలుగేళ్లలో మూడో స్థానానికి ఎదగనున్న విషయాన్ని నాయర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

తెలుగు రాష్ట్రాలు కీలకం: తమ నిధుల సమీకరణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలది అత్యంత కీలక పాత్ర అని నాయర్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరం తెలంగాణ నుంచి సమీకరించిన నిధులు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 76 శాతం పెరిగినట్టు చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి రూ.16,500 కోట్లుగా ఉన్న తమ పథకాల ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రూ.25,000 కోట్లు అధిగమించే అవకాశం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా యూనియన్ ఎంఎఫ్ నిధుల సమీకరణ వృద్ధి రేటు యాభై శాతానికి పైగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇది పరిశ్రమ వృద్ధి రేటు కంటే రెట్టింపని నాయర్ తెలిపారు.

ఫస్ట్‌క్రై లిస్టింగూ హిట్టే..

ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ సైతం లిస్టింగ్ రోజున భారీగా లాభపడింది. ఇష్యూ ధర రూ.465తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 34.40 శాతం ప్రీమియంతో రూ.625 వద్ద లిస్టయింది. ఒకదశలో 52 శాతం వృద్ధితో రూ.707.05 వద్దకు ఎగబాకినప్పటికీ, చివరికి 45.86 శాతం లాభంతో రూ.678.25 వద్ద ముగిసింది.

ఆ ఫండ్స్ మా దేశానివి కావు: మారిషస్

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ పేర్కొన్న ఐపీఈ ప్లస్ ఫండ్, ఐపీఈ ప్లస్ ఫండ్-1 తమ దేశానివి కావని మారిషస్ ప్రకటించింది. ఫైనాన్షియల్ సర్వీసెస్ కమిషన్ ఆఫ్ మారిషస్ (ఎఫ్ఎస్‌సీఎం) మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సెబీలో చేరక ముందు గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీతో కలిసి మారిషస్‌లో నమోదైన ఈ రెండు ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్‌సీఎం ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం. ఇతర దేశాలకు చెందిన వ్యక్తులు, సంస్థలు తమ దేశంలో డొల్ల కంపెనీలు ఏర్పాటు చేయడానికి తమ చట్టాలు కూడా ఒప్పుకోవని ఎఫ్ఎస్‌సీఎం తెలిపింది. ఈ ఫండ్స్ ఏర్పాటుకు తాము ఎలాంటి అనుమతులు కూడా ఇవ్వలేదని స్పష్టం చేసింది.

వినేశ్ పిటిషన్‌పై తీర్పు

మళ్లీ వాయిదా

ఈనెల 16న నిర్ణయం



న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు రజత పతకం దక్కేనా? లేదా? అనే ఉత్కంఠతో సోమవారం భారత క్రీడాభిమానులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూశారు. ముందుగా ప్రకటించిన సమయం ప్రకారం రాత్రి 9.30 గంటలకు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) ఎలాంటి తీర్పునివ్వబోతోందోనన్న ఆత్రుత అందరిలోనూ కనిపించింది. కానీ తీరా ఆ సమయానికి తుది తీర్పు మరోసారి వాయిదా పడిందన్న నిర్ణయం రావడంతో అంతా ఉసూరుమన్నారు. తాజాగా ఈనెల 16న వినేశ్ అనర్హత విషయమై కాస్ తుది తీర్పునివ్వబోతోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే వాదనలు పూర్తయినప్పటికీ నిర్ణయం వెల్లడించేందుకు మాత్రం ఆలస్యమవుతోంది. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ మహిళల 50కేజీ విభాగం ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. కానీ సరిగ్గా పోటీలకు ముందు తన బరువు 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో డిస్‌క్వాలిఫై కావడం అందరినీ షాక్‌కు గురిచేసింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం కావడంతో పాటు భారత ఒలింపిక్ సంఘం కూడా వెంటనే ఈ విషయాన్ని కాస్‌లో అప్పీల్ చేసింది. వినేశ్‌కు కనీసం రజతమైనా ఇవ్వాలనే డిమాండ్ వినిపించింది. అయితే తన పిటిషన్‌పై గేమ్స్ ముగింపు రోజు 11న తీర్పు వస్తుందని ఆశించినా.. అది సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుత నిర్ణయంతో మరో రెండ్రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ కాస్ తీసుకునే నిర్ణయం వినేశ్‌కు అనుకూలంగా వస్తే భారత్ ఖాతాలో రెండో రజతం చేరుతుంది.



సీఎం మరియంతో అర్షద్

రూ.10 కోట్ల నజరానాతో పాటు వాహనం

నదీమ్‌కు ఆల్టో కారు, గేదె

లాహోర్: పాకిస్థాన్ బల్లెం వీరుడు, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్‌ను స్థానిక రాష్ట్ర ప్రభుత్వం సన్మానించింది. మంగళవారం పాక్‌లోని పంజాబ్ రాష్ట్ర సీఎం మరియం నవాజ్ షరీఫ్ స్వయంగా నదీమ్ స్వగ్రామం ఖనేవాల్‌కు వెళ్లి, అతడిని అభినందించారు. పాక్ కరెన్సీలో రూ.10 కోట్ల నగదు బహుమతితో పాటు హోండా సివిక్ కారును నదీమ్‌కు ప్రదానం చేశారు. అంతేకాక ఈ వాహనానికి 92.97 నెంబర్‌ను కేటాయించారు. నదీమ్ ఒలింపిక్స్‌లో జావెలిన్‌ను 92.97 మీటర్ల దూరం విసిరిన సంగతి తెలిసిందే.

అల్లుడూ..ఇదిగో గిఫ్ట్ : నదీమ్‌కు ఒక పక్క కార్లు, నగదు పురస్కారాలు వచ్చి పడుతుంటే తన మామ మహ్మద్ నవాజ్ గేదెను బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచాడు. నదీమ్ స్వగ్రామమైన ఖనేవాల్ పరిసర ప్రాంతాల్లో గేదెలను కలిగి ఉండడం గౌరవమట.

ఆల్టో కారు బహుమతిపై ట్రోలింగ్..

నదీమ్ సాధించిన ఒలింపిక్ పతకానికి మెచ్చి పాకిస్థాన్‌కు చెందిన అమెరికా వ్యాపారవేత్త అలీ షేఖానీ అతడికి మారుతిసుజుకి ఆల్టో కారును ఇస్తానని ప్రకటించాడు. ఈ కారు పాక్ కరెన్సీలో రూ.23 లక్షలుగా ఉంది. 'అతడికి బీఎండబ్ల్యూ, ఆడీ వంటి కార్లను ఇవ్వాలి కానీ ఇలాంటి చిన్నకార్లు ఇచ్చి అవమానించొద్దు' అని సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ జరుగుతోంది.



రొటీన్‌కు భిన్నంగా ఓపెన్ ఆడిటోరియంలో మొదలైన పారిస్ ఒలింపిక్స్.. ఆసాంతం అలరించాయి. ఇక, విశ్వ క్రీడలను ముగించిన తీరును అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. స్టార్ హీరో టామ్ క్రూస్.. కప్పుపై నుంచి కిందకు వచ్చి ఒలింపిక్ జెండాను అందుకొని బైక్‌పై స్టేడియం బయటకు దూసుకెళ్లడంతో పారిస్ క్రీడలు ముగిశాయని చెబుతూనే.. తదుపరి '2028 లాస్ ఏంజిల్స్ మిషన్' మొదలైందనే విధంగా హాలీవుడ్ టచ్ ఇచ్చారు.

పారిస్‌ను మరిపించడం..

లాస్ ఏంజిల్స్‌కు సాధ్యమా?

- తక్కువ బడ్జెట్‌తో భేష్
- తాత్కాలిక స్టేడియాలతో తగ్గిన నిర్వహణ భారం
- భవిష్యత్ బిడ్డర్లకు చక్కని పాఠం

ఇప్పటివరకు జరిగిన విశ్వ క్రీడల్లో పారిస్ ఒక మైలురాయి అని విశ్లేషకులు భావిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఇంతటి మెగా ఈవెంట్‌ను సూపర్ హిట్ చేయడాన్ని కొనియాడుతున్నారు. ముఖ్యంగా ఒలింపిక్స్ స్థాయిని నిలబెట్టిన మెగా ఈవెంట్‌గా చరిత్రలో నిలిచిపోతుందంటున్నారు. 2016 రియో ఒలింపిక్స్‌లో మౌలిక సదుపాయాల కొరతను ఎదుర్కోగా.. కరోనా కారణంగా టోక్యో క్రీడల నిర్వహణ భారంగా మారింది. 2020లో జరగాల్సిన క్రీడలను 2021కి వాయిదా వేయడంతో సంబంధిత స్టేడియాల పరిరక్షణ, నిర్వహణ వ్యయం కొండలా పెరిగింది. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ నిర్వహణ పెద్ద సవాల్‌గా మారింది. గత పరిణామాలను నిశితంగా పరిశీలించిన నిర్వాహకులు.. ప్రతి విషయంలోనూ సమర్థంగా వ్యవహరించారు. ముఖ్యంగా బడ్జెట్ నియంత్రణలో భేష్ అనిపించుకొన్నారు. స్టేడియాల విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిటీ అంతటా దాదాపుగా 35 వేదికలతోపాటు తాత్కాలిక స్టేడియాలను నిర్మించి ఖర్చుకు పగ్గాలేశారు. షూటింగ్ లాంటి క్రీడలను శివార్లలో నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో కూడా పర్యాటకుల సందడి పెరిగింది. మొత్తం భారమంతా ఒక్క పారిస్ నగరిపైనే పడకుండా చూసుకోవడం భవిష్యత్ నిర్వాహకులకు ఒక పాఠం. ఓపెనింగ్ సెర్మనీని కూడా రొటీన్‌కు భిన్నంగా సైన్ నదిపై నిర్వహించారు.

లోపాలున్నా.. చిన్నవే

206 దేశాలకు చెందిన 10 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న ఇంత పెద్ద ఈవెంట్ నిర్వహణలో అసలు లోపాలు చోటు చేసుకోలేదా? అంటే కాదనే చెప్పుకోవాలి. ముఖ్యంగా ప్లేయర్లు ఆహారం కోసం లైన్లలో బారులు తీరి నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు క్రీడాకారులు కేవలం ప్రాణాలు నిలబెట్టుకోవడానికి తప్ప.. క్రీడా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆహారం ఏమంత రుచిగా లేదనే ఫిర్యాదులు అందాయి. భారత క్రీడాకారులకు సౌకర్యవంతమైన బసకూడా ఏర్పాటు చేయలేకపోయారు. ఏసీలు లేకపోవడంతో భారత ఎంబసీనే చొరవ తీసుకోవాల్సి వచ్చింది. అన్నింటి కంటే పెద్ద టాస్క్.. ట్రాన్స్‌పోర్ట్. ప్లేయర్లను ఆయా వేదికల వద్దకు చేరవేయడంలో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే, ఇంత భారీ ఈవెంట్‌లో చిన్నపాటి లోపాలు సహజమే అయినా.. ఓవరాల్‌గా 2024 క్రీడలను అత్యుత్తమ స్థాయిలో నిర్వహించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పారిస్‌ను దలదన్నేలా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ నిర్వహణ 'మిషన్ ఇంపాజిబుల్' అంటున్నారు.

రూ. 1.5 కోట్లా.. ఎప్పుడిచ్చారు?

సాయ్ నివేదికను తప్పుబట్టిన అశ్విని



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం తనపై రూ. కోటిన్నరకు పైగా ఖర్చు చేసినట్టు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) తన నివేదికలో పేర్కొనడాన్ని బ్యాడ్మింటన్ డబుల్స్ ప్లేయర్ అశ్విని పొన్నప్ప తప్పుబట్టింది. తనకు అందిన సహాయం స్వల్పమేనని తెలిపింది. ఆఖరికి కోచ్ కోసం తాను చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించారని చెప్పింది. తనీషా క్రాస్టోతో కలసి మహిళల డబుల్స్ బరిలో దిగిన పొన్నప్ప ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే ఇంటిముఖం పట్టింది. అయితే, ఒలింపిక్ సైకిల్‌లో భాగంగా ఆమెకు 'టాప్స్' పథకం కింద రూ.4.5 లక్షలు, వార్షిక ట్రైనింగ్, పోటీల కింద రూ. 1.48 కోట్లను ఖర్చు చేసినట్టు సాయ్ తెలిపింది. 'ఆ నివేదిక నన్ను షాక్‌కు గురి చేసింది. వ్యక్తిగతంగా నాకు ఆర్థిక సాయం చేశానని చెప్పడం హాస్యాస్పదం. నా కోచ్‌కు నేనే జీతాలు చెల్లించా. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాతే నన్ను టాప్స్‌లో చేర్చార'ని పొన్నప్ప చెప్పింది.

బంగ్లాతో తొలి టీ20

గ్వాలియర్‌కు తరలింపు

న్యూఢిల్లీ: స్వదేశంలో జరిగే రెండు సిరీస్‌ల షెడ్యూల్‌లో బీసీసీఐ స్వల్ప మార్పులు చేసింది. అక్టోబరు 6న ధర్మశాలలో బంగ్లాదేశ్‌తో జరగాల్సిన తొలి టీ20 వేదికను గ్వాలియర్‌కు మార్చింది. ధర్మశాల స్టేడియంలో మరమ్మతుల కారణంగా మ్యాచ్‌ను తరలించినట్టు బోర్డు తెలిపింది. ఇక, వచ్చే జనవరిలో ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భాగం తొలి రెండు టీ20ల వేదికల్లో పరస్పరం మార్పులు చేసింది. తొలి మ్యాచ్ కోల్‌కతాలో, రెండో మ్యాచ్ చెన్నైలో నిర్వహించే విధంగా షెడ్యూల్‌ను రివైజ్ చేశారు. రిపబ్లిక్ డేను దృష్టిలో ఉంచుకొని వేదికలను మార్పులు చేయాలని కోల్‌కతా పోలీసులు, క్యాబ్ చేసిన విజ్ఞప్తి మేరకు వేదికలను పరస్పరం మార్పులు చేసినట్టు పేర్కొంది.

స్పోర్ట్స్

పారా షట్లర్ భగత్‌పై నిషేధం



న్యూఢిల్లీ: డోపింగ్ కోడ్‌ను ఉల్లంఘించిన పారా షట్లర్ ప్రమోద్ భగత్‌పై 18 నెలల సస్పెన్షన్ వేటు పడింది. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన ప్రమోద్..దీంతో పారిస్ పారాలింపిక్స్‌కు దూరమయ్యాడు. నిబంధనల ప్రకారం తన ఉనికిని నాడా అధికారులకు అథ్లెట్లు తెలియజేయాలి. భగత్ డోపింగ్ నిబంధనల్ని ఉల్లంఘించినట్టు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) యాంటీ డోపింగ్ విభాగం గత మార్చిలో తేల్చింది. ప్రమోద్ 12 నెలల వ్యవధిలో ఇలా మూడుసార్లు అంతుచిక్కకుండా వెళ్లిపోయాడని 'కాస్' పేర్కొంది.

మను–నీరజ్ పెళ్లా..!

కొట్టిపడేసిన భాకర్ తండ్రి



న్యూఢిల్లీ: షూటర్ మను భాకర్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా లవ్‌లో ఉన్నారంటూ నెట్‌లో ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. ఒలింపిక్స్‌లో వీరిద్దరూ చనువుగా మాట్లాడుకొంటున్నట్టు బయటకు వచ్చిన వీడియోలు, ఫొటోలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. త్వరలో వీరి పెళ్లి అంటూ నెటిజన్లు పోస్టుల మీద పోస్టులు పెడుతున్నారు. అయితే, భాకర్ తండ్రి రామ్ కిషన్ మాత్రం ఈ ఊహాగానాలకు కొట్టిపడేశాడు. 'మను ఇంకా చిన్నపిల్లే. ఆమెకు పెళ్లి వయసు రాలేదు. మాకు కూడా ఎలాంటి ఆలోచనా లేద'ని తెలిపాడు. వారిద్దరి మధ్య ఏమీ లేదని చెప్పాడు. నీరజ్‌ను మను తల్లి సుమేధ కొడుకులా భావిస్తుందని, రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలున్నాయని తెలిపాడు. పారిస్ క్రీడల్లో మను రెండు కాంస్యాలు సాధించగా.. నీరజ్ రజతం దక్కించుకొన్నాడు.

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్‌గా పోప్



లండన్: ఇంగ్లండ్ టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా ఒల్లీ పోప్ నియమితుడయ్యాడు. నార్తర్న్ సూపర్ చార్జర్స్ తరఫున 100 లీగ్‌లో ఆడుతున్న ప్రస్తుత కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు తొడ కండర గాయం కావడంతో శ్రీలంకతో జరగనున్న సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. దీంతో స్టోక్స్ స్థానంలో పోప్‌కు నాయకత్వ బాధ్యతలను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అప్పగించింది. పోప్‌ను ఈ సిరీస్‌కు మాత్రమే కెప్టెన్‌గా నియమించారు.

శ్రీలంక బ్యాటింగ్ కోచ్ బెల్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ ఇయాన్ బెల్‌ను శ్రీలంక బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈనెల 21 నుంచి ఇంగ్లండ్ టూర్‌లో ఆ జట్టుతో శ్రీలంక 3 టెస్టులు ఆడనుంది.

జోగి గుట్టు రట్టు



వైసీపీ నేత జోగి రమేశ్ కుమారుడిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న ఏసీబీ అధికారులు

వైసీపీలో జోగి లాంటి తిమింగలాలెన్నో: మంత్రి కొల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒక ఫేక్ పార్టీ అని, జగన్‌ది మోకపోతు గాంభీర్యమని ఏపీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఏపీకి విదేశీ పెట్టుబడులు వస్తుంటే చూసి ఓర్వలేక జగన్ ఢిల్లీలో దొంగ ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పకడ్బందీ ప్రణాళికతో తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కేంద్ర నుంచి నిధులు తెచ్చే పనిలో ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని వనరులనూ మింగేసిందని, వైసీపీలో జోగి రమేష్ వంటి తిమింగలాలు ఎన్నో ఉన్నాయని, ఇప్పుడు అన్నీ బయటికి వస్తున్నాయని తెలిపారు. గత రికార్డులు బయటికి వస్తే ఆ పాపాలు అందరికీ తెలుస్తాయని వాటిని తగల బెట్టారన్నారు. జోగి రమేష్ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని చెప్పి వారి భూములు లాక్కున్నారని, కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశానని, ఏపీ అభివృద్ధిపై చర్చించానని మంత్రి కొల్లు తెలిపారు. 1900లోనే మచిలీపట్నం రైల్వే లైను ఉన్నదని, మచిలీపట్నం నుంచి రేపల్లె లింక్ కలిపితే కోస్టల్ కారిడార్‌లో రైలు నడపడానికి అవకాశం ఉన్నదని తెలిపారు. టూరిజానికి ఎక్కువ అవకాశాలున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, దీనికి సహకరించాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు. స్వదేశీ నిర్మాణ్‌లో మచిలీపట్నాన్ని కూడా చేర్చాలని కోరానన్నారు.

జోగీ.. బీసీ కార్డు తీస్తావా?: మంత్రి సుభాశ్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ జప్తులో ఉన్న భూములను అక్రమంగా కొన్న కొడుకు అరెస్టు కాగానే బీసీ కార్డు బయటకు తీస్తావా? మంత్రిగా ఉండి బీసీలకు ఏం చేశావు? నీ అక్రమాలను ప్రశ్నిస్తే బీసీనని గుర్తుకు వచ్చిందా' అని వైసీపీ నేత జోగి రమేష్‌ను మంత్రి వాసంశెట్టి సుభాశ్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 'జోగి రమేష్ తన అధికారాన్ని కొడుకు కబ్జాలకు అండగా నిలిపాడు. అగ్రిగోల్డ్ భూములను కొట్టేశారు. ఇప్పుడు కొడుకు అరెస్టు కాగానే బీసీ కార్డు తీస్తున్నారు. నాడు.. వైసీపీ హయాంలో, అమర్‌నాథ్ గౌడ్‌ను వైసీపీ నేతలు కిరాతకంగా పెట్రోలు పోసి చంపితే జోగి రమేష్ నోరు పెగల్లేదేం?' అని సుభాష్ నిలదీశారు.

కులాలను రెచ్చగొడతావా?: అనగాని

అమరావతి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను కాజేసిన మాజీ మంత్రి జోగి రమేష్.. ఇప్పుడు ఆ అక్రమాల గుట్టు బయటపడగానే కులాలను రెచ్చగొట్టి తనను తానుకాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి మాట్లాడారు. భూములను కాజేసిన కుంభకోణంలో జోగి కుటుంబం పాత్ర చాలా స్పష్టంగా బయటకొచ్చిందని, అందరి దృష్టిని మరల్చేందుకు జోగి కులాల కుంపట్లను రాజేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇకనైనా బుద్ధి మార్చుకోకపోతే బీసీలే తగిన గుణపాఠం చెబుతారని మంత్రి హెచ్చరించారు.

జోగి పాపం పండింది: మంత్రి సవిత

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబం పాపం పండిందని, ఆయన కుటుంబ అక్రమాల పుట్ట బద్దలవుతోందని మంత్రి సవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోగి రమేష్ గతంలో చేసిన పాపాలకు శిక్ష అనుభవించే రోజులొచ్చాయని, అవినీతి అనకొండ జగన్ అండ చూసుకుని జోగి పేట్రేగిపోయారని విమర్శించారు. సుపుత్రుడు జోగి రాజీవ్‌తో కలిసి సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములనే కొట్టేసిన ఘనమైన కుటుంబం జోగి రమేష్‌దని ఎద్దేవా చేశారు. విజయవాడ మండలం అంబాపురం సర్వే నంబర్ 88లో 2160 చదరపు గజాల అగ్రి గోల్డ్ భూమిని సీఐడీ అటాచ్ చేసిందని, ఆ భూమినే కొడుకు పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్డంగా దొరికిపోయారని పేర్కొన్నారు. త్వరలో జోగి రమేష్ కూడా ఊచలు లెక్కపెట్టడం ఖాయమని మంత్రి సవిత వ్యాఖ్యానించారు.

అడ్డంగా దొరికినా.. బుకాయిస్తారా?: బీద

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల స్వాహాలో కొడుకు, బాబాయి అడ్డంగా దొరికిపోయినా.. కక్షసాధింపు చర్యలని బుకాయించడం జోగి రమేష్‌కే చెల్లిందని టీడీపీ నేత బీద రవిచంద్రయాదవ్ మండిపడ్డారు. 'అధికార దుర్వినియోగం చేసి, అగ్రిగోల్డ్ భూముల్ని అక్రమంగా జోగి రమేష్ తన కుటుంబసభ్యులకు దోచిపెట్టారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూముల్ని జోగి కుటుంబ సభ్యులే కొనుగోలు చేయడమే కాక, రికార్డులను తారుమారు చేసి, సర్వే నంబర్లను సైతం మార్చివేశారు. జోగి కుటుంబసభ్యుల అక్రమాలపై అగ్రిగోల్డ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదుతోనే ఏసీబీ అధికారులు దర్యాప్తు జరిపి, జోగిరాజీవ్‌ను అదుపులోకి తీసుకున్నారు' అని తెలిపారు.

అవినీతికి పాల్పడితే వదిలేయాలా?: బుద్ధా

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 13: 'ఎవరైనా అవినీతికి పాల్పడితే చూస్తూ ఊరుకోవాలా? అరెస్ట్ చేయకుండా వదిలేయాలా?' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. జోగి రమేష్ అవినీతి కేసుల్లో కులాన్ని అడ్డుపెట్టుకోవటం సిగ్గుచేటన్నారు. సీఐడీ జప్తులో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను అక్రమంగా కొనుగోలు చేసినందుకే జోగి కొడుకును అరెస్ట్ చేశారని చెప్పారు. అరెస్టుపై కక్ష సాధింపు చర్య అంటున్నాడని, బీసీ బాలుడిని పెట్రోల్ పోసి తగులబెట్టేసినప్పుడు జోగికి కులం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.

జోగి 'బెయిల్'పై విచారణ వాయిదా

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై మూకదాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జోగి రమేష్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విచారణను మరో రోజుకు వాయిదా వేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా స్పందిస్తూ.. పిటిషనర్‌కు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దాంతో పిటిషనర్ దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

జగన్‌లో మార్పు రాలేదు: మంత్రి అనిత

విశాఖపట్నం, ఆగస్టు 13: ప్రజలు తిరస్కరించినా జగన్ తీరులో మార్పు రాలేదని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. విశాఖలో మంగళవారం ఆమె మాట్లాడారు. ఇప్పటికీ తన పార్టీ రాజ్యాంగంలో రాసుకున్న ఫేక్ రాజకీయాన్నే జగన్ నమ్ముకున్నారన్నారు. జగన్‌కు జెడ్ ప్లస్ కేటగిరీ, ఆయన సతీమణి భారతీ రెడ్డికి 2+2 భద్రత ఇచ్చామన్నారు. ప్రతిపక్ష హోదా లేకున్నా ఇవన్నీ కల్పిస్తున్నామని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల బృందం చేరుకుంది. మధ్యాహ్నం వరకు ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతరం రాజీవ్‌ను అరెస్టు చేస్తున్నట్టు అతడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములకు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకున్న అంశంలో ఏసీబీ అధికారులు.. రాజీవ్‌పై ఈ నెల ఎనిమిదో తేదీన ఎఫ్ఐఆర్ (నం.03/ఆర్‌సీఓ-సీఐయూ-ఏసీబీ/2024) నమోదు చేశారు. ఈ కేసులో రాజీవ్‌ను ఏ1గా పేర్కొన్నారు. జోగి రమేశ్ బాబాయ్ జోగి వెంకటేశ్వరరావును ఏ2గా చేర్చారు. సర్వేయర్ ఎ.రమేశ్(ఏ3), విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ సర్వేయర్ కె.దేదిప్య(ఏ4), నున్న సబ్‌రిజిస్ట్రార్ బి.నాగేశ్వరరావు(ఏ5)గా చేర్చారు. వారిపై ఐపీసీ 120బీ, 420, పీసీ (సవరణ) చట్టం- 2018లోని సెక్షన్లు 7, 12; ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టంలోని సెక్షన్ 4 కింద కేసు నమోదు చేశారు. జోగి రాజీవ్, ఎ.రమేశ్‌ను అరెస్టు చేసిన తర్వాత గొల్లపూడిలో ఉన్న ఏసీబీ జిల్లా కార్యాలయానికి తరలించారు. అక్కడ వీరిద్దరినీ అధికారులు వేర్వేరుగా విచారించారు. అనంతరం వైద్యపరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లారు. రాజీవ్ తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఏసీబీ తరఫున పీపీ మీనాకుమారి... న్యాయాధికారి హిమబిందు ఎదుట వాదనలు వినిపించారు. అనంతరం కోర్టు ఈ నెల 23 వరకు రాజీవ్, రమేశ్‌లను రిమాండ్‌కు ఆదేశించడంతో విజయవాడ జైలుకు తరలించారు.

ఆస్పత్రి వద్ద హైడ్రామా..

వైద్య పరీక్షల కోసం రాజీవ్‌ను తెచ్చినప్పుడు విజయవాడ ప్రభుత్వాస్పత్రి వద్ద వైసీపీ నేతలు నానా హంగామా సృష్టించారు. తామంతా ఆస్పత్రిలోకి వెళ్తామంటూ పోలీసులపై తిరగబడ్డారు. బందోబస్తు నిర్వహించిన పోలీసులను ఏకవచనంతో సంబోధించారు. రాజీవ్‌ను ఆస్పత్రికి తీసుకువస్తున్నారని తెలుసుకుని వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి జోగి రమేశ్ తదితరులు అనుచరగణంతో అక్కడకు చేరుకున్నారు. మాచవరం పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. లోపలకు వెళ్లడానికి ప్రయత్నించిన వైసీపీ నేతలను మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ అడ్డుకున్నారు. ఆయనపై తలశిల రఘురాం రెచ్చిపోయారు. ఎమ్మెల్సీని అడ్డుకునే అధికారం ఎవరిచ్చారంటూ రఘురాం చిందులు తొక్కారు. కాసేపు పోలీసులతో వైసీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. తర్వాత కాసేపటికి రఘురాం, జోగి రమేశ్, మల్లాది విష్ణును మాత్రమే లోపలకు అనుమతించారు. గేటు బయట ఉన్న కార్యకర్తలు మాత్రం ఆస్పత్రి సర్వీసు రోడ్డులో కాసేపు హడావుడి చేశారు.

జోగి స్వరం మారింది

బీసీని కాబట్టే తనను వేధిస్తున్నారనీ, ఏమీ తెలియని తన కుమారుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలనుకుంటున్నారని మాజీ మంత్రి జోగి రమేశ్ ఆక్రోశం వెళ్లగక్కారు. బలహీనవర్గాల నుంచి ఎదిగిన నాయకుడినని తన కుటుంబంపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. గతంలో చంద్రబాబు పవన్ కల్యాణ్‌పై బూతులతో విరుచుకుపడిన రమేశ్, గత శైలికి భిన్నంగా మాట్లాడారు. "నా కుమారుడు అమెరికాలో ఎంఎస్ చేసి డెలాయిట్‌లో ఉద్యోగం చేసేవాడు. ఎన్నికల్లో నాకు సహాయకారిగా ఉండాలని వచ్చాడు. ఎటువంటి తప్పు చేయని అమాయకుడిని కేసుల్లో ఇరికిస్తున్నారు. కక్ష ఉంటే నాపై తీర్చుకోవాలే తప్ప అభం శుభం తెలియని నా కుమారుడిని ఇరికించడం తగదు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి.. అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాతే భూముల కొనుగోలు చేశాం. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన అనంతరం జోగి రాజీవ్ మాట్లాడుతూ, అందరూ కొన్నట్టే తామూ భూములు కొనుగోలు చేశామని, ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే తనను అరెస్టు చేసిందని అన్నారు.

నిజమే.. కుమారుడిని నాశనం చేసింది తండ్రే చేసిందంతా చేసి ఇప్పుడు పెడబొబ్బలు

తప్పు చేయని అమాయకుడిని అరెస్టు చేశారని, అభం శుభం తెలియనివాడిని జైలుకు పంపాలని చూస్తున్నారంటూ మాజీ మంత్రి జోగి రమేష్ అన్న మాటలు విన్నవారు విస్తుపోతున్నారు. 'ఈ కుమారుడిని నాశనం చేసింది ఆ తండ్రే' అని వ్యాఖ్యానిస్తున్నారు. అభం శుభం తెలియని రాజీవ్ పేరుతో భూమి కొనుగోలు చేసిందెవరు.? అది పక్కాగా వివాదాస్పద భూమి అని తెలిసినా అధికారులపై వత్తిడి తెచ్చి సర్వే నెంబరు మార్పించిందెవరు? భవిష్యత్‌లో తేడా వస్తే బలయ్యేది తన కుమారుడేనన్న ఆలోచన లేకుండా అధికారం ఉందని నాడు అడ్డదారిలో వెళ్లిందెవరు? ఈ ప్రశ్నలన్నింటికీ తండ్రి జోగి రమేశ్ అన్న సమాధానమే లభిస్తోంది.

నాడు మిడిసిపడి.. నేడు అడ్డంగా బుక్కయ్యి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన జోగి రమేశ్, కొడాలి నాని, వల్లభనేని వంశీ వంటి నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై బూతులతో విరుచుకుపడేవారు. అప్పటి సీఎం జగన్ సమక్షంలో జరిగిన ఓ సభలో జోగి రమేశ్.. చంద్రబాబును ముసలి నక్క అని, పవన్ కల్యాణ్‌ను పిచ్చి కుక్క అంటూ అసభ్యంగా దూషించారు. జోగి ప్రసంగం తర్వాత జగన్ ఆయనను పిలిచి మరీ భుజం తట్టడం గమనార్హం. అసెంబ్లీలోనూ ఆదే తంతు! అప్పుడూ జగన్ స్పందిస్తూ.. జోగి అన్నకు థ్యాంక్యూ అంటూ అభినందించేవారు.

జోగి రమేశ్ పాత్రపై విచారణ చేస్తున్నాం

"అగ్రిగోల్డ్ భూములను కాజేసిన వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ పాత్రపై విచారణ జరుగుతోంది. ఈ వ్యవహారంతో ఆయనకు సంబంధం ఉన్నదని తేలితే కేసు నమోదు చేస్తాం. అగ్రిగోల్డ్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయి. భూముల సర్వే నంబర్లను మార్చారు. దీనిపై సీఐడీ నుంచి నివేదికను రప్పిస్తున్నాం. అగ్రిగోల్డ్ ఆస్తులు సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని తేలాకే కేసు నమోదు చేశాం. సర్వే నంబర్ 88లో ఉన్న భూమిని కొనుగోలు చేసి దానికి పక్కనే ఉన్న సర్వే నంబరు 87లో కొన్నట్టు మార్పులు చేశారు. ఇదంతా ఒక కుట్ర ప్రకారం జరిగింది"

- సౌమ్యలత, ఏసీబీ అదనపు ఎస్పీ

ఇదో అగ్లీ దందా!

అగ్రి బాధితుల్ని ఆదుకుంటానన్న హామీతో గద్దెనెక్కిన జగన్

- కానీ ఆ భూములపైనే కన్నేసిన జోగి రమేశ్
- కొన్నది సర్వే నంబరు 88లోని భూములు
- సర్వే నం. 87కు మార్చాలంటూ దరఖాస్తు..
- అడ్డగోలుగా రిజిస్ట్రేషన్.. సహకరించిన సర్వేయర్లు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ రూరల్ అంబాపురంలో రెవెన్యూ సర్వే నంబరు 87లో మొత్తం 18.33 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమి యజమానులుగా కళ్లెం సాంబిరెడ్డి, కాకర్లపూడి అన్నపూర్ణ, యలవర్తి దేవేంద్రప్రసాద్, కళ్లెం అశోక్‌రెడ్డి, కళ్లెం రంగారెడ్డి, కళ్లెం శివప్రసాదరెడ్డి, గోకరాజు ఉమాదేవి, ఆరుమళ్ల రామలింగారెడ్డి, గరికపాటి జయలక్ష్మి పేర్లు ఉన్నాయి. ఇందులో జయలక్ష్మికి 2.81 ఎకరాలు ఉండగా, అందులో 0.65 సెంట్లు (3120 గజాలు) అల్లూరి కృష్ణమూర్తికి విక్రయించారు. ఆయన అగ్రిగోల్డ్ యజమానులైన అవ్వ ఉదయభాస్కర్, వెంకట సుబ్రమణ్యం తదితరులకు అందులో 2,293.05 గజాలు విక్రయించారు. ఇదే భూమిలో 2,160 గజాలను జోగి కుటుంబసభ్యులు దొంగపత్రాలతో కాజేశారు. అగ్రిగోల్డ్ భూముల చెంతనే రెవెన్యూ సర్వే నంబరు 88లో మొత్తం 7.47ఎకరాల పట్టాభూమి ఉంది. ఇందులో కనుమూరి వెంకట రామరాజు, కనుమూరి వెంకట సుబ్బరాజు కుటుంబ సభ్యుల పేరున 4 ఎకరాలు ఉంది. ఈ భూమిని వీరు బొమ్ము వెంకట చలమా రెడ్డికి విక్రయించారు. చలమారెడ్డి అందులో ఒక ఎకరాను 2001లో పోలవరపు మురళీమోహన్‌కు విక్రయించారు. మురళీమోహన్ తాను కొనుగోలు చేసిన ఎకరాలో 2003లో ప్లాట్లు వేసి విక్రయించారు. తిరిగి అదే భూమిని 2014లో మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ తరఫున అడుసుమిల్లి మోహనరామదాసుకు విక్రయించారు. అంటే ఒకే భూమిని డబుల్ రిజిస్ట్రేషన్లు చేశారు. అడుసుమిల్లి మోహనరామదాసు నుంచి 2022లో జోగి వెంకటేశ్వరరావు, జోగి రాజీవ్ వరుసగా 1086 గజాలు, 1074 గజాలు... మొత్తం 2160 గజాలు కొనుగోలు చేశారు. అప్పటికే డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని కొన్న జోగి కుటుంబ సభ్యులు సర్వే నంబరు 88లో భూమి లేదని గుర్తించి తెలివిగా పక్కనే ఉన్న అగ్రిగోల్డ్ భూములపై కన్నేశారు. ఈ భూములను 2018 ఆగస్టు 14న జీవో 117, 2019 అక్టోబరు 17న జీవో 133 ద్వారా సీఐడీ అటాచ్‌మెంట్ చేసుకుంది. ఈ భూములను కబ్జా చేసేందుకు 2023 ఏప్రిల్ 29న జోగి రాజీవ్, వెంకటేశ్వరరావు స్వీయ సవరణ దస్తావేజు దాఖలుచేశారు. తాము సర్వే నంబరు 87లో ఉన్న భూమిని కొనుగోలు చేశామని, కానీ సర్వే నంబరు 88గా పడిందని దాన్ని మార్పు చేయాలని కోరారు. ఈ రకంగా సర్వే నంబరు 87లో సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను తమ పేరుపై రిజిస్టర్ చేయించుకున్నారు. ఆ సమయంలో జోగి రాజీవ్ తండ్రి జోగి రమేశ్ మంత్రిగా ఉండటం.. అధికారులు పూర్తిగా సహకరించడంతో వీరి పని సులువు అయింది. అయితే, వివాదాస్పద భూమిని తమ వద్ద ఉంచుకుంటే ముందు ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో ఆగమేఘాలపై ఆ భూమిని ప్లాట్లుగా వేసి 2023 మే 31న విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్‌గా ఉన్న చైతన్యరెడ్డి కుటుంబసభ్యులు పడిగపాటి దుర్గాప్రసాద్, సోముల దుర్గాభవానీ, సోముల వెంకటేశ్వరరావు, పడిగపాటి సుబ్బారెడ్డి, పడిగపాటి బాలమ్మకు విక్రయించేసి జోగి కుటుంబ సభ్యులు చేతులు దులుపుకొన్నారు.



కాజేసి.. ప్రహరీ కట్టేసి...

సర్వే నంబరు 87లో ఉన్న భూములు అగ్రిగోల్డ్ భూములని జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావుకు పూర్తి అవగాహన ఉంది. ఆ భూములను తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాకుండా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తమ కబ్జాకు చట్టబద్ధత కల్పించేందుకు తాము కొనుగోలు చేసిన స్థలాలను సర్వే చేయాలని జోగి రాజీవ్, వెంకటేశ్వరరావు విజయవాడ రూరల్ మండల సర్వేయర్ ఎ.రమేశ్, అంబాపురం గ్రామ సర్వేయర్ కె.దేదీప్యకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు సర్వేయర్ సంబంధిత స్థలాన్ని పరిశీలించి, సరిహద్దు స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలి. ఈ రెండు పనులు చేయకుండా స్థలాలను తాను పరిశీలించినట్టుగా రమేశ్, దేదీప్య నివేదికలు ఇచ్చారు. ఈ రెండు నివేదికలను ఆధారంగా చేసుకుని సర్వే నంబరు 87లోని భూమి జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావుకు చెందినదిగా నిర్ధారించారు. ఈ భూములను సీఐడీ జప్తు చేసిందని వెబ్‌ల్యాండ్‌లో స్పష్టంగా ఉంది. నున్న సబ్‌రిజిస్ట్రార్ దీన్ని పరిశీలించకుండానే రాజీవ్, వెంకటేశ్వరరావు పేరు మీద వారు సమర్పించిన స్వీయ సవరణ దస్తావేజును రిజిస్ట్రేషన్ చేశారు.

జోగి దందాను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'!

- జూన్ 18 ప్రధాన సంచికలో కథనం

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి ఆ భూములనే కాజేసేందుకు సిద్ధమైన మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబసభ్యుల దందాను మొదటిగా వెలుగులోకి తెచ్చింది 'ఆంధ్రజ్యోతే'. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామంటూ 2019 ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన వైఎస్ జగన్, అధికారంలో ఉన్న ఐదేళ్లూ వారికి న్యాయం చేసిందే లేదు. పైగా అగ్రిగోల్డ్ బాధితులకు దక్కాల్సిన భూములను జగన్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన జోగి రమేశ్ కుటుంబం కబ్జా చేసేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని ఆధారాలతో సహా 'ఆంధ్రజ్యోతి' ఈ ఏడాది జూన్ 18న ప్రధాన సంచికలో 'అగ్రిగోల్డ్ భూములతో దందా' శీర్షికన ప్రచురించింది. ఈ వ్యహారంలో జోగి రమేశ్ కుమారుడు రాజీవ్, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు పాత్రను అధికారుల నివేదిక సాక్షిగా ఈ కథనంలో బట్టబయలు చేసింది ఈ కథనంతో అటు అధికార పార్టీలోనూ, ఇటు అధికార యంత్రాంగంలోనూ కదలిక వచ్చింది. ఆ తర్వాత కూడా ఈ భూబాగోతంలో పాత్రధారులపై కథనాలను ప్రచురిస్తూ వచ్చింది.

ఫ్రీ హోల్డ్‌పై సర్కారు నజర్

పెద్దల గుట్టు రట్టుచేసేందుకు విచారణ

- 'సాగర నగరం'లో తీగ దొరికింది...
- ఇక భూచోళ్లను బయటకు తీయడమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదల జీవనాధరమైన అసైన్డ్ భూములను వైసీపీ నేతలు అడ్డగోలుగా దోచుకున్నారని ప్రభుత్వం గుర్తించింది. అసలు పేర్లతో కొంత, బినామీ పేర్లతో ఊహించనంతగా భూములు స్వాహా చేశారని నిర్ధారణకు వచ్చింది. ప్రత్యేకించి ఉమ్మడి విశాఖ, విజయనగరం, చిత్తూరు జిల్లాల పరిధిలోని భూములపైనే ఎక్కువ దృష్టిపెట్టి భూచోళ్ల చిట్టాను విప్పాలనుకుంటోంది. ఇప్పటికే చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, పలమనేరు, రేణిగుంట పరిధిలో భూములపై కొంత స్పష్టత వచ్చింది. ఇదే ప్రాంతంలో శ్రీకాళహస్తి కేంద్రంగా కూడా కొన్ని వేల ఎకరాల అసైన్డ్ భూములు పరాధీనం అయ్యాయని గుర్తించింది. దీంతోపాటు విశాఖ, విజయనగరం జిల్లా భోగాపురం, దాని చుట్టుపక్కల మండలాల పరిధిలోని భూములపై అధ్యయనం చేయిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం భోగాపురం మండలం, విశాఖ అర్బన్ ఏరియా పరిధిలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల లావాదేవీలపై సమగ్ర విచారణ జరుగుతోంది. ఇందులో గత ప్రభుత్వ పెద్దలు, వారి అనుచరుల చేతుల్లో ఉన్న విలువైన అసైన్డ్ భూముల జాబితాను కొలిక్కితీసుకొచ్చినట్లు తెలిసింది. తీగ దొరికినట్లేనని సీనియర్ అధికారి చెప్పారు. వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సీమకు చెందిన నేతలు విశాఖ కేంద్రంగా భూములు కొనుగోలు చేశారని, కొందరు గిఫ్ట్ డీడ్ల రూపంలో రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని ఫిర్యాదులున్నాయి. సీఎంఓలో కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయరెడ్డి, సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి, ఇతర అధికారులు కొందరు వారి బంధువుల పేరిట భూములు కొనుగోలు చేశారన్న ఫిర్యాదులు అందిన సంగతి తెలిసిందే. భోగాపురం మండలం గుండిగుండం, రామవరం, భోగాపురంలో 120 ఎకరాల అసైన్డ్ భూములను ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి మేనల్లుడు రకరకాల వ్యక్తుల పేరిట కొనుగోలు చేసినట్లు తాజాగా గుర్తించారు. ఒక్క భోగాపురం ఎయిర్‌పోర్టు ఏరియాకు సమీపంలో 90 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇవన్నీ అసైన్డ్ భూములే. నాటి జిల్లా కలెక్టర్ ద్వారా తహసీల్దార్లపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చి అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ ప్రక్రియ శరవేగంగా సాగేలా ఓ విశ్రాంత ఐఏఎస్ గట్టి ప్రయత్నమే చేశారు. అప్పటి సీఎస్ జవహర్‌రెడ్డి.. రిజిస్ట్రేషన్ శాఖను తన వద్ద ఉంచుకున్నారు. తద్వారా అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ ప్రక్రియ బయటకు రాకుండా సాఫీగా సాగిపోయేలా విశాఖ, విజయనగరం కలెక్టర్లు, రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకొచ్చారనే ఫిర్యాదులు తాజాగా ప్రభుత్వానికి అందాయి.

గ్రామాల్లోనూ అన్న క్యాంటీన్లు

- రాష్ట్రంలో వంద క్యాంటీన్లు: మంత్రి నారాయణ

మంగళగిరి, ఆగస్టు 13: గ్రామాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని మంత్రి పి.నారాయణ చెప్పారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోగా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్న హామీ మేరకు సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఆహార పంపిణీ కాంట్రాక్టు దక్కించుకున్న అక్షయపాత్ర వంటశాలలను మంగళవారం ఆయన ఇక్కడ పరిశీలించారు. చంద్రబాబు గురువారం (ఈనెల 15న) గుడివాడలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తారన్నారు. సెప్టెంబరు 5వ తేదీ నాటికి రాష్ట్రంలో మరో 180 క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

పారిశ్రామికం పరుగు!

- రాష్ట్ర వ్యాప్తంగా వంద ఇండస్ట్రియల్ పార్కులు
- మల్లవల్లిలో పూర్తిస్థాయి పనులు
- ఉపాధి కల్పన, సంపద సృష్టి కేంద్రాలుగా పోర్టుల నిర్మాణం: సీఎం చంద్రబాబు



పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, అధికారులు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించే దిశగా టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. తద్వారా ఉపాధి కల్పనతోపాటు, సంపద సృష్టికి మార్గాలను సుగమం చేస్తోంది. ఆక్వా, ఉద్యాన రంగాలతో పాటు ఖనిజ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి పార్కులను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ రంగాలపై ఆయన సమీక్షించారు. ఆక్వారంగానికి, ఉద్యాన పంటల ఉత్పత్తులకు, ఖనిజ ఆధారిత పరిశ్రమలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని సీఎం తెలిపారు. ఈ రంగాలతో పాటు అభివృద్ధికి అవకాశమున్న రంగాలన్నింటిపైనా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక పార్కులు, కొత్తగా ఏర్పాటుకానున్న ఓడరేవులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యాన రంగాలతోపాటు ఖనిజ ఆధారిత పారిశ్రామికాభివృద్ధిపై దృష్టిసారించాలని తెలిపారు. ఈ రంగంలో పరిశ్రమల స్థాపనకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి.. ఔత్సాహికులను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్కో ఇండస్ట్రియల్ పార్కు కనీసం 100 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇలాంటి పార్కులు 100 వరకు ఏర్పాటు చేయాలన్నారు. మహారాష్ట్ర అత్యధిక పారిశ్రామిక పార్కులతో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. ఏపీలో ప్రస్తుతం 53 పార్కులే ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కు పూర్తిస్థాయి కార్యకలాపాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

జిల్లాల గుర్తింపు

రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అవసరమైన జిల్లాలను గుర్తించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ క్రమంలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో సమీకృత ఓడరేవుల అభివృద్ధికి తగిన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశంలో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఉత్తమ పోర్టులపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అతిపెద్ద సముద్రతీర ప్రాంతం ఉన్నందున మరిన్ని పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పీపీపీ విధానంలో పోర్టుల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను గుర్తించాలన్నారు. లాజిస్టిక్ పరమైన రోడ్డు, రైలు కనెక్టివిటీతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంత హింటర్ ల్యాండ్ అనుసంధానంతో కూడిన ఇంటిగ్రేటెట్ ఓడరేవుల నిర్మాణం జరిగినప్పుడే ఎగుమతి ఖర్చులు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సీఎం పేర్కొన్నారు. ఆ దిశగా స్వల్ప, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ పోర్టుల ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలంతా బడుల్లోనే!

- దీనిపై కఠినంగా ఉండండి
- జీవో 117పై నివేదిక ఇవ్వండి
- విద్యార్థులకు స్పోర్ట్స్ రిపోర్టులు
- ప్రతి విద్యార్థికీ ప్రత్యేకంగా ఐడీ
- విద్యాశాఖలో సమూల మార్పులు
- సమీక్షలో సీఎం చంద్రబాబు

క్రీడలకు ప్రాధాన్యం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని సీఎం అన్నారు. ఇకపై విద్యార్థులకు విద్యా రిపోర్టులతో పాటు స్పోర్ట్స్ రిపోర్టులు కూడా అందించాలన్నారు. జీవో 117పై విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. బడుల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఇంగ్లిష్‌తో పాటు మాతృభాష తెలుగుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



విద్యాశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో సమూల మార్పులు జరగాలని, ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యంగా పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖపై ప్రభుత్వం రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, క్షేత్రస్థాయిలో ఆ మేరకు ఫలితాలు కనిపించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌లో మార్పులు చేయాలని సూచించారు. దీనికోసం విద్యారంగ నిపుణులు, మేధావులు, ప్రముఖులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖపై సచివాలయంలో సీఎం మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, బడి ఈడు పిల్లలు బడి బయట ఉండటానికి వీల్లేదని స్పష్టంచేశారు. ఈ విషయంలో కఠినంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలలతో ప్రభుత్వ బడులు పోటీపడాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు వంద శాతం మంది బడుల్లో ఉండాలని, గ్రాడ్యుయేషన్ వరకు పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ప్రతి విద్యార్థికీ ఐడీ ఇవ్వాలన్నారు. కర్నూలు జిల్లాలో వలసల కారణంగా పిల్లలు బడులకు దూరమతున్నారని అధికారులు వివరించగా, వారిని గురుకులాల్లో చేర్పించాలని సూచించారు. డైట్ కాలేజీల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు.

లోకేశ్ ప్రజెంటేషన్

విద్యాశాఖ స్థితిని మంత్రి లోకేశ్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో 44,750 ప్రభుత్వ, 813 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయన్నారు. పది మంది కంటే తక్కువ విద్యార్థులున్న బడులు 5,520, 20 మంది కంటే తక్కువ మంది ఉన్న బడులు 8,702 ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 70,22,060 మంది విద్యార్థులు ఉన్నారని, వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో 35,13,533 మంది, ఎయిడెడ్‌లో 92,579 మంది, ప్రైవేటులో 34,15,948 మంది ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1,87,996 మంది, ఎయిడెడ్‌లో 3,396 మంది టీచర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 2014-19 మధ్య విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చామని, 4,026 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన ఈ కార్యక్రమాన్ని తిరిగి అమలుచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

నైపుణ్య గణనపై..

నైపుణ్య గణనపై అధికారులు సీఎంకు వివరించారు. 1.6 కోట్ల కుటుంబాల్లో 3.54 కోట్ల మంది పనిచేసే వయసున్న ప్రజలున్నారని, వారి నైపుణ్యాలను గణన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'దీనికోసం 40 వేల మంది ఎన్యూమరేటర్లు కావాలి. 8 నెలల సమయం పడుతుంది. కేవలం సర్వేకే 70 రోజులు పడుతుంది. ఇంటింటికీ, మీసేవా కేంద్రాలు, విద్యా సంస్థలు, మొబైల్ యాప్ ఇలా నాలుగు విధానాల్లో గణన చేయొచ్చు' అని తెలిపారు.

చురుగ్గా 'స్టాప్‌లాగ్' పనులు



రాతి కట్టడం కావడం వల్లే స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేయలేదు

» తుంగభద్ర తాత్కాలిక గేటు తయారీలో 60 మంది సిబ్బంది నిమగ్నం

కర్నూలు/బళ్లారి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం 19వ గేటుస్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రాజెక్టు బోర్డు, ఏపీ, కర్ణాటక జలవనరుల అధికారులు, 60మంది నిపుణులైన సిబ్బంది పనుల్లో నిమగ్నమై ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన సాగునీటి ప్రాజెక్టుల గేట్ల నిపుణుడు, సలహాదారు కన్నయ్యనాయుడి పర్యవేక్షణలో హోసహళ్లి వద్ద ఈ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. కొట్టుకుపోయిన పాత గేటు బరువు 45 టన్నులు. వెడల్పు 60 అడుగులు.. ఎత్తు 20 అడుగులు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే స్టాప్‌లాగ్‌ను ఐదు సెగ్మెంట్లుగా తయారు చేస్తున్నారు. ఒక్కో సెగ్మెంట్ 60 అడుగులు వెడల్పు, 4 అడుగులు ఎత్తు, 13 టన్నుల బరువు చొప్పున మొత్తం 20 అడుగుల ఎత్తు, 65 టన్నుల బరువు ఉంటుందని ఇంజనీర్లు అంటున్నారు. ఒక్కో వర్క్‌షాపులో 25-30 మంది వరకు మెకానికల్ సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్కో ఎలిమెంట్‌ను 19వ క్రస్ట్‌గేటు గ్రూవ్(గాడి)లో దించి ఐదు సెగ్మెంట్లను ఒకదానిపై ఒకటి అమర్చుతారు. స్టాప్‌లాగ్ తయారీ, అమర్చడానికి బాగా సమయం పట్టవచ్చని అంటున్నారు. ఈ వారాంతంలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని.. 3-4 రోజుల్లోనే గేటు అమరిక పూర్తిచేయాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని.. వర్షాలు వచ్చి జలాశయం నిండుతుందని, తానే వచ్చి వాయనం సమర్పిస్తానని చెప్పారు. త్వరితగతిన గేటు సిద్ధం కావలసి ఉన్నందున.. పెయింట్ వేయకుండా నేరుగా అమర్చనున్నారు. సమయం వృథా కాకుండా.. అమర్చిన తర్వాతే పెయింట్ వేయాలని నిర్ణయించారు.

స్టాప్‌లాగ్ సిస్టమ్ లేని ఫలితం..

సాధారణంగా ఏ ప్రాజెక్టు నిర్మించినా క్రస్ట్ గేట్లు సహా అత్యవసర పరిస్థితుల్లో మరమ్మతులు చేయాల్సి వస్తే జలాశయంలో నీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేసేందుకు స్టాప్‌లాగ్ ఏర్పాటుకు గేటు దిమ్మెలకు గ్రూవ్‌లు ఏర్పాటు చేస్తారు. తుంగభద్ర డ్యాంకు అలా ఏర్పాటు చేయలేదు. దీంతో గేటు కొట్టుకుపోవడంతో డ్యాంలో నీరు వృథాగా దిగువకు వదిలేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా.. మంగళవారం కర్ణాటక సీఎం సిద్ధూతో పాటు ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, సీపీఐ నేతలు సహా పలువురు డ్యాంను సందర్శించారు. స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలంటే ముందుగా తాత్కాలిక ప్లాట్‌ఫాం నిర్మించాల్సి ఉంది. ప్రజాప్రతినిధుల తాకిడి కారణంగా ఈ పనులకు ఆటంకం కలుగుతోంది. ఇలాగైతే అనుకున్న గడువులోగా మరమ్మతులు చేయలేమని ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. దీంతో బుధవారం నుంచి డ్యాంపైకి ప్రజాప్రతినిధులు సహా ఏ ఒక్కరికీ అనుమతి ఇవ్వబోమని బోర్డు అధికారులు తేల్చిచెప్పినట్లు సమాచారం.



గేటు తయారీలో నిమగ్నమైన కార్మికులు

» దేశంలో ఎక్కడా తుంగభద్ర లాంటి డ్యాం లేదు: కన్నయ్యనాయుడు

రాయదుర్గం, ఆగస్టు 13: తుంగభద్ర జలాశయానికి స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలని గతంలో చాలా ప్రయత్నాలు చేశామని, అయితే రాతితో డ్యాం నిర్మించడంతో ఏర్పాటు చేయలేకపోయామని క్రస్ట్‌గేట్ల నిర్మాణ నిపుణుడు కన్నయ్యనాయుడు తెలిపారు. మంగళవారం డ్యాం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర జలవనరులశాఖ దీనికి స్టాప్‌లాగ్‌లు పెట్టాలని యోచించిందని.. రాతి నిర్మాణం కావడంతో ఒక్క రాయి కదిలినా పూర్తిగా నష్టపోవాల్సి ఉంటుందని గ్రహించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు చెప్పారు. ఇలాంటి సమస్య నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీలోనూ ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీలో, సింగూరులో గేట్లు కొట్టుకుపోతే తానే చేశానని.. 2007లో నారాయణపూర్‌లో గేట్లు రిపేర్ చేశామని, ఇప్పటికీ బాగా పనిచేస్తున్నాయని వివరించారు. తుంగభద్రలో ఈ సమస్య తొలిసారి ఎదురైందన్నారు. చైన్ల మార్పుతో పాటు రోప్‌లకూ మరమ్మతులు చేయాలని జలసంఘానికి ప్రతిపాదించామని చెప్పారు. తమ సూచన ప్రకారం గేట్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేస్తే మరో 30ఏళ్లు ఇబ్బంది ఉండదన్నారు. దేశంలో 60 అడుగుల ఎత్తు ఉన్న డ్యాం ఎక్కడా లేదని, తుంగభద్రకు మాత్రమే ఆ స్థాయి ఉందన్నారు. డ్యాం 33 గేట్లలో మిగిలిన 32 గేట్లకు సంబంధించి కూడా పరీక్షించే విధానాన్ని అధికారులకు తెలియజేశానని.. పరీక్షల అనంతరమే వాటి గురించి చెప్పగలనని చెప్పారు. స్టాప్‌లాగ్ మూడ్రోజుల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.



గేట్ ఏర్పాటుపై మంత్రులు నిమ్మల, కేశవ్‌లకు వివరిస్తున్న గేట్స్ ఎక్స్‌పర్ట్, సలహాదారు కన్నయ్యనాయుడు

ఇంజనీరింగ్ చరిత్రలోనే అద్భుతం

» స్టాప్‌లాగ్‌పై మంత్రి కేశవ్

బళ్లారి/రాయదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేసి ఇంజనీరింగ్ చరిత్రలోనే అద్భుతం సృష్టించబోతున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వేగంగా, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటికి అడ్డుకట్ట వేయడానికి చేస్తున్న ప్రయత్నమని.. ఈ ప్రక్రియలో సాంకేతికంగా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తుంగభద్ర డ్యాంను మంగళవారం ఆయన సందర్శించారు. క్రస్ట్‌గేట్ నిపుణుడు కన్నయ్యనాయుడు, ఇంజనీర్లతో మాట్లాడారు. అనంతరం కేశవ్ విలేకరులతో మాట్లాడారు. 'ఒకవైపు చైన్‌లాక్ తెగిపోయింది. మరోవైపు కౌంటర్ వెయిట్ 30 టన్నుల బరువు గల లాక్‌పైన నిలబడి పోయింది. తొలి సవాల్‌గా పైనున్న బరువును నిదానంగా కిందకు దించుకోవలసి ఉంటుంది. జేఎస్‌డబ్ల్యూ రెండు భారీ క్రేన్లను తీసుకొచ్చి బోర్డు ఆధ్వర్యంలో పని చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చంద్రబాబు, సిద్దరామయ్య సమన్వయంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. గేటు తయారీ బాధ్యతలను నైపుణ్యం గల కంపెనీలకు అప్పగించాం' అని వివరించారు.

అన్ని విధాలా సహకరిస్తాం: నిమ్మల

తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరిస్తామని, పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్టాప్‌లాగ్ గేట్లు లేక పోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసుకోలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గేట్ల అమరికలో నిష్ణాతుడైన కన్నయ్యనాయుడి నేతృత్వంలో పనులు జరుగుతున్నాయి. పోలవరం గేట్ల అమరికలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీకి కూడా గత ఐదేళ్లలో నిర్వహణ పనులు చేపట్టలేదు. రోప్స్, షట్టర్స్, డోర్స్ తుప్పుపట్టి ఊడిపోయే పరిస్థితులు ఉన్నాయి. వాటికి ప్రాధాన్య క్రమంలో మరమ్మతు చేయిస్తాం. త్వరలో సమీక్ష నిర్వహిస్తాం' అని తెలిపారు.

వృథాకు 'స్టాప్'లాగ్!

(మొదటి పేజీ తరువాయి)

నీటిని విడుదల చేశాక స్టాప్‌లాగ్‌ను బిగించవచ్చని జలసంఘం అభిప్రాయపడింది. ఈ ప్రయత్నం విజయవంతమైతే... డ్యామ్‌లో 76.5 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంటుంది. అప్పుడు... 35 టీఎంసీలు కాపాడుకున్నట్లవుతుంది. మరోవైపు, 1621 అడుగుల లెవెల్‌లో తాత్కాలిక గేటు ఏర్పాటు చేయాలని కూడా యోచిస్తున్నారు. అప్పుడు జలాశయంలో 65 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, దాదాపు 25 టీఎంసీల నీటిని ఆదా చేసినట్లు అవుతుందని ఇంజనీర్లు చెబుతున్నారు. మంగళవారం ఉదయం 8గంటల సమయానికి 32,532 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుండగా... 1,09,526 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలంటే... మరో 8.26 అడుగుల మేర నీటిని ఖాళీ చేయాల్సి ఉంటుంది.

కేంద్ర జలసంఘం పర్యవేక్షణ

డ్యాంలో కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు స్థానంలో 'స్టాప్‌లాగ్' బిగింపు ప్రక్రియను జలసంఘం నిరంతరం పర్యవేక్షిస్తోంది. బోర్డు అధికారులు, ఏపీ జల వనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీడీపీవో కుమార్, గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్యనాయుడుతో మంగళవారం చర్చించింది. క్రస్ట్ పైనుంచి 12 అడుగుల మేర ప్రవాహం ఉండగానే స్టాప్‌లాగ్‌ను బిగించేందుకు అధికారులు సిద్ధమవుతుండగా.. జలసంఘం అడ్డుకుంది. ఎలాంటి రిస్క్ వద్దని స్పష్టంచేసింది. హోయిస్ట్ బ్రిడ్జిని ఆధారంగా చేసుకుని పాత గేటు అమర్చిన గ్రూవ్‌లో స్టాప్‌లాగ్‌ను బిగిస్తామని కన్నయ్యనాయుడు చెప్పగా.. జలసంఘం అంగీకరించలేదు. హోయిస్ట్ బ్రిడ్జిని పూర్తిగా తొలగించాలని స్పష్టం చేసింది. స్టాప్‌లాగ్ గేటు బరువు భారీగా ఉన్నందున.. భారీ క్రేన్ల సాయంతో అమర్చాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. 50 టన్నుల భారీ క్రేన్లు వెళ్తే.. 70 ఏళ్లనాటి డ్యాం బ్రిడ్జి తట్టుకుంటుందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తట్టుకుంటుందని అధికారులు భరోసా ఇవ్వడంతో జలసంఘం సమ్మతించింది.



జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శ్రీహరికోటలోని షార్‌లో డిప్యూటీ సీఎం పవన్

శాస్త్రవేత్తలే దేశానికి నిజమైన హీరోలు

» ఇస్రో ప్రస్థానం స్ఫూర్తిదాయకం: పవన్ కల్యాణ్

సూళ్లూరుపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ అంతరిక్ష రంగంలో ఇస్రో ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలోని షార్‌లో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సామాన్యుడు నేడు అనుభవిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాల ప్రతిఫలాల వెనుక ఎంతోమంది శాస్త్రవేత్తల త్యాగం, శ్రమ ఉన్నాయన్నారు. వారి సాహస ప్రయాణం కారణంగానే ప్రజలకు అనేక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాంటి శాస్త్రవేత్తలే దేశానికి నిజమైన హీరోలని కొనియాడారు. దేశం ఏమిచ్చినా వారి రుణం తీరదన్నారు. ఇస్రో ఒకేసారి 104 ఉపగ్రహాలను పంపే స్థాయికి ఎదగడం గొప్ప రికార్డన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచాలన్నారు. అంతరిక్ష పరిశోధనల విజ్ఞానాన్ని పంచుకునేందుకు, యువతకు విలువైన సూచనలు అందించేందుకు ఇస్రోతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకోవాలని భావిస్తున్నానని చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాకెట్ ప్రయోగ వేదికలను సందర్శించారు. కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ సమీద్, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జనరల్ మేనేజర్ శంభుప్రసాద్ పాల్గొన్నారు.

కుల గణనపై గ్రామస్థాయి పోరాటం

» బీజేపీకి రాజ్యాంగంపై గౌరవం లేదు: షర్మిల




న్యూఢిల్లీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కుల గణనపై గ్రామ స్థాయిలో పోరాటం చేయనున్నట్టు కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలనే డిమాండ్‌ను పార్లమెంట్‌లో కాంగ్రెస్ బలంగా లేవనెత్తిందని గుర్తుచేశారు. మంగళవారం ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంట్ సమావేశాలు, కులగణన, వక్ఫ్ చట్ట సవరణ తదితర అంశాలపై చర్చించాం. భవిష్యత్తులో ఏ అంశాలపై ప్రజల్లోకి వెళ్లాలనే అంశంపై అభిప్రాయ సేకరణ జరిగింది. రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవించడం లేదు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పోరాటం చేస్తాం. అదానీ.. ప్రధాని మోదీ బినామీ. మోదీ అవినీతిని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేసేలా కార్యాచరణ చేపట్టబోతున్నాం' అని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.
















19న నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబరు నెల కోటాను టీటీడీ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు తమ పేర్లు, మొబైల్ నంబర్లతో నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను, అలాగే నవంబరు నెలలో 9వ తేదీన నిర్వహించనున్న పుష్పయాగం సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా కూడా విడుదల చేస్తారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లు, మధ్యాహ్నం మూడు గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగుల టోకెన్లు విడుదల చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుమల, తిరుపతిలోని వసతి గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేస్తారు. 27వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ కోటా, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, ఒంటి గంటకు పరకామణి సేవలను కూడా అందుబాటులోకి తీసుకొస్తారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీడీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' నుంచి బుక్ చేసుకోవచ్చు.

అగ్నికీలల్లో డైనో పార్కు

విశాఖ బీచ్‌రోడ్డులో భారీ అగ్నిప్రమాదం

క్షణాల్లో పార్కు మొత్తం బూడిద



మంటల్లో కాలిపోతున్న డైనో పార్కు

ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం

విశాఖపట్నం/ మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో.. మత్స్యదర్శినికి సమీపంలో.. సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌ను ఆనుకుని ఉన్న డైనోపార్కులో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడ పిల్లలు ఆడుకునే ఆటవస్తువులన్నీ ప్లాస్టిక్, ఫైబర్‌వే కావడంతో క్షణాల్లో మంటలు చుట్టుముట్టాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో పాటు, మంటలు ఎగసిపడడంతో బీచ్‌కు వచ్చిన సందర్శకులతోపాటు చుట్టుపక్కల అపార్టుమెంటు వాసులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపుచేసేందుకు యత్నించినప్పటికీ అప్పటికే పార్కులోని వస్తువులన్నీ పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ డైనో పార్కులో చిన్నపిల్లల ఆడుకునేందుకు బేబీ బాల్స్, టాయ్ కార్లు, ట్రైన్స్, ఎయిర్ బౌన్సర్లు, వాటర్ బోట్, 3డి, 9డి ఎమ్యూజ్‌మెంట్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ పిల్లలను ఆడించేందుకు నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బీచ్‌కు వచ్చేసందర్శకులు ఉత్సాహం చూపిస్తారు. దీంతో డైనోపార్క్ నిత్యం సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటుంది. అయితే ఉదయం సమయంలో ప్రమాదం జరగడం.. అక్కడ సిబ్బంది, సందర్శకులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లయింది. అదే సాయంత్రం సమయంలో జరిగి ఉంటే పార్కు నుంచి బయటకు వచ్చేందుకు ఇరుకుమార్గం మాత్రమే ఉండడంతో ప్రమాదం ఊహించని రీతిలో ఉండేది. మరోవైపు డైనోపార్కు లోపల భారీ పరిమాణం కలిగిన ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు, పార్కు బయట సాయంత్రం వేళ ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ విక్రయించే దుకాణాల కోసం నిల్వ చేసిన వంట గ్యాస్ సిలిండర్లు మంటల్లో చిక్కుకున్నప్పటికీ గ్యాస్ లీక్ అవడంగానీ, పేలుడుగానీ సంభవించకపోడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి కారణాలేమిటనేది తెలియాల్సి ఉంది. పార్కు యజమాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ పార్థసారథి తెలిపారు.

ఎమ్మెల్యే జూలకంటికి హైకోర్టులో ఊరట

ఎస్సీ, ఎస్టీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల గ్రామీణ పోలీసులు ఆయన పై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10వేలతో రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. మూడు నెలలు లేదా చార్జిషీట్ దాఖలు చేసేవరకు ప్రతినెలా 1న, 15వ తేదీలలో దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని షరతులు విధించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపా సాగర్ మంగళవారం తీర్పు ఇచ్చారు.

కార్మికుల మరణాలపై సమగ్ర విచారణ చేయాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్రనేత రామకృష్ణ

ధర్నాచౌక్, ఆగస్టు 13: జిల్లాలోని క్వారీ, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు ప్రమాదానికి గురై మరణిస్తున్నా కార్మిక, గనులశాఖ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.రామకృష్ణ ధ్వజమెత్తారు. క్వారీ, ఫ్యాక్టరీల్లో జరుగుతున్న కార్మికుల మరణాలపై సమగ్ర విచారణ చేయాలని, ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ యాజమాన్యాలు సరైన ప్రమాణాలు, సేఫ్టీ పరికరాలు వాడకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో 16 మంది తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చేరితే వారిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడానికి కార్మికశాఖ, ప్రభుత్వం కారణమన్నారు. బీసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరికృష్ణరెడ్డి, షేక్ మీరావలి, ఐఎఫ్‌టీయూ నేతలు బాజీ, కనకరావు, శ్రీను, భాస్కర్, కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

తప్పటడుగులు!

చిన్న వయస్సులోనే మితిమీరిన పరిచయాలతో గర్భం దాలుస్తున్న బాలికలు



- గుండెలు బాదుకుంటున్న తల్లిదండ్రులు
- కఠిన చట్టాలు తెచ్చినా కానరాని మార్పు
- అవగాహన సదస్సులతో మేలు కలిగే అవకాశం

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం: మితిమీరిన పరిచయాలతో బాల్యంలోనే గర్భం దాలుస్తున్న బాలికలను చూసి తల్లిదండ్రులు గుండె లు బాదుకుంటున్నారు. అల్లారుముద్దుగా పెంచుకు న్న తమ కుమార్తెల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడటంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు కఠినతరంగా మారుతున్నా మార్పు కనిపించటం లే దు. ఈ నేపథ్యంలో పలుచోట్ల జరుగుతున్న ఇటువంటి సంఘటనలు నగరానికి మచ్చ తెస్తున్నాయి. నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న బాలిక శాంతినగర్‌కు చెందిన తన స్కూల్‌మేట్‌తో పరిచయమైంది. దీన్ని అలుసుగా తీసుకున్న ఆ బాలుడు.. బాలికను బెదిరింపులకు గురిచేసి వారిళ్లల్లో ఎవరూ లేని సమయంలో శారీరకంగా కలుసుకోవడం మొదలుపెట్టారు. 3 నెలలు తర్వాత బాలిక గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఏపీఎస్ రెడ్డి రోడ్డు ప్రాంతానికి చెందిన మైనర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నెల 3న వీరు పెళ్లి చేసుకుని సోమవారం రైలులో హైదరాబాద్ వెళ్తుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు మైనర్లయిన వీరిద్దరినీ పట్టుకుని నున్న రూరల్ పోలీసులకు అప్పగించారు. అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక ఇంటర్ చదివి ఇంటి వద్దనే ఉంటోంది. స్థానికంగా ఉండే యువకుడు బాలికకు మాయమాటల చెప్పి ప్రేమ పేరుతో ఆకర్షించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఇదే ప్రాంతానికి చెంది న ఓ యువతికి స్థానికంగా ఉండే ఓ వ్యక్తి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఆ చనువుతో యువతి నగ్నచిత్రాలను సేకరించాడు. యువతి తల్లిదండ్రులు ఆమెకు వేరే వ్యక్తితో వివాహం చేయాలని చూడగా అతడు యువతి నగ్నఫొటోలను చూపించి ఆమెను, తల్లిదండ్రులను బెదిరించాడు. దీంతో యు వతి తల్లిదండ్రులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్క అ జిత్‌సింగ్‌నగర్, నున్న రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో నెలకు 50కి పైగా పోక్సో కేసులు నమోదవుతున్నాయి. చిన్న వయస్సులో ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన బాలబాలికలు సెల్‌ఫోన్లు, సినిమాల ప్రభావంతో తమ జీవితాలను అంధకారమయం చేసుకోవడంతో పాటు బాలికల భవిష్యత్తును నమ్ముకుని జీవిస్తున్న తల్లిదండ్రులకు తీరని ఆవేదన మిగులుస్తున్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులూ దృష్టి సారించాలని, ప్రధానంగా యుక్త వయసులో ఉన్నవారి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సైకాలజిస్టులు కోరుతున్నారు.

లైంగిక నేరాలు అరికట్టడంలో విభాగాలు విఫలం

చిన్నారులపై లైంగిక నేరాల నియంత్రణకు ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ వంటి పలు విభాగాలున్నాయి. కానీ ఈ విభాగాలు బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. లైంగిక నేరాల నియంత్రణకు కలెక్టర్ స్థాయి అధికారులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు బాలికలపై లైంగిక దాడుల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలని, అవగాహన సదస్సుల ద్వారా బాలబాలికలను చైతన్యవంతులను చేయాలని, ఆ దిశగా అధికారులు, పాలకులు అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.



చిగురుపాటి విమలను శాలువాతో సత్కరిస్తున్న వెంకయ్యనాయుడు

రహదారి భద్రతపై యువతకు అవగాహన కల్పించాలి

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, ఆగస్టు 13: రహదారి భద్రతపై యువతలో మరింత అవగాహన పెంచాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో సుదీక్షణ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు చిగురుపాటి విమలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రహదారి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుమారుడు సుదీక్షణ్ జ్ఞాపకార్థం అతడి పేరుతో తల్లి విమల స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని ఆయన అభినందించారు. రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాలు అందించడం, రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించడం, ఉచితంగా హెల్మెట్లు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు ఆమె సేవాస్ఫూర్తిని చాటి చెప్తున్నాయన్నారు. రహదారి ప్రమాదాలు ఎంతోమంది తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నాయని, రహదారి నిబంధనలు, భద్రతపై ప్రభుత్వంతోపాటు పౌరసమాజం కూడా యువతలో అవగాహన కల్పించడానికి కృషిచేయాలన్నారు. విమలను స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నట్లు వెంకయ్యనాయుడు చెప్పారు. ట్రస్ట్ సెక్రటరీ చుక్కపల్లి రామకృష్ణప్రసాద్, సీఈవో జంపాల శరత్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వెహికల్స్‌పై ప్రత్యేక వర్క్‌షాప్

ఉంగుటూరు, ఆగస్టు 13: ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో స్థిరపడాలనుకునే యువతకు అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని సిద్ధార్థ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే ధనుంజయ్ అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఈఈఈ విభాగం విద్యార్థులకు ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ)పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథి, రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ధనుంజయ్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, ఈ వాహనాల ఉత్పత్తి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వాలు రాయితీలిస్తూ సహకరిస్తుండటంతో, ప్రపంచవ్యాప్తంగా ఈ వీల రంగం విస్తరిస్తోందన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీలో ఆధునిక సాంకేతికతలు, తాజా పరిణామాలు, పరిశ్రమలోని అవకాశాలు, రాబోయే సవాళ్ల గురించి విద్యార్థులకు వి వరించారు. అనంతరం సిటిక్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక మోడల్ ప్రదర్శనలో వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాల మోడల్స్, వాటి పనివిధానాలు, ప్ర యోజనాలు, డిజైన్లను ప్రదర్శించారు. విద్యార్థులు పరిశీలించి, వాటి రూపకల్పన, ఫంక్షనాలిటీల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్క్‌షాప్‌ను సందర్శించిన కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ తరహా వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు విద్యార్థులకు అవగాహనతో కూడిన సమగ్ర జ్ఞానాన్ని అందిస్తాయని, పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. ఈఈఈ హెచ్‌ఓడీ నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ బైక్ పనితీరును పరిశీలిస్తున్న చైర్మన్ సుంకర రామబ్రహ్మం

ప్రజాస్వామ్యంలో రాచరిక చిహ్నాలకు చోటులేదు: విల్సన్

ధర్నాచౌక్, ఆగస్టు 13: ప్రజాస్వామ్య దేశంలో 'సింగోల్' లాంటి రాజరిక చిహ్నాలు ప్రజల జీవితాల్లోకి ప్రవేశించకూడదని రామన్ మెగసెసె అవార్డు గ్రహిత, సఫాయి కర్మచారి ఆందోళన్ నేత బెజవాడ విల్సన్ తెలిపారు. భారత పార్లమెంట్‌లో 'రాజదండం' స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాలకులు దేశాన్ని తల్లిగా చిత్రించి చేసే తప్పులను ఎత్తిచూని, ఎదిరించే వారి నోరు నొక్కేసే విధానమన్నారు. ప్రస్తుత పాలకులకు స్వాతంత్రం, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. కులం, జాతి అనేవి ప్రజలను కలిపి ఉంచేవిగా బీజేపీ నేతలు పేర్కొనడం దుర్మార్గమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ రాజ్యం మత విశ్వాసాలు, ఆర్థిక అంశాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉండాలనే పద్ధతిలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి సోషల్ ఇంజనీరింగ్ ద్వారా అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోందన్నారు. అందరం కలిసి ఐక్యంగా పోరాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పుడు జవహర్‌లాల్ నెహ్రూకు బహుమతిగా ఇచ్చిన రాజదండాన్ని ఆయన పక్కన పెట్టారన్నారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో అధ్యక్ష తరహా పాలన తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీజేపీని బలపర్చే పార్టీలను వ్యతిరేకించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈసభలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నేత ఆవుల శేఖర్, ముస్లిం నేత మునీర్ అహ్మద్, ఏఐవైఎఫ్ నేతలు లంకా గోవిందరాజులు, షేక్ సుభానీ, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెజవాడ విల్సన్

బెరంపార్క్‌లో నేడు రక్తదాన శిబిరం

వన్‌టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంటింటికీ త్రివర్ణ పతాకాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పున్నమిఘాట్, హరితా బెరంపార్క్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఏపీటూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రెయిన్‌బో బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. 'రక్తాన్ని ఇవ్వు-ప్రాణాన్ని రక్షించు' అనే నినాదంతో సాగే రక్తదాన శిబిరంలో ఔత్సాహికులు పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు 3,303 అడుగుల భారీ జెండాతో తిరంగా ర్యాలీ

భవానీపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లేబర్ కాలనీ సితార సెంటర్ నుంచి కేబీఎన్ కళాశాల వరకు 3,303 అడుగుల భారీ తిరంగ ర్యాలీని బుధవారం ఉదయం నిర్వహించనున్నారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వై సుజనాచౌదరి ఘనంగా ప్రారంభించి, ర్యాలీగా సితార నుంచి సొరంగం మీదుగా కేబీఎన్ కళాశాల వరకు వెళ్లనున్నారు. మహిళలు, విద్యార్థినులు భాగస్వామ్యం వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గొర్రెపాటిని అవమానించవద్దు

● కొప్పల వెలమ నేత పోల జగన్

ధర్నాచౌక్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సాగునీటి వనరుల అభివృద్ధికి నిత్యం శ్రమించిన గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్ నుంచి తొలగించి అవమానించడం రాష్ట్ర ప్రభుత్వానికి సరైంది కాదని కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

వర్గీకరణకు నిరసనగా స్వాతంత్ర దినోత్సవం బహిష్కరణ

● బీడీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి

ధర్నాచౌక్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు, నరేంద్రమోదీ, చంద్రబాబు ప్రభుత్వాల నిరంకుశ చర్యలకు నిరసనగా ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవాన్ని బహిష్కరించాలని దళిత బహుజన పార్టీ (బీడీపీ) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం దళిత జాతులను విచ్ఛిన్నం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. 21న జరిగే భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలన్నారు.

మహిళపై దాడి

● 5 రోజులైనా ఫిర్యాదు తీసుకోని పోలీసులు


అజిత్‌సింగ్‌నగర్: ఆస్తి వివాదం నేపథ్యంలో మహిళపై ఓ వ్యక్తి దాడి చేసి నడిరోడ్డుపై జుట్టు పట్టుకుని చావబాదాడు. ఘటన జరిగి 5 రోజులైనా పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదు. దీంతో ఆ మహిళ అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. స్థానిక లూనా సెంటర్‌లో నడిపెన మహాలక్ష్మీనే మహిళకు ఇల్లు ఉంది. ఈ ఇంటి విషయమై మహాలక్ష్మీకి ఆమె మేనత్త భర్త మట్టా సుబ్బారావుకు మధ్య వివాదం నడుస్తోంది. ఈనెల 8న ఇద్దరికీ వాగ్వాదం జరగ్గా ఆగ్రహానికి గురైన సుబ్బారావు మహాలక్ష్మీపై దాడి చేశాడు. అదేరోజు రాత్రి ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దాడికి పాల్పడిన సుబ్బారావును స్టేషన్‌కు పిలిపించారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు అప్పటి నుంచి ఆమె నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకోవటం లేదు. తనపై దాడి జరిగినప్పుడు సీసీ కెమెరాలో రికార్డయిన ఫుటేజీని స్టేషన్ సీఐకు చూపించేందుకు ప్రయత్నించినా పట్టించుకోవడం లేదని ఆరోపించింది. ఈ విషయంపై స్టేషన్ సీఐ కోమాకుల శివాజీని వివరణ కోరగా ఆమె ఫిర్యాదు విషయం తనకు గుర్తు లేదని, వివరాలుంటే మీరే చెప్పండి విచారణ చేస్తామని పేర్కొనడం గమనార్హం.



తానా వైద్య శిబిరంలో అర్జున్ పరుచూరి

తానా ఆధ్వర్యంలో వైద్య అవగాహన శిబిరం

పెనమలూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో తానా వైద్య అవగాహన శిబిరం విజయవంతంగా జరిగింది. మంగళవారం జరిగిన ఈ వైద్య శిబిరంలో అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న అర్జున్ పరుచూరి విద్యార్థులకు పీసీఆర్‌పై అవగాహన కల్పించి స్వయంగా వారితో ప్రాక్టీస్ చేయించారు. తానా తోడ్పాటుతో సీపీఆర్‌తో పాటు మానసిక ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై అర్జున్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వాడితే వచ్చే దుష్పరిమాణాలను వివరించి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో అర్జున్‌తో పాటు తల్లి డాక్టర్ నాగమల్లిక జాస్తి పాల్గొని విద్యార్థుల ప్రశ్నలకు, సందేహాలను నివృత్తి చేశారు. తానా ఫౌండేషన్ ట్రస్టీ శ్రీనివాస్ ఎండూరి, తానా ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ ఠాగూర్ మల్లినేని, డాక్టర్ ఓకే మూర్తి సహకరించినట్లు తెలిపారు. కిలారు శివకుమార్, హెచ్ఎం దుర్గాభవానీ, ఎంఈవో కనకమహాలక్ష్మి, ఎన్నారై స్థానిక ప్రతినిధి పాలడుగు సుధీర్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్‌ను ఇస్తున్న పెనుమత్స

అన్నక్యాంటీన్లకు రూ.కోటి విరాళం

● దాత పెనుమత్స శ్రీనివాసరాజును అభినందించిన చంద్రబాబు

పాతరాజరాజేశ్వరి పేట: పేదవాడికి అన్నంపెట్టే మంచి కార్యక్రమం మళ్లీ ప్రారంభిస్తున్నామని తెలిసి అన్ని వర్గాల వారు భాగస్వాములవుతుండటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ట్వీట్ చేశారు. ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న అన్నక్యాంటీన్లకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర డెవలపర్స్ సంస్థ అధినేత, నగరానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు మంగళవారం సచివాలయంలో రూ.కోటి చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. రాబోయే ఐదేళ్ల పాటు ఇంతే మొత్తంలో విరాళం అందిస్తానని సీఎంకు శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా పెనుమత్స శ్రీనివాసరాజును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు. తమకున్నదాంట్లో కొంత సమాజానికి ఖర్చు చేయాలనే వారి ఆలోచనలు స్ఫూర్తిదాయకమన్నారు.

నేడు చంద్రబాబుతో ఎన్టీపీసీ చైర్మన్ భేటీ

- పూడిమడక హైబ్రీడ్ విద్యుత్తు ప్లాంటుపై చర్చలు
- ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్స్ బిగింపుపై ఒప్పందం!

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎన్టీపీసీ చైర్మన్ గురుదాస్ సింగ్ బుధవారం భేటీ కానున్నారు. వెలగపూడి సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో విశాఖ పూడిమడకలో ఎన్టీపీసీ స్థాపించనున్న హైబ్రీడ్ సోలార్ విద్యుత్తు ప్లాంట్ స్థాపన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి గురుదాస్‌సింగ్ వివరించనున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూడిమడకలో విద్యుత్తు ప్లాంటు స్థాపన కోసం ఎన్టీపీసీకి భూమి కేటాయించారు. ఇప్పుడు థర్మల్ ప్లాంటు స్థానంలో హైబ్రీడ్ విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేస్తామని ఎన్టీపీసీ ప్రతిపాదించింది. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపైనా సోలార్ విద్యుత్తు ప్యానళ్లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ విధానపరమైన నిర్ణయానికి సహకారం అందించేందుకు ఎన్టీపీసీ విద్యుత్తు ఉద్యోగ నిగమ్ లిమిటెడ్ ముందుకొచ్చింది. దీనిపై రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (ఏపీ జెన్కో) ఎన్టీపీసీ వీవీఎన్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నది. 300 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఒప్పందం జరగనుంది. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ ఖర్చు యూనిట్‌కు రూ.7 వరకూ అవుతుండగా.. ఎన్టీపీసీ వీవీఎన్ఎల్ రూ.4.50కే అందించనుంది. దీనివల్ల ఏడాదికి రూ.180 కోట్లు ఆదా అవుతుంది. ఈ ఒప్పందం 25 ఏళ్ల పాటు అమలులో ఉంటుంది.

ఉన్నత విద్యకు సింగపూర్ సహకారం

- లోకేశ్‌ను కలిసి యూనివర్సిటీ ప్రొఫెసర్



రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో మెరుగైన విద్యా ప్రమాణాలు, ర్యాంకింగ్స్ మెరుగుదల, సంస్కరణల అమలుకు సహాయ సహకారాలు అందిస్తామని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ బీవీఆర్ చౌదరి అన్నారు. మంగళవారం ఉండవల్లిలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కలిసి, రాష్ట్రంలోని యూనివర్సిటీల పనితీరు మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంతర్జాతీయ గుర్తింపు తేవడానికి పాఠ్యాంశాల్లో మార్పులు, ఇతర విధానాల విషయంలో ఏపీతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సింగపూర్ విద్యా విధానాలపై అధ్యయనానికిఆహ్వానించారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి ప్రణాళికలు

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)లను పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తేవాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఎఫ్‌పీవోల బలోపేతంపై మంగళవారం మంగళగిరి వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి 478ఎఫ్‌పీవోలు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం 986ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేసింది. కానీ వీటిలో చాలా ఎఫ్‌పీవోలు పని చేయడం లేదు. పని చేసేవి కూడా మెరుగ్గా లేవు. అందువల్ల ఎఫ్‌పీవోలపై త్వరలో రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, ఎఫ్‌పీవో పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని, ఈ పనిని మార్క్‌ఫెడ్‌కు అప్పగించాలని నిర్ణయించారు.

122 మంది తెలంగాణ ఉద్యోగుల రిలీవ్

అమరావతి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానికత ఉండి ఏపీలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన అనంతరం కమలనాథన్ కమిటీ సిఫారసుల మేరకు చట్టబద్ధంగా ఆంధ్రాలో 122 మంది పనిచేస్తున్నారు. వారి కుటుంబాలు తెలంగాణలో ఉన్నాయి. దీంతో తమను తెలంగాణకు పంపేయాలని చాలా ఏళ్లుగా ఆ ఉద్యోగులు ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వీరి మొర ఆలకించి ఆ 122 మందిని వారి కుటుంబాలకు దగ్గర చేసింది.

వక్ఫ్ బిల్లు జేపీసీ చైర్మన్‌గా జగదాంబికా పాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వక్ఫ్ బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి చైర్‌పర్సన్‌గా లోక్‌సభ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత జగదాంబికా పాల్ నియమితులయ్యారు. వక్ఫ్ బోర్డు అపరిమిత అధికారాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించాయి. మత స్వేచ్ఛను హరిస్తున్నారంటూ ఆందోళనను వ్యక్తం చేశాయి. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును పునఃపరిశీలన జరిపేందుకు 31 మంది సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించింది. ఇందులో 21 మంది లోక్‌సభ సభ్యులు 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఈ జేపీసీకి చైర్‌పర్సన్‌గా లోక్‌సభ సీనియర్ ఎంపీ జగదాంబిక పాల్‌ను నియమిస్తూ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. 73 ఏళ్ల జగదాంబికా పాల్ ఉత్తరప్రదేశ్ నుంచి 4 సార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు.

ఎంపీఏటీజీ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ (ఎంపీఏటీజీఎం)ను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఈ తేలికపాటి ట్యాంకు విధ్వంసక ఆయుధ వ్యవస్థను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం పరీక్షించినట్లు సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. రాత్రివేళల్లో సైతం ప్రయోగించడానికి వీలుగా దీన్ని రూపొందించారు. 15 కిలోల కంటే తక్కువ బరువు ఉండే ఈ క్షిపణిని బలగాలు మోసుకెళ్లడం సులభం. భుజంపై నుంచి శత్రు దేశాల ట్యాంకులు, ఆయుధాలను తరలించే వాహనాలపైకి ప్రయోగించవచ్చు. భవిష్యత్తులో దీన్ని ప్రధాన యుద్ధ ట్యాంకు అర్జున్‌లో కూడా అమర్చనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉప్పు... చక్కెరలో మైక్రోప్లాస్టిక్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 13: భారతీయ ఉప్పు, చక్కెర బ్రాండ్లు అన్నీ మైక్రోప్లాస్టిక్స్‌ను కలిగి ఉన్నాయని మంగళవారం ప్రచురితమైన ఓ అధ్యయనం పేర్కొంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా, ప్యాకింగ్ చేసినవి, చేయనివి... ఇలా అన్నింట్లోనూ ఇవి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని స్పష్టం చేసింది. పర్యావరణ పరిశోధన సంస్థ టాక్సిక్స్ లింక్ 'మైక్రోప్లాస్టిక్స్ ఇన్ సాల్ట్ అండ్ షుగర్' పేరిట ఈ అధ్యయనం నిర్వహించింది. దీనిలో భాగంగా టేబుల్ సాల్ట్, రాతి ఉప్పు, సముద్రపు ఉప్పు, స్థానిక ముడి ఉప్పు సహా 10 రకాల ఉప్పులతో పాటు ఆన్‌లైన్‌లో, స్థానిక మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఐదు రకాల చక్కెర నమూనాలను పరీక్షించారు.

అంగారకుని గర్భంలో మహా సముద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 13: అంగారక గ్రహం గర్భంలో భారీ నీటి నిల్వలతో ఓ మహా సముద్రం ఉన్నట్టు నాసా శాస్త్రవేత్తలు గుర్తించారు. నాసాకు చెందిన మార్స్ ఇన్‌సైట్ ల్యాండర్ 2018-22 మధ్యలో అంగారకుని గర్భం లోపల ఏర్పడిన 1319 ప్రకంపనలను గుర్తించి పంపిన సమాచారాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు నీటి నిల్వలు ఉన్నట్టు నిర్ధారించారు. అంగారకుని ఉపరితలం నుంచి దాదాపు 20 కిలోమీటర్ల లోతులో నీళ్లు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్

బెంగళూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీటీయూ) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అంతరిక్ష పరిశోధనను మరోస్థాయికి తీసుకెళ్లిన ఘనత సోమనాథ్‌కు దక్కుతుందని గవర్నర్ కొనియాడారు. చంద్రయాన్-3 విజయవంతంతో ప్రపంచమంతా సోమనాథ్ కృషిని కొనియాడిందని గుర్తుచేశారు. కర్ణాటకలో విద్య, సాంకేతిక రంగం దేశంలోనే ముందంజలోనే ఉందని తెలిపారు. అందుకే స్టార్టప్ హబ్‌గా విరాజిల్లుతోందని కొనియాడారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వీటీయూ వీసీ విద్యాశంకర్, ధారవాడ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పీఎల్ పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సోమనాథ్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

రెవెన్యూలో వేధింపుల పర్వం!

- నిబంధనలు గుర్తుచేసిన మహిళా అధికారిపై పగ
- రీసర్వేలో తప్పులు వచ్చాయన్నందుకే!
- సర్వే రాళ్లపై జగన్ బొమ్మ వద్దన్నందుకు కన్నెర్ర
- ల్యాండ్ టైటిల్ చట్టంపై విభేదించిన డిప్యూటీ డైరెక్టర్
- శాఖ నుంచి మరో విభాగానికి బదిలీ
- ఇప్పుడు పదోన్నతుల సమయంలో ఆ జీవో తెరపైకి
- ఇద్దరు ఐఏఎస్ అధికారుల కక్షసాధింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ, సర్వే శాఖలో వేధింపుల పర్వం పరాకాష్ఠకు చేరుకుంది. సర్వే రాళ్లు, రోవర్ల కొనుగోలులో నిబంధనలు పాటించాలని ఫైలుపై రాసినందుకు ఓ మహిళా అధికారిని సంబంధం లేని కేసులో ఇరికించారు. 2009లో జరిగిన ఘటనకు ఆమెను బాధ్యురాలిని చేస్తూ ఏకంగా 14 సంవత్సరాల తర్వాత 2023 నవంబరులో అభియోగాలు నమోదు చేశారు. అప్పటికీ ఆమెకు ఆ ఉత్తర్వులు ఇవ్వకుండా గుట్టుగా దాచేశారు. తీరా పదోన్నతులకు రంగం సిద్ధమైన సమయంలో ఇప్పుడు వాటిని ఆమెకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. శాఖలో ఇద్దరు ఐఏఎస్ అధికారుల వైఖరి ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. సర్వేశాఖలో ఝాన్సీరాణి డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో భూముల రీసర్వే మొదలుపెట్టినప్పుడు ఆమె హెడ్‌క్వార్టర్స్ డీడీగా ఉన్నారు. తక్కెళ్లపాడు పైలెట్ ప్రాజెక్టులో తప్పులు వచ్చాయని, వాటిని సరిచేయాలని కోరారు. సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు వద్దని, ఆయన పేరు వేయడం సర్వే, సరిహద్దుల చట్టం-1921కి విరుద్ధమని ఫైల్‌పై రాశారు. రోవర్లు, డ్రోన్‌ల కొనుగోలు టెండర్లలో అర్హత లేని కంపెనీల నుంచి బిడ్‌లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని నోట్‌ఫైలుపై రాశారు. రీసర్వే అనంతరం ఇచ్చే పాస్‌పుస్తకాల ముద్రణను జగన్ సలహాదారు స్నేహితుడికి చెందిన గుంటూరు ప్రెస్‌కు ఇవ్వకూడదని, మద్రాస్‌లోని సెక్యూరిటీ ప్రెస్‌కే ఇవ్వాలని, దీనివల్ల భూముల సమాచారం సురక్షితంగా ఉంటుందని స్పష్టంగా చెప్పారు. ఇవేవీ నాటి సర్వే ఉన్నతాధికారికి నచ్చలేదు. దీంతో ఆమెను రీసర్వే బాధ్యతల నుంచి తప్పించారు. ఆ తర్వాత టైటిల్ చట్టం రూపకల్పనపై కూడా ఆమె విభేదించారు. ముందుగా న్యాయశాఖ ఆమోదం తీసుకోవాలని, ఇందులో న్యాయనిపుణులను భాగస్వాములను చేయాలని కోరారు. దీంతో ఆమెను సర్వేశాఖ నుంచే తప్పించి ఫారిన్ సర్వీసు కింద మరో విభాగానికి పంపించారు.

పాత ఫైళ్లు తిరగదోడి అభియోగాలు

భూముల రీసర్వే, టైటిల్ చట్టంపై గతేడాది నవంబరు నాటికి టీడీపీ, జనసేన పార్టీలు తీవ్ర ఆందోళన చేస్తున్నాయి. దీనంతటికీ కారణం ఎవరంటూ జగన్ సర్కారు పలువురు అధికారులను టార్గెట్ చేసింది. వారిలో ఝాన్సీ కూడా ఒకరు. దీంతో ఆమెకు సంబంధించిన పాత ఫైళ్లను శోధించారు. చివరకు 2009లో రాయలసీమ ఆర్‌డీడీ హోదాలో కడప జిల్లాలోని ఓ సర్వేయర్‌పై సకాలంలో నివేదిక ఇవ్వలేదన్న కారణాన్ని బూచిగా చూపడానికి రంగం సిద్ధం చేశారు. 14 ఏళ్ల తర్వాత అంటే 2023, నవంబరు 14న ఆమెపై విధి నిర్వహణలో నిర్లక్ష్యం కింద అభియోగాలు మోపుతూ జీఓ 1042 జారీ చేశారు. ఆ ఉత్తర్వును ఆమెకు వెంటనే అందించాలి. కానీ అధికారులు ఆ పని చేయలేదు. ఆ జీఓను ఇతర ఉత్తర్వుల మాదిరిగానే గోప్యంగా దాచేశారు. సరైన సమయంలో దానిని ఓ అస్త్రంగా వాడుకోవాలని భావించారు.

పదోన్నతుల సమయంలో కక్ష సాధింపు

సర్వేశాఖ పదోన్నతుల కమిటీ (డీపీసీ) తాజాగా సీనియారిటీ జాబితాను రూపొందించింది. సీనియర్ అధికారి ఝాన్సీకి జాయింట్ డైరెక్టర్ (జేడీ)గా పదోన్నతి రావాల్సి ఉంది. సరిగ్గా ఈ సమయంలో ఆమెపై గత నవంబరులో ఇచ్చిన అభియోగాల జీఓను తెరపైకి తీసుకొచ్చారు. ఉత్తర్వు ఇచ్చిన 11 నెలల తర్వాత అంటే, ఈ నెల 10న ఆమెకు ఆ జీఓను అందించేందుకు (సర్వ్) సిద్ధమయ్యారు. ఈ ఏడాది జనవరిలోనే ఝాన్సీకి జీఓ 1042ను అందించామని చెప్పుకోవడానికి యాంటీ డేట్ (పాత తేదీ)తో కవరింగ్ లెటర్ సృష్టించి దాన్ని ఆమెకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. కవరింగ్ లేఖలో సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అని ఉంది. కానీ సంతకం సర్వే జేడీ ప్రభాకర్‌రావు అని ఉంది. వాస్తవానికి ఈ ఇద్దరూ ప్రస్తుతం సర్వేశాఖలో లేరు. సర్వే కమిషనర్‌గా ఉన్న సిద్ధార్థ్ జైన్ బదిలీ అయ్యారు. జేడీ ప్రభాకర్‌రావు రిటైర్ అయ్యారు. ఈ విషయం బయటపడితే శాఖలో ఉద్యోగులే నవ్వుకుంటారన్న ఇంగితం కూడా లేకుండా పాత తేదీతో జీఓను అందించామనే తప్పుడు ప్రయత్నాలు చేస్తున్నారు. విధి నిర్వహణలో సకాలంలో చర్యలు తీసుకోలేదన్న అభియోగం మోపిన అధికారులు... ఆమెకు ఇంత ఆలస్యంగా జీఓను ఎలా అందించాలనుకుంటున్నారు? సమయానుకూల నిర్ణయాలు వీరికి వర్తించవా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇవన్నీ వేధింపులకు పరాకాష్ఠ అని తోటి అధికారులే చెబుతున్నారు. ఝాన్సీరాణికి పదోన్నతి ఇవ్వాలని 2019లోనే జగన్ సర్కారును హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికీ ఆ ఉత్తర్వును అమలు చేయలేదు. హైకోర్టు ఆదేశాన్ని అమలు చేయకపోగా, తిరిగి కౌంటర్ దాఖలు చేయని అధికారుల అసమర్థతపై చర్యలు లేవు. కానీ ఓ మహిళా అధికారి ప్రయోజనాలను అడ్డుకునేందుకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఆరాటపడుతుండటం ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కార్మికులు లేకుండానే వారి పేరిట జీతాలు

- రూ.4కోట్లు కొట్టేసిన వైసీపీ నేతలు
- గుంటూరు కార్పొరేషన్‌లో భారీ స్కామ్
- విచారణకు టీడీపీ, జనసేన డిమాండ్

గుంటూరు, ఆగస్టు 13: కార్మికులు లేకపోయినా వారి పేరుతో జీతాలు డ్రా చేశారు. 300 మంది కార్మికుల పేరుతో తొమ్మిది నెలలు జీతాలు డ్రా చేసుకుని రూ.4కోట్లు బొక్కేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో జరిగిన ఈ కుంభకోణం తీవ్ర కలకలం రేపుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కరోనా సమయంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తాత్కాలికంగా ఔట్ సోర్సింగ్ పద్ధతిన 300 మంది పారిశుధ్య కార్మికులను అదనంగా పనిలోకి తీసుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వారిని నియమించినట్లు పేపర్లపై చూపారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.15 వేలు జీతంగా నిర్ధారించారు. జీతాన్ని వారు పేర్కొన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఖాతాలో జమ చేయడం ద్వారా కుంభకోణానికి తెరతీశారు. తాత్కాలిక ప్రాతిపదికన కరోనా నేపథ్యంలో తీసుకున్న 300 మంది పారిశుధ్య కార్మికులను 2021 ఆగస్టుతో తొలగించారు. అయినప్పటికీ వారు విధుల్లో ఉన్నట్లుగానే చూపుతూ 2022 మే నెల వరకు వారి పేరుతో కార్పొరేషన్ నుంచి జీతాలు డ్రా చేశారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.15 వేల చొప్పున 300 మందికి నెలకు రూ.45లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా 2021 సెప్టెంబరు నుంచి 2022 మే నెల వరకు 300 మంది పేరుతో నెలకు రూ.45 లక్షల చొప్పున 9 నెలల పాటు రూ.4కోట్లకు పైగా కార్పొరేషన్ సొమ్మును వైసీపీ నేతలు కొట్టేసినట్లు తెలుస్తోంది. ప్రతి నెలా అదే విధంగా విధుల్లో లేని కార్మికుల పేరుతో జీతాలు డ్రా చేస్తుండగా 2022 ఏప్రిల్ నెలలో విధుల్లో చేరిన కొత్త కమిషనర్ జీతాలకు సంబంధించి డ్రా చేస్తున్న బిల్లులపై అనుమానం వ్యక్తం చేసి ప్రశ్నించడంతో వైసీపీ నేతలు తేలు కుట్టిన దొంగల్లా చల్లగా జారుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన వైసీపీ నేతలు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విపక్ష టీడీపీ, జనసేన నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా కావటి మనోహర్ నాయుడు కొనసాగుతున్నారు. ఇరువురు డిప్యూటీ మేయర్‌లు కూడా వైసీపీ వారే ఉన్నారు.

ప్రత్యేక చట్టాల కేసుల్లోనూ బెయిల్

- అసాధారణ పరిస్థితుల్లోనే జైలుకు పంపాలి: సుప్రీం



న్యూఢిల్లీ, ఆగస్టు 13: 'బెయిల్ ఇవ్వడమనేది ఓ నిబంధన..జైలుకు పంపడమనేది ఓ అసాధారణ సందర్భం..ప్రత్యేక చట్టాలకూ ఇది వర్తిస్తుంది' అని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద అరెస్టయిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టైన్ జార్జ్ మాసిష్ ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. "అర్హత ఉన్న కేసుల్లోనూ కోర్టులు బెయిల్ నిరాకరిస్తూ పోతే రాజ్యాంగం గ్యారెంటీ ఉన్న ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతుంది. ప్రాసిక్యూషన్ చేసిన ఆరోపణలు ఎంత తీవ్రమైనవైనా కావొచ్చు..బెయిల్‌పై చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సిన విధి కోర్టులది.." అని స్పష్టం చేసింది. 'ఉపా' చట్టం ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న బిహార్‌కు చెందిన జలాలుద్దీన్ ఖాన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. తన ఇంటి పైఅంతస్తును నిషేధిత పీఎఫ్ఐ సంస్థ సభ్యులకు అద్దెకు ఇచ్చారంటూ ఎన్ఐఏ జలాలుద్దీన్‌పై కేసు పెట్టింది. 2022 జూలైలో ప్రధాని మోదీ పర్యటనలో అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తున్నారంటూ పోలీసులు జలాలుద్దీన్ ఇంట్లో సోదాలు చేశారు. అనంతరం ఎన్ఐఏ దర్యాప్తును చేపట్టింది. ఇలాంటి కేసుల్లోనూ నిందితులకు బెయిల్ ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

బాబా రాందేవ్‌పై కోర్టు ధిక్కరణ కేసు మూసివేత

న్యూఢిల్లీ, ఆగస్టు 13: యోగా గురు బాబా రాందేవ్, ఆయన సహాయకుడు, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణ, పతంజలి సంస్థపై దాఖలయిన కోర్టు ధిక్కరణ కేసును మూసివేస్తున్నట్టు మంగళవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చారన్న కేసులో వారు సమర్పించిన క్షమాపణలను ఆమోదించినట్టు తెలిపింది. వారిచ్చిన లిఖితపూర్వక హామీలను పరిగణనలోకి తీసుకొని కేసును క్లోజ్ చేసిందని వారి తరఫు న్యాయవాది గౌతమ్ తాలూక్‌దార్ చెప్పారు. ఈ కేసులో ధర్మాసనం మే 14న తీర్పును వాయిదా వేసింది. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది. ఆధునిక వైద్యానికి, కరోనా వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారంటూ బాబా రాందేవ్‌పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ జరుగుతున్న క్రమంలోనే ఔషధాల సామర్థ్యంపై తప్పుడు ప్రకటనలు ఇవ్వబోమంటూ పతంజలి సంస్థ 2023 నవంబరు 21న కోర్టుకు లిఖితపూర్వకంగా అఫిడవిట్ సమర్పించింది. దీన్ని ఉల్లంఘించి మళ్లీ ప్రకటనలు ఇచ్చారంటూ ఫిర్యాదు అందడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 24న సుప్రీంకోర్టు.. పతంజలి సంస్థకు నోటీసు ఇచ్చింది. దీంతో పతంజలి సంస్థ అఫిడవిట్‌లో సుప్రీంకు క్షమాపణలు చెప్పింది.

150 కోట్ల ఇండియా!

న్యూఢిల్లీ, ఆగస్టు 13: వంద కోట్ల భారత్ కాదు. ఇప్పుడిక 150 కోట్ల ఇండియా. ఇందుకోసం మరో పుష్కర కాలం ఆగితే చాలు. అప్పటికి మన దేశ జనాభా 150 కోట్లు దాటేయనుంది. అలాగే మహిళా సంఖ్య కూడా స్వల్పంగా పెరగనుంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2036 నాటికి భారత దేశ జనాభా 152.2 కోట్లకు చేరనుంది. అలాగే, మహిళల సంఖ్య కూడా 48.5 శాతం (2011) నుంచి 48.8 శాతానికి పెరగనుంది. భారత్‌లో మహిళలు, పురుషులు-2023 పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో 2011-2036 మధ్య కాలంలో 15 ఏళ్లలోపు వ్యక్తుల సంఖ్య బాగా తగ్గిపోనుంది. అదే సమయంలో 60 ఏళ్లు ఆపై వయసుగల వారి సంఖ్య పెరుగనుంది. ఇక మహిళలు-పురుషుల నిష్పత్తిలో కూడా 2011 లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 943 మంది స్త్రీలు ఉంటే 2036 నాటికి అది 952కు చేరనుంది.

ఆ 50 కోట్లు ఎలా ఇచ్చారు?

- 'ఎడెక్స్'పై విజిలెన్స్ విచారణ!
- ఉన్నత విద్యామండలిలో తనిఖీలు
- ఎవరెవరు సంతకాలు చేశారని ఆరా
- ఎన్నికలకు ముందు ఒప్పందం
- సొమ్ము మొత్తం ఒకేసారి చెల్లింపు
- కమీషన్లు అందినట్లు ఆరోపణలు
- వైస్ చైర్మన్‌ను నివేదిక కోరిన విజిలెన్స్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు విదేశీ కోర్సుల పేరుతో ఎడెక్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎలాంటి టెండర్లూ లేకుండానే అప్పనంగా రూ.50 కోట్లు చెల్లించడంపై విజిలెన్స్ విచారణకు నిర్ణయించినట్లు తెలిసింది. సోమవారం ఉన్నత విద్యామండలిలో విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎడెక్స్ ఒప్పందం గురించి ఆరా తీశారు. ఈ ఒప్పందం చేసుకోవడానికి ప్రధాన కారణం ఎవరు? ఎవరెవరు సంతకాలు చేశారు? టెండర్లు ఎందుకు పిలవలేదు? అంతిమంగా దీనివల్ల విద్యార్థులకు కలిగిన ప్రయోజనమెంత? అనే కోణాల్లో వివరాలు సేకరించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పి.ఉమామహేశ్వరి దేవిని దీనిపై విజిలెన్స్ విభాగం నివేదిక కోరింది. దీంతో ఉన్నత విద్యామండలి అధికారులు అప్రమత్తమయ్యారు. ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు. మండలి కార్యదర్శి దీనిని గోప్యంగా ఉంచాలనే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఎడెక్స్‌పై ఎలాంటి విచారణా లేదని, రొటీన్‌గా తమ ఆఫీసుకు విజిలెన్స్ అధికారులు వచ్చి వెళ్లారని దాటవేసే ప్రయత్నం చేశారు.

ఏమిటీ ఒప్పందం?

రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లోని ప్రముఖ కోర్సులను అందిస్తామని అప్పటి సీఎం జగన్ ప్రకటించారు. దాదాపు 2వేల రకాల విదేశీ యూనివర్సిటీల కోర్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. సీఎం ఆదేశించడంతో ఉన్నత విద్యామండలి అధికారులు ఆగమేఘాలపై ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఆ కంపెనీ విదేశీ యూనివర్సిటీలకు, ఇక్కడి విద్యార్థులకు మధ్య వారధిగా ఉంటుంది. ఇందుకోసం ఆ కంపెనీకి రూ.49.9 కోట్లు చెల్లించాలనేది ఒప్పందం. అది కూడా విడతలవారీగా కాకుండా ఒక్కసారిగా మొత్తం చెల్లించాలని ఆ కంపెనీ షరతు విధించడంతో మండలి అధికారులు ఆ డబ్బు చెల్లించేశారు. మరోవైపు ఈ కంపెనీని ఏకపక్షంగా ఎంపిక చేశారు. ముందుగానే ఎడెక్స్ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. దాంతో ఆగమేఘాలపై ఒప్పందం జరిగిపోయింది.

ఏడాదికి 4 లక్షల లైసెన్సులు ఎడెక్స్ కంపెనీ ఇస్తుంది. వాటి ద్వారా విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల కోర్సులు నేర్చుకోవచ్చు. వాటిని నేర్చుకున్న విద్యార్థులకు ఆ సర్టిఫికేషన్ ఇస్తారు. ఉన్నత విద్య సర్టిఫికెట్లకు ఇది అదనంగా ఉంటుంది. తద్వారా విద్యార్థులు విదేశీ ఉద్యోగాలు పొందుతారని అప్పటి ప్రభుత్వం ప్రచారం చేసింది. విదేశీ కోర్సులు అనగానే విద్యార్థులు అద్భుతంగా ఉంటాయని ఊహించారు. తీరా చూస్తే ఇక్కడ ఉన్న కోర్సులే ఆ యూనివర్సిటీల ద్వారా అందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, స్టాక్ ఎక్ఛేంజ్, వెల్త్ మేనేజ్‌మెంట్‌లాంటి కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అవన్నీ ఇక్కడ అనేక రూపాల్లో అందుబాటులో ఉన్నాయి. మరోవైపు విదేశీ ఫ్యాకల్టీ బోధిస్తారా అంటే అదీ లేదు. రికార్డు చేసిన వీడియోలు చూసి విద్యార్థులు నేర్చుకునే విధానం తీసుకొచ్చారు. దీంతో వాటి వల్ల పెద్దగా ఉపయోగం లేదని తేలిపోయింది. అందుకే హాటికేకుల్లా విద్యార్థులు ఆ లైసెన్సులను ఉపయోగించుకుంటారు అనుకుంటే 69 వేల లైసెన్సులు మిగిలిపోయాయి. వాటిని తీసుకోవాలంటూ ఉన్నత విద్యామండలి అధికారులు ఇటీవల విద్యార్థులపై ఒత్తిడి చేశారు. ఎలాగైనా ఎడెక్స్ అద్భుతం అని చూపించే ప్రయత్నం చేశారు. కానీ, ఇందులో ఏం లేదని ప్రభుత్వ అంచనాలో తేలిపోయింది.

ఎవరెవరికి కమీషన్లు వెళ్లాయి?

ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సహా అనేక మంది అధికారులకు ఇందులో భాగస్వామ్యం ఉంది. మండలి వైస్ చైర్మన్ల నుంచి పలువురు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. దీంతో ఈ ఒప్పందంలో పాలుపంచుకున్న వారందరి వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ఎవరెవరికి కమీషన్లు వెళ్లాయనే దానిపైనా విచారణ చేయనున్నారు. ఏకపక్షంగా ఒప్పందం చేసుకున్నందువల్ల ఎంత మందికి ఆర్థిక లబ్ధి చేకూరిందో తేల్చనున్నారు. తొలుత విజిలెన్స్ విచారణ ద్వారా నిజాలు వెలుగులోకి తీసుకొచ్చి, ఆ తర్వాత చర్యలు చేపట్టాలని భావిస్తోంది. ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం నియమించిన అధికారులే మండలిలో ఉండటంతో దీనిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారనే అనుమానాలు నెలకొన్నాయి.



గుంటూరులో నిరసన చేపట్టిన జూనియర్ డాక్టర్లు


కోల్‌కతా ఆసుపత్రి పరిస్థితులే ఏపీలోనూ ఉన్నాయి!

- మహిళా ట్రైనీ పీజీలు, ఇంటర్న్‌షిప్‌లో ఉన్నవాళ్లకు రక్షణ కల్పించాలి
- జాతీయ స్థాయిలో సీపీఏ చట్టం అమలు చేయాలి
- జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్
- గుంటూరులో ఓపీ, ఎలెక్టివ్ సేవల బహిష్కరణ

గుంటూరు (మెడికల్) ఆగస్టు 13: 'కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ఉన్న పరిస్థితులే మన దగ్గర నెలకొన్నాయి. మహిళా ట్రైనీ పీజీలు, ఇంటర్న్‌షిప్‌లో ఉన్నవారు భయంతో విధులు నిర్వహిస్తున్నారు. మహిళా వైద్య విద్యార్థుల వసతి గృహాల దగ్గర రాత్రుళ్లు అపరిచిత యువకులు తచ్చాడుతున్నారు. వీరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. జాతీయ స్థాయిలో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ఫర్ డాక్టర్స్‌ను అమలు చేస్తేనే జూడాలకు తగిన రక్షణ ఉంటుంది' అని ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆజుడా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెండేల దీక్షిత్ అన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ట్రైనీ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటనను ఖండిస్తూ, ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) పిలుపు మేరకు మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్లు ఓపీ, ఎలెక్టివ్ విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. శిబిరంలో జూడాలను ఉద్దేశించి దీక్షిత్ మాట్లాడుతూ మహిళా ట్రైనీ పీజీలే కాదు.. రాష్ట్రంలో ఏ ఒక్క యువతీ అత్యాచారానికి గురి కాకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. సీపీఏ చట్టం అమలుల్లోకి వస్తేనే డాక్టర్లకు రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. కాగా జూనియర్ డాక్టర్ల ఆందోళనకు వైద్య బోధన సిబ్బంది తమ మద్దతు తెలిపారు. జూడాలకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరుకావాలని వారు నిర్ణయించారు. కోల్‌కతాలో ట్రైనీ పీజీ విద్యార్థిని హత్యాచారం ఘటనపై మంగళవారం లక్షల సంఖ్యలో వైద్య విద్యార్థులు ఎక్స్ వేదికగా నిర్భయ 2.0 హ్యాష్‌ట్యాగ్ పేరిట వైరల్ చేశారు. ఫోర్డా ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టిన జూనియర్ డాక్టర్లు సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటనను టాప్ ట్రెండ్‌లో నిలిపారు.

ఉపాధి కోసం వెళ్లి.. పరాయిదేశంలో ప్రాణాలు వదిలి!

- కడసారి చూపునకు నోచుకోని తల్లిదండ్రులు



మృతిచెందిన శివనారాయణ

పెద్దదోర్నాల, ఆగస్టు 13: ఉన్నత ఉద్యోగం సంపాదించాలని పరాయి దేశానికి వెళ్లిన యువకుడు అక్కడే కన్నుమూశాడు. కుమారుడు మృతిచెందాడని తెలిసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. బిడ్డ భౌతికకాయం ఇక్కడికి వస్తుందో? లేదో?, ఇప్పటికే అక్కడే అంతిమ సంస్కారాలు పూర్తి చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషాదఘటన శనివారం చోటుచేసుకోగా, మంగళవారం వెలుగు చూసింది. ప్రకాశం జిల్లా పెదదోర్నాల మండలంలోని హసనాబాద్‌కు చెందిన ఒంటేరు చిన గురవయ్యకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. చినగురవయ్య మేకలు, గొర్రెలు కాస్తూ శివనారాయణ(31)ను చదివించాడు. బీటెక్ పూర్తిచేసుకున్న శివనారాయణ కొంతకాలం బెంగళూరులో ఉద్యోగం చేశాడు. తర్వాత ఇతర దేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఏజెంట్ల ద్వారా 'రిపబ్లిక్ ఆఫ్ అర్మేనియా'కి వెళ్లాడు. రోజూ తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసేవాడు. ఉన్నట్టుండి ఈ నెల 8న తనకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని, ఆరోగ్యం బాగాలేదని హాస్పిటల్‌లో చేరానని చెప్పాడు. ఆతర్వాత 10వ తేదీన అతనితోపాటు ఉండే పరిచయస్తుడు శివనారాయణ చనిపోయినట్లు చెప్పాడు. ఏం జరిగిందో తెలియక, తమ బిడ్డను కడసారి ఎలా చూడాలో తెలియక శివనారాయణ తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉక్రెయిన్ ఆధీనంలోకి 28 రష్యా పట్టణాలు

కీవ్/మాస్కో, ఆగస్టు 13: ఉక్రెయిన్ సైన్యం దూకుడు పెంచింది. కుర్స్క్ ప్రాంత సరిహద్దు గుండా రష్యాలోకి 12 కిలోమీటర్ల మేర చొచ్చుకెళ్లింది. అక్కడ సుమారు 40 కిలోమీటర్ల ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొంది. దీంతో ఆ ప్రాంతం నుంచి 1.80 లక్షల మంది ఇళ్లు, ఆస్తులను వదిలి తరలిపోయారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యా ఎదుర్కొంటున్న అతిపెద్ద విదేశీ దాడి ఇది. కాగా, రష్యాలోని వెయ్యి చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని ఉక్రెయిన్ మిలిటరీ చీఫ్ అలెక్జాండర్ సిర్స్కీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల అధికారులు, సైనిక ఉన్నతాధికారులతో రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలోని 28 పట్టణాలు, గ్రామాలను ఉక్రెయిన్ సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుందని ఆ ప్రాంత తాత్కాలిక గవర్నర్ అలెక్సీ స్మిర్నోవ్ ఈ సమావేశంలో పుతిన్ దృష్టికి తీసుకొచ్చారు. ఉక్రెయిన్ దళాలు కనీసం 12 కిలోమీటర్ల వరకు చొచ్చుకొచ్చాయని, సరిహద్దులోని 40 కిలోమీటర్లకుపైగా ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయని చెప్పారు. దీంతో అక్కడి ప్రజలకు సాయం చేయడంపై దృష్టి కేంద్రీకరించాలని గవర్నర్‌కు పుతిన్ నిర్దేశించారు. కాగా, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విదేశీ సైన్యం రష్యా భూభాగాన్ని ఆక్రమించడం ఇదే తొలిసారి.

రూ.60వేల కోట్లతో 6 జలాంతర్గాములు

ముంబై, ఆగస్టు 13: అత్యాధునిక సాంకేతికతతో ఆరు జలాంతర్గాములను రూ.60వేల కోట్లతో నిర్మించడానికి ప్రభుత్వ యాజమాన్యంలోని మజగావ్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్)కు భారత నౌకాదళం ఆమోదం తెలిపింది. ప్రాజెక్ట్ 75 ఇండియా కింద జలాంతర్గాముల ట్రయల్స్ పూర్తయిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో పెరుగుతున్న చైనా, పాక్‌ల ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ఈ ఒప్పందం భారత్‌కు అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం జర్మనీకి చెందిన థైస్సెన్ క్రుప్ భాగస్వామ్యంతో ఎండీఎల్... లార్సెన్ అండ్ టుబ్రో, నవంతియాతో పోటీ పడింది. ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్(ఏఐపీ) వ్యవస్థ కలిగిన ఆరు అధునాతన, సంప్రదాయ జలాంతర్గాములు కొనుగోలు చేయాలని భారత్ యోచిస్తోంది.



ఎన్‌జీ రంగా వర్సిటీలో

పీజీ, పీహెచ్‌డీ ఎన్‌ఆర్‌ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్‌ఆర్‌ఐ/ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్ లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

- పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి పీజీ, డిగ్రీ ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లామ్, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,25,000

☆ **దరఖాస్తు ఫీజు:** రూ.2,000 ☆ **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600



☆ **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
☆ **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
☆ **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
☆ **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
☆ **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

జాబ్ కార్నర్

ఐఎంయూలో అసిస్టెంట్ ఉద్యోగాలు

ఖాళీలు: 27

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **అసిస్టెంట్:** 15 పోస్టులు
- **అసిస్టెంట్(ఫైనాన్సింగ్):** 12 పోస్టులు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉండాలి.

జీతం: నెలకు రూ.5,200 నుంచి రూ.20,000 వరకు

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక: ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.700, ఇతరులకు రూ.1000.

పని ప్రదేశం: చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చి

పరీక్ష కేంద్రాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, పట్నా, కోల్‌కతా, గువాహటీ, హైదరాబాద్, చెన్నై, కొచ్చిన్, బెంగళూరు, ముంబయి, భోపాల్, జైపూర్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 30

వెబ్‌సైట్: https://www.imu.edu.in/imunew/



మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org

'క్యాట్' స్కోరింగ్ ఇలా!

ఇతర జాతీయ స్థాయి పోటీ పరీక్షలతో పోల్చితే కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) కఠినమైనదే. 21 ఐఐఎంలతోపాటు ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏలో ప్రవేశం కోరుకునే వారందరూ తప్పనిసరిగా 'క్యాట్'లో మంచి స్కోరు సాధించాలి. ఇటీవల ఎన్టీఏ నిర్వహించిన పలు పరీక్షల పేపర్లు లీక్ అయిన సందర్భాలు ఉన్నప్పటికీ, 'క్యాట్' ఆదరణ ఏ మాత్రం చెక్కు చెదరలేదు. అందుకు దానికి వచ్చే దరఖాస్తులే నిదర్శనం.



వాస్తవానికి ఐఐఎంలలో ఎంబీఏలో ప్రవేశానికి 'క్యాట్'ని ఉద్దేశించినప్పటికీ... మెరుగైన స్కోరు ఉండి ఐఐఎంలలో సీటు రాని వారు దేశంలోని ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో చేరేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే దేశంలోని మెజార్టీ మేనేజ్‌మెంట్ విద్యాలయాలు క్యాట్ స్కోరు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తున్నాయి.

- క్యాట్‌కు ప్రిపేర్ అయిన అభ్యర్థులు మ్యాట్, ఎక్స్‌ఏటీ, సీమ్యాట్ వంటి మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షలను కూడా అటెంప్ట్ చేయగలరు. ఎందుకంటే ఈ పరీక్షల సిలబస్ కూడా దాదాపు క్యాట్‌తో సరిపోలి ఉంటుంది. అందువల్ల అభ్యర్థులు క్యాట్‌పై పట్టు సాధిస్తే ఇతర మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షలు ఏమంత కష్టంగా అనిపించవు.

సెక్షన్ల వారీగా ప్రిపరేషన్

క్యాట్ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. అవి.. వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అండ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ. అభ్యర్థులు ప్రతీ సెక్షన్‌ను క్రమ పద్ధతిలో అధ్యయనం చేయాలి. దీనికంటే ముందు పరీక్ష విధానాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. అంటే సిలబస్, ప్యాటర్న్, టైమ్ అల్లోకేషన్, వెయిటేజీ, ప్రశ్నల కఠినత్వం వంటి వాటిపై సమగ్ర అవగాహనకు రావాలి. ఆ తరవాతే ప్రిపరేషన్‌ను ప్రారంభించాలి. కోచింగ్ సెంటర్‌కు వెళ్లాలా? సొంత ప్రిపరేషన్‌ను ఆరంభించాలా? అనేది తమ తమ సామర్థ్యాలను బట్టి అభ్యర్థులు నిర్ణయించుకోవాలి. సరిపడే మెటీరియల్‌ను సేకరించుకుని సొంత ప్రిపరేషన్‌తో ఐఐఎంలో సీటు సాధించిన వారు ఎందరో ఉన్నారు. అందువల్ల కోచింగ్ తప్పనిసరి ఏమీ కాదు.

- రెగ్యులర్ స్టడీస్‌తో పోల్చితే క్యాట్‌లో టాపిక్స్ కొంత మేర భిన్నంగా ఉంటాయి. అంతమాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదు. ఒకసారి క్యాట్ సరళిపై అవగాహన వస్తే.. ప్రిపరేషన్‌కు అవసరమైన మెటీరియల్‌ను సేకరించడం సులువే. మార్కెట్‌లో క్యాట్/మ్యాట్‌కు సంబంధించిన మెటీరియల్ లభిస్తోంది. సబ్జెక్టుల వారీగా ఎన్నో పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

వీటికి తోడు గత ప్రశ్న పత్రాలను సాధించడం ద్వారా ప్రిపరేషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అన్ని విభాగాల్లోనూ పట్టు సాధించినప్పుడే క్యాట్‌లో మొత్తంగా మంచి స్కోరు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రిపరేషన్‌లో కష్టంగా అనిపించిన విభాగాలు లేదా ప్రశ్నలను వదిలివేయాలి. మిగతా వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. కష్టంగా అనిపించిన వాటిని నిపుణులు లేదా తోటి అభ్యర్థులను అడిగి నివృత్తి చేసుకోవాలి. వాటికి అదనపు సమయాన్ని కేటాయించాలి లేదా ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ఏ పోటీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి అయినా తప్పనిసరిగా తన బలాలు, బలహీనతలు గుర్తించగలగాలి. డెయిలీ/వీక్లీ స్టడీ షెడ్యూల్‌ను రూపొందించుకోవాలి. దాన్ని కచ్చితంగా ఫాలో కావాలి. ప్రిపరేషన్ స్ట్రాటజీ మేరకు అధ్యయనం కొనసాగుతుందో లేదో తరచుగా చెక్ చేసుకుంటూ ఉండాలి. క్యాట్‌కు ప్రిపేర్ అవుతున్న తోటి అభ్యర్థులతో ఎప్పటికప్పుడు సిలబస్‌లోని టాపిక్‌లపై చర్చిస్తూ ఉండాలి. ఒకరితో చర్చించడం, వారి నుంచి మనకు తెలియని విషయాలు నేర్చుకోవడం మంచి ఫలితాలను ఇస్తుంది. ఒకవైపు ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకరిస్తూనే దానికి సమాంతరంగా మేథమెటికల్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్‌ను పెంచుకునే ప్రయత్నం చేయాలి. మేథమెటికల్ స్కిల్స్ అంటే మరేమిటో కాదు... అవి ఫండమెంటల్స్ ఆఫ్ రేషియోస్, పర్సంటేజెస్, ఇంటరెస్ట్, ఇతర క్యాలిక్యులేషన్స్.

పరీక్ష రాయడం

ఇచ్చిన ప్రశ్నల్లో కోర్ ఇష్యూస్‌ని అర్థం చేసుకోవడం, గందరగోళానికి లోను కాకుండా ఉండటంతో పాటు అనవసర డేటా లేదా సమాచారాన్ని ఫిల్టర్ చేయడంలో మేథమెటికల్ క్రిటికల్ థింకింగ్ పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ రీజనింగ్ ప్రశ్నల్లో కొన్ని తికమక పెట్టేవిగా ఉంటాయి. కాబట్టి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలను రెండు విధాలుగా సాధించవచ్చు. మొదట..మీకు కరెక్టుగా అనిపించిన సమాధానాలను గుర్తిస్తూ... తెలియని వాటిని ఎలిమినేట్ చేస్తూ వెళ్లడం. తరవాత సమయం ఉంటే తెలియని వాటిని ప్రయత్నించడం. ఏదేమైనప్పటికీ తెలియని వాటికి ఊహిస్తూ సమాధానాలను గుర్తించడం కంటే ఎలిమినేట్ చేయడమే ఉత్తమం. ఇక క్యాట్ పరీక్షలో మరో ప్రధాన అంశం వేగం. చాలా మంది అభ్యర్థులు మొత్తం ప్రశ్న పత్రాన్ని అటెంప్ట్ చేయడంలో విఫలమవుతున్నారు. ఎందుకంటే వారు కఠినమైన ప్రశ్నలు సాధించడంలో మునిగిపోయి టైం మేనేజ్‌మెంట్‌ను పట్టించుకోరు. కాబట్టి పరీక్షలో ప్రతీ సెకను విలువైనదనే విషయాన్ని అభ్యర్థులు గమనంలో పెట్టుకోవాలి. సమాధానాన్ని గుర్తిస్తూ ఒక ప్రశ్న నుంచి మరో ప్రశ్నకు వేగంగా షిఫ్ట్ అవ్వాలి. కచ్చితత్వంతో పాటు వేగంపై పట్టు సాధించాలంటే వీలైనన్ని మాక్ టెస్ట్‌లను సాధించాలి. ఇందుకోసం పెయిడ్ లేదా ఫ్రీ మాక్‌టెస్ట్‌లు ఎన్నో నేడు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటున్నాయి. గత పరీక్షలపై విశ్లేషణలు పరిశీలించడం, క్యాట్‌లో విజయం సాధించిన అభ్యర్థుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడం క్యాట్ విజయానికి సోపానాలు.

లిటిల్స్



ఎవరెక్కువ తినాలి?

ఒక ఊరిలో రాము, గోవిందు, రఘు అనే ముగ్గురు మిత్రులు ఉండేవారు. వారు ముగ్గురూ పనిమీద పొరుగూరికి ప్రయాణం అయ్యారు. దారి మధ్యలో వారికి బాగా ఆకలి వేసింది. చుట్టూ చూస్తే, వారికి ఎక్కడినుంచో తియ్యని వాసన వచ్చింది. వెతికి చూడగా అది బాగా పండిన ఒక పనస పండు దగ్గరలో ఉన్న చెట్టుకు కాసి ఉంది. రాము త్వరగా వెళ్లి, ఆ పనస పండును కోసాడు. రఘు దాన్ని వలిచి తొనలు వేరు చేసాడు ఈలోగా ఆ ముగ్గురిలో ఎవరు ఎక్కువ తినాలనే వాదన మొదలైంది పండును ముందుగా చూసి, చెట్టునుండి కోసింది నేను కాబట్టి నేనే ఎక్కువ తినాలి అన్నాడు రాము. దాన్ని పొట్టు ఒలిచి తొనలు వేరు చేసింది నేను కాబట్టి నేనే ఎక్కువ తినాలన్నాడు రఘు. మన ముగ్గురిలో నేనే పెద్ద వాడిని కాబట్టి నేనే ఎక్కువ తింటాను అన్నాడు గోవిందు. అలా కాసేపు వాదులాడుకున్నాక అలసటవల్ల ముగ్గురూ అదే చెట్టు కింద నిద్రపోయారు. కొంత సేపటికి మేలుకుని చూసేసరికి పండు కనిపించలేదు. రాము, రఘు ఇద్దరూ ఆ పండును ఇంకా నిద్రపోతూ ఉన్న గోవిందు తినేసి ఉంటాడని అనుకున్నారు. ఇద్దరూ గోవిందును పండు ఏదని అడిగారు. దానికి గోవిందు 'నిద్రలో కలలో నాకు దేవుడు కనిపించి, పండు తినమని చెప్పాడు. అందుకే పండు మొత్తం నేనే తినేసాను' అని చెప్పాడు. ఇద్దరూ గోవిందును చాలా తిట్టారు. 'ఎంత దేవుడు కలలో కనపడి చెబితే మాత్రం మాకు రెండు తొనలైనా ఉంచకుండా మొత్తం తింటావా నువ్వు అసలు మా మిత్రుడివేనా?' అని దెబ్బలాడారు రాము, రఘు. మెల్లగా చెట్టు చాటునుండి దాచిన పండు తీసుకుని వచ్చి వారికి ఇస్తూ, ఇలా అన్నాడు గోవిందు 'అసలు మీరు మిత్ర ధర్మం పాటించారా చెప్పండి ఉన్న పనస తొనలు ముగ్గురం సమానంగా పంచుకుని తినాలే కానీ ఒకరు ఎక్కువ తినడం, మరొకరు తక్కువ తినడం ఏమిటి? మీరు ఇలా చిన్న పిల్లల లాగా గొడవ పడుతుంటే చిరాకు వేసి, నేనే పండు దాచేసాను. నిద్ర లేచాక అందరం సమానంగా పంచుకుని తిందామని' అన్నాడు. ఆ మాటలకు సిగ్గుపడ్డ రాము, రఘు మరెప్పుడూ తమలో తాము గొడవలు పడకూడదని అనుకున్నారు.

దారి కనుక్కోండి





7 తేడాలు గుర్తించండి



ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 383

5					3
	4	2			5
4		3		5	
	5		3		4
1			5	3	
2					1

సుడోకు - 382 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.